VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : శుక్రవారం 31.07.2026
సంపుటి : 09 సంచిక : 52 , పేజీలు : 12 , వెలరూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com



గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా గారిని లష్కర్ బోనాల ఉత్సవాలకు ఆహ్వానించిన దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

# పేద ప్రజల గుండె చప్పుడు.. లైఫ్‌లైన్ ఆర్టీసీ..

## కరీంనగర్‌లో సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులకు శ్రీకారం..

- మొదటి దశలో మూడు రూట్లలో సేవలు
- త్వరలో చల్మెడ, ప్రతిమ మెడికల్ కాలేజీ, మానకొండూరు వరకు విస్తరణ
- పేదల సంక్షేమం.. ప్రయాణికుల సౌకర్యమే ప్రభుత్వ లక్ష్యం..
- సిటీ బస్సులను విద్యార్థులు మహిళలు ప్రజలు విస్తృతంగా వినియోగించుకోవాలి..
- రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**కరీంనగర్, వెలుతురు జూలై 30:**

"ఆర్టీసీ పేద ప్రజల గుండె చప్పుడు.. లైఫ్‌లైన్. కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యమే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం" అని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. కరీంనగర్ నగర ప్రజలకు ఆధునిక, సౌకర్యవంతమైన ప్రజా రవాణా సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం సాయంత్రం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బస్ స్టేషన్‌లో సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులను ఘనంగా ప్రారంభించారు. అనంతరం కరీంనగర్ బస్ స్టేషన్ నుంచి వాగేశ్వరి కాలేజీ వరకు సిటీ బస్సులో ప్రయాణించి ప్రయాణికులతో మమేకమయ్యారు.మొదటి దశలో కరీంనగర్–వాగేశ్వరి కాలేజీ, కరీంనగర్–చింతకుంట, కరీంనగర్–కొత్తపల్లి హవేలీ రూట్లలో సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులను ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కరీంనగర్ నగరంలో ఎన్నో ఏళ్లుగా ఉన్న సిటీ బస్సుల డిమాండ్‌ను నెరవేర్చామని తెలిపారు. పెరుగుతున్న నగర అవసరాలకు అనుగుణంగా ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని, విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు ఈ సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని కోరారు. ప్రతిరోజూ ఉపాధి కోసం చింతకుంట, ఓద్యారం, కొత్తపల్లి ప్రాంతాల నుంచి కరీంనగర్‌కు వచ్చే కార్మికులు, ఉద్యోగులు, అలాగే వాగేశ్వరి, ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల విద్యార్థులకు ఈ బస్సులు ఎంతో ఉపయోగపడతాయని మంత్రి తెలిపారు.

## ఆ నిధులపై అనుమానాలున్నాయ్....
# విచారణ జరపండి

- ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగంపై ఫిర్యాదులొచ్చాయి
- 15వ ఆర్థిక సంఘం నిధులను మళ్లించాలంటూ గ్రామ సర్పంచ్‌లపై ఒత్తిడి తెస్తున్నారు
- గ్రామీణ ప్రజాస్వామ్యానికి పంచాయతీరాజ్ వ్యవస్థే పునాది
- ఈ వ్యవస్థలో నిధుల వినియోగంలో నిబంధనలను ఉల్లంఘిస్తే గ్రామాల అభివృద్ధిపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదముంది



- పంచాయతీల ఆర్థిక స్వయం ప్రతిపత్తి దెబ్బతింటోంది
- వెంటనే మీరు జోక్యం చేసుకోండి
- పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య జారీ చేసిన ప్రెస్ నోట్ ను పరిశీలించండి


# తెలంగాణలో భారీ వర్షాలు.. నిండుకుండల్లా జలాశయాలు!

- రాష్ట్రవ్యాప్తంగా వానలు, జలాశయాలకు జలకళ: 33 శాతానికి చేరిన నిల్వలు
- గోదావరిలో ఉద్ధృతంగా ప్రవాహం: భద్రాచలంలో 27 అడుగులకు చేరిన నీటిమట్టం



## ప్రపంచంతో పోటీ పడే విద్యే లక్ష్యం

- తెలంగాణలో ఫిన్లాండ్, జర్మనీ తరహా విద్యావిధానం: సీఎం రేవంత్‌రెడ్డి




- ప్రపంచజ్ఞానం అందించాలన్న సూచన
- వెనుకబాటుతనాన్ని రూపుమాపేది విద్య ఒక్కటేనన్న ముఖ్యమంత్రి
- 12వ తరగతి వరకు విద్యార్థులకు
- సర్కారు పాఠశాలల్లో ఏఐ కోడింగ్ ల్యాబ్‌ల ఏర్పాటుకు చర్యలు

## రెండేళ్లలో ఎన్నో చెరువులను పునరుద్ధరించాం



- వివరణ ఇచ్చిన హైడ్రా
- చెరువుల పునరుద్ధరణ నుంచి నాలాల విస్తరణ వరకు నగరానికి ఊరట
- రెండేళ్లలో పలు కీలక ఆపరేషన్లు పూర్తి
- చెరువులు, నాలాల పునరుద్ధరణతో వరద ముప్పు తగ్గింపు
- లక్షల మందికి ఉపశమనం కలిగించిన చర్యలు

## వాయుగుండం ప్రభావం నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- భారీ వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి



- పలు జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ
- డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

## అంగన్వాడీల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట: మంత్రి సీతక్క

- గత ఏడాది కాలంలోనే 5,938 కేంద్రాలకు టాయిలెట్లు, 3,815 కేంద్రాలకు తాగునీరు, 14,271 కేంద్రాలకు విద్యుత్ సదుపాయం కల్పించాలి



- రాష్ట్రంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో వంద శాతం మౌలిక వసతులు
- ఏ మాత్రం జాప్యం లేకుండా అన్ని జిల్లాల్లో అంగన్వాడీ చిన్నారులకు పాలు, బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలు చేయాలి

## భీమేశ్వర స్వామి ఆలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పూజలు

- స్వాగతం పలికిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే



**వేములవాడ వెలుతురు జూలై 30:**

జిల్లా పర్యటనలో భాగంగా వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం పూజలు చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ కు ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఆలయంలోకి మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, ఎస్పీ మహేష్ బి గితే కు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ ,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రాష్ట్రంలో సమృద్ధి వర్షాలు కురవాలని, పాడి పంటలు పండాలని ప్రజలంతా ఆయు ఆరోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు చేశారు.

## పటాన్‌చెరు-ఆదిలాబాద్ రైల్వే లైన్ వేగం పెంచండి

- కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో తెలంగాణ ఎంపీల భేటీ..



- వినతిపత్రం సమర్పణ
- ప్రాజెక్టుకు త్వరితగతిన ఆమోదం ఇవ్వాలని వినతి
- పటాన్‌చెరు–ఆదిలాబాద్ లైన్‌ను పింక్‌బుక్‌లో చేర్చాలని విజ్ఞప్తి
- న్యూఢిల్లీలో రైల్వే మంత్రిని కలిసిన ఏలేటి మహేశ్వర్‌రెడ్డి
- డీపీఆర్ ఇప్పటికే రైల్వే బోర్డుకు చేరిందని
- బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి
- గతంలో కేంద్రం వెల్లడి

## జూరాలకు పోటెత్తుతున్న వరద

- 10 గేట్లు ఎత్తి నీటి విడుదల..
- శ్రీశైలానికి 77 వేల క్యూసెక్కుల ప్రవాహం
- ఎగువ నుంచి భారీగా చేరుతున్న వరద నీరు
- జూరాల 10 గేట్లు ఎత్తిన అధికారులు
- 90 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు



**జోగులాంబ గద్వాల, వెలుతురు, జూలై 30:**

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో జోగులాంబ గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టుకు వరద ఉద్ధృతి పెరుగుతోంది. ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరుతుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రస్తుతం ప్రాజెక్టు 10 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.ప్రస్తుతం జూరాల ప్రాజెక్టులోకి 90,000 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. దిగువకు గేట్ల ద్వారా 39,080 క్యూసెక్కులు, జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా 38,272 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మొత్తంగా 77,352 క్యూసెక్కుల నీరు శ్రీశైలం జలాశయం వైపు ప్రవహిస్తోంది.

ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో జూరాలకు వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. అవసరమైతే ప్రాజెక్టులోని మరిన్ని గేట్లు ఎత్తి నీటి విడుదల పెంచేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు పాటించాలని సూచించారు.

# పేద ప్రజల గుండె చప్పుడు..

(మొదటి పేజీ తరువాయి)

భవిష్యత్తులో చల్మెడ, ప్రతిమ మెడికల్ కాలేజీ, మానకొండూరు వరకు కూడా సిటీ బస్సు సేవలను విస్తరిస్తామని ప్రకటించారు.ప్రయాణికుల ఆదరణను బట్టి అవసరమైతే ఒకే రూట్‌లో అదనపు బస్సులు నడపడంతో పాటు, 24 గంటల సేవలు అందించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నగరంలోని అన్ని ప్రాంతాలకు దశలవారీగా సిటీ బస్సు సేవలను విస్తరించనున్నట్లు వెల్లడించారు.వి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేశామని, ఆర్టీసీ అభివృద్ధికి అనేక సంస్కరణలు చేపట్టామని మంత్రి పేర్కొన్నారు. కొత్త బస్సుల కొనుగోలు, కొత్త నియామకాలు, కారుణ్య నియామకాలు, కార్మికుల పెండింగ్ బకాయిల చెల్లింపు, ఉద్యోగుల సంక్షేమం వంటి చర్యలతో సంస్థను బలోపేతం చేశామని చెప్పారు. ప్రస్తుతం ఆర్టీసీ బస్సులు ప్రతిరోజూ 35 లక్షల కిలోమీటర్లు ప్రయాణిస్తూ 65 లక్షల మంది ప్రయాణికులకు సేవలందిస్తున్నాయని, ప్రతి గ్రామానికి ఆర్టీసీ సేవలు చేరేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. డ్రైవర్లు, కండక్టర్లు అంకితభావంతో పనిచేస్తూ సంస్థ అభివృద్ధికి వెన్నెముకగా నిలుస్తున్నారని కొనియాడారు.చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, కరీంనగర్ నగర ప్రజలు సిటీ బస్సులను విస్తృతంగా వినియోగించుకోవాలని కోరారు. ఎన్నో ఏళ్ల డిమాండ్‌కు స్పందించి సిటీ బస్సులను ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆదరణతోనే ఆర్టీసీ మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు.మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ సంస్థలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ నాయకత్వంలో ప్రజలకు చేరువయ్యే రవాణా సేవలు అందుబాటులోకి వస్తున్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల వరకు సిటీ బస్సులు ఏర్పాటు చేయడం హర్షణీయమని, తమ విజ్ఞప్తికి వెంటనే స్పందించిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, మేయర్ కొలగాని శ్రీనివాస్ మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న,కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పగిడిమర్రి సోలమన్, హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఐటీ, పి, ఏఎమ్ & లీగల్) కె. రాజశేఖర్ రీజినల్ మేనేజర్ బి రాజు, డిప్యూటీ రీజనల్ మేనేజర్ (ఆపరేషన్స్) ఎస్. భూపతిరెడ్డి, డిప్యూటీ రీజనల్ మేనేజర్ (మెకానికల్) పి. మల్లేశం, కరీంనగర్ జోన్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారి బావ్ రావు, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, డిపో మేనేజర్లు ఐ. విజయ మాధురి (కరీంనగర్–1), ఎం. శ్రీనివాస్ (కరీంనగర్–2), ఎ. ప్రకాశ్‌రావు (సిరిసిల్ల), బి. శ్రీనివాస్ (వేములవాడ), ఎన్. రమేశ్ (జగిత్యాల), డి. హరి (మెట్‌పల్లి)తో పాటు ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రెండేళ్లలో ఎన్నో చెరువులను పునరుద్ధరించాం



- జలమార్గాల ఆక్రమణల తొలగింపుపై ప్రత్యేక దృష్టి

**హైదరాబాద్, వెలుతురు, జూలై 30:**

హైదరాబాద్‌లో వరదల నివారణ, చెరువుల పరిరక్షణ, నాలాల అభివృద్ధి లక్ష్యంగా ఏర్పాటు చేసిన హైడ్రా రెండేళ్లలో పలు కీలక పనులు చేపట్టింది. 2024 జూలై 19న ఏర్పాటైన ఈ సంస్థ చెరువుల పునరుద్ధరణ, వరద కాలువల విస్తరణ, డిసిల్టింగ్, ఆక్రమణల తొలగింపు వంటి చర్యలతో నగరంలోని అనేక ప్రాంతాల్లో వరద సమస్యలను తగ్గించింది. పలు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించిందని అధికారులు పేర్కొంటున్నారు.

జూబ్లీహిల్స్ నుంచి వచ్చే వరద ప్రవాహంతో ప్రతి వర్షాకాలంలో కృష్ణానగర్, అమీర్‌పేట ప్రాంతాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవి. ముఖ్యంగా అమీర్‌పేట మెట్రో స్టేషన్ కింద నడుం లోతు వరకు నీరు నిలిచి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడేది. వరద నీటి పైపులైన్లు పూర్తిగా పూడికతో నిండిపోవడమే దీనికి కారణమని గుర్తించిన హైడ్రా.. పైపులైన్లలోని పూడికను తొలగించింది. అలాగే కృష్ణానగర్–శ్రీనివాస్‌నగర్–అమీర్‌పేట వరకు నాలాలను డిసిల్టింగ్ చేయడంతో వరద నీరు సాఫీగా వెళ్లే పరిస్థితి ఏర్పడింది.

బేగంపేట–సికింద్రాబాద్ మార్గంలోని ప్యాట్నీ నాలా ఆక్రమణలు తొలగించడం కూడా హైడ్రా చేపట్టిన కీలక చర్యల్లో ఒకటి. ఒకప్పుడు 72 అడుగుల వెడల్పు ఉన్న నాలా ప్యాట్నీ వద్ద 10 అడుగులకు కుదించబడటంతో ప్రతి వర్షానికి వరద ముప్పు ఏర్పడేది. ఆక్రమణలను తొలగించి నాలాను పూర్తిస్థాయిలో విస్తరించడంతో ఎనిమిది కాలనీలకు చెందిన సుమారు 40 వేల కుటుంబాలు, 1.60 లక్షల మందికి వరద ఇబ్బందులు తగ్గాయని అధికారులు తెలిపారు.

బాగ్‌లింగంపల్లిలోని శ్రీరాం నగర్‌లో హుస్సేన్‌సాగర్ వరద కాలువకు అనుసంధానమైన మార్గాన్ని ఆక్రమించి మట్టితో పూడ్చివేయడంతో వర్షాల సమయంలో నీరు నిలిచిపోయేది. ఫిర్యాదు అందుకున్న వెంటనే హైడ్రా స్పందించి ఆక్రమణలను తొలగించి కాలువను పునరుద్ధరించింది. దీంతో ఆ ప్రాంతానికి వరద ముప్పు తప్పింది.

మియాపూర్‌లోని గురునాథ్ చెరువు, ఖాజాగూడ చెరువు, మల్కం చెరువుల ఇన్‌లెట్లలో పేరుకుపోయిన భారీ పూడికను కూడా హైడ్రా తొలగించింది. చెరువుల్లోకి వరద నీరు సాఫీగా చేరేలా చర్యలు చేపట్టడంతో పరిసర ప్రాంతాల్లో నీరు నిలిచే సమస్య గణనీయంగా తగ్గిందని అధికారులు పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో వరద ముప్పు తగ్గించేందుకు జలమార్గాల పునరుద్ధరణ, ఆక్రమణల తొలగింపు, చెరువుల సంరక్షణ వంటి చర్యలను భవిష్యత్తులో మరింత విస్తరించనున్నట్లు హైడ్రా అధికారులు వెల్లడించారు.

# గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా గారిని లష్కర్ బోనాల ఉత్సవాలకు ఆహ్వానించిన దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్ వెలుతురు జూలై 30:**

గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా గారిని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ గారు గురువారం లోక్ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సికింద్రాబాద్‌లో నిర్వహించనున్న ఆషాఢ బోనాల (లష్కర్ బోనాలు) ఉత్సవాలకు హాజరుకావాలని గవర్నర్ గారిని ఆహ్వానించారు. ఉజ్జయిని మహంకాళి దేవస్థాన ప్రధాన అర్చకులు ఈ సందర్భంగా ఆహ్వాన పత్రికను గవర్నర్ గారికి చదివి వినిపించారు.దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు, ఉజ్జయిని మహంకాళి దేవస్థానం ఈవో, అసిస్టెంట్ కమిషనర్ మనోహర్ రెడ్డి తదితరులు ఈ సందర్భంగా మంత్రి గారి వెంట ఉన్నారు.

# వాయుగుండం ప్రభావం నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**హైదరాబాద్ వెలుతురు జూలై 30:**

ఛత్తీస్‌గఢ్ మీదుగా పయనిస్తున్న తీవ్ర వాయుగుండం, చురుగ్గా ఉన్న నైరుతి రుతుపవనాల ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, హౌసింగ్, సమాచార & పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయిలో రెవెన్యూ యంత్రాంగం అన్ని శాఖలతో సమన్వయం చేసుకొని నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

గురువారం రెవెన్యూ, విపత్తు నిర్వహణ (డిజాస్టర్ మేనేజ్‌మెంట్) అధికారులతో మంత్రిగారు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో గడచిన రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు, రాబోయే రెండు రోజుల్లో కురిసే వర్షాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.వర్షాల ప్రభావం ఎక్కువగా ఉన్న జిల్లాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. వాగులు, వంకలు, చెరువులు, జలాశయాల వద్ద ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలి. ప్రమాదకర ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేస్తూ, అవసరమైతే వెంటనే సురక్షిత ప్రాంతాలు లేదా పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, విద్యుత్, నీటిపారుదల, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి. ఎక్కడైనా అత్యవసర పరిస్థితులు ఏర్పడితే తక్షణమే స్పందించి సహాయక చర్యలు అందించాలని సూచించారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా రవాణా, విద్యుత్, తాగునీటి సరఫరాకు ఆటంకం కలగకుండా చూడాలి. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా(హైడ్రా, జిహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల సాధారణ జీవనానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నాలుగు రోజుల క్రితం వరకు రాష్ట్రంలో 30% మేర ఉన్న వర్షపాతం లోటు, గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో భర్తీ అయి దాదాపు సాధారణ స్థాయికి చేరుకుందని మంత్రి తెలిపారు.వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం గురు, శుక్రవారాల్లో (జూలై 30 – జూలై 31) రాష్ట్రంలో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వివిధ జిల్లాలకు అలర్ట్‌లు జారీ అయ్యాయని మంత్రిగారు తెలిపారు.ఆదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశామని అలాగే నిజామాబాద్, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశామని తెలిపారు. వచ్చే రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే జిల్లాలపై ప్రధానంగా దృష్టి సారించాలని ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందస్తుగానే చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

# అంగన్వాడీల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట: మంత్రి సీతక్క

- అంగన్వాడీ టీచర్లు, ఆయాలతో జిల్లాల వారీగా సదస్సులు నిర్వహించాలి
- అధికారులను ఆదేశించిన మంత్రి సీతక్క



**హైదరాబాద్ వెలుతురు జూలై 30:**

అంగన్వాడీ కేంద్రాల్లో గత ఏడాది కాలంలోనే అదనంగా 5,938 కేంద్రాలకు టాయిలెట్ సదుపాయం, 3,815 కేంద్రాలకు తాగునీటి సదుపాయం, 14,271 కేంద్రాలకు విద్యుత్ సదుపాయం కల్పించినందుకు అధికారులు, సిబ్బందిని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అభినందించారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్వాడీ కేంద్రాలకు కనీస మౌలిక వసతులు కూడా పూర్తిస్థాయిలో అందలేదని పేర్కొన్న మంత్రి.. రాష్ట్రంలోని ప్రతి అంగన్వాడీ కేంద్రంలో వంద శాతం టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.రాష్ట్ర సచివాలయంలో మహిళా, శిశు సంక్షేమ శాఖపై మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. శాఖ కార్యదర్శి శృతి ఓజా, జాయింట్ డైరెక్టర్ మోతి తదితర అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. అంగన్వాడీ కేంద్రాల మౌలిక వసతులు, సిబ్బంది నియామకాలు, చిన్నారుల పోషకాహారం, పాఠశాల పూర్వ విద్య, దత్తత కేంద్రాలు, బాల్య వివాహాల నివారణ తదితర అంశాలపై మంత్రి సమగ్రంగా సమీక్షించారు.అంగన్వాడీ కేంద్రాల్లో మిగిలిపోయిన మౌలిక వసతుల పనులను ఏమాత్రం జాప్యం చేయకుండా పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ వంటి పనులు జరుగుతున్న ప్రాంతాల్లో సంబంధిత ఏఈలు, డీఈలతో సమన్వయం చేసుకుని పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. ఏ కేంద్రంలో ఏ పని పూర్తయింది, ఇంకా ఎంత పని మిగిలి ఉందన్న వివరాలతో నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు.అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందుతున్న పోషకాహారం, వారి ఎదుగుదలపై శాంపిల్ సర్వే నిర్వహించాలని మంత్రి సీతక్క ఆదేశించారు. సర్వే ఫలితాల ఆధారంగా పోషకాహార కార్యక్రమాలను మరింత మెరుగుపరచాలని సూచించారు. అంగన్వాడీ చిన్నారులకు పాలు, బ్రేక్‌ఫాస్ట్ అందించే కార్యక్రమాలను ఏ మాత్రం ఆలస్యం చేయకుండా అన్ని జిల్లాల్లో అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం అమలవుతున్న కార్యక్రమాలను దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి ప్రతి చిన్నారికి పోషకాహారం అందేలా చూడాలని ఆదేశించారు.చిన్నారుల ఉదయం ఆకలిని తీర్చడంతో పాటు వారి శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదపడేలా బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి సూచించారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే ప్రతి చిన్నారికి నాణ్యమైన ఆహారం అందడం ప్రభుత్వ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు.అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు జిల్లాల వారీగా అంగన్వాడీ టీచర్లు, ఆయాలతో ప్రత్యేక సదస్సులు నిర్వహించాలని మంత్రి సూచించారు. క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న సమస్యలు, అవసరాలు, సేవల మెరుగుదలకు సంబంధించిన సూచనలను స్వీకరించి వాటి ఆధారంగా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.అంగన్వాడీ టీచర్లు, ఆయాల ఖాళీల భర్తీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. 16 జిల్లాల్లో నియామకాలకు నోటిఫికేషన్లు జారీ అయినట్లు అధికారులు వివరించగా, మిగిలిన జిల్లాల్లో కలెక్టర్లతో సమన్వయం చేసుకుని ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.టీచర్లు, ఆయాల యూనిఫాంలను అక్టోబర్ తొలి వారంలోగా సిద్ధం చేయాలని, అంగన్వాడీ టీచర్లకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిప్లొమా సర్టిఫికెట్లు అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.అంగన్వాడీ కేంద్రాలు చిన్నారులను ఆకర్షించేలా, ఆహ్లాదకరమైన వాతావరణంతో ఉండాలని మంత్రి సీతక్క అన్నారు. కేంద్రాలకు ముదురు రంగులు కాకుండా పిల్లలకు ఉత్సాహాన్ని కలిగించే ఆహ్లాదకరమైన రంగులు వేయాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలు పిల్లల అభ్యాసం, ఆటపాటలు, ఆరోగ్యం, పోషణకు అనువైన వాతావరణంగా మారాలని చెప్పారు.వర్షాల నేపథ్యంలో ఎక్కడైనా అంగన్వాడీ కేంద్రాన్ని తాత్కాలికంగా మార్చాల్సిన పరిస్థితి వస్తే, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యం ఇచ్చి వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.బస్టాండ్లు వంటి రద్దీ ప్రాంతాల్లో తల్లులు తమ పిల్లలకు పాలిచ్చేందుకు వీలుగా ఇప్పటికే 54 తల్లి ఒడి కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. అవసరమైన అన్ని జిల్లాలు, ప్రాంతాల్లో ఇలాంటి కేంద్రాలను ఏర్పాటు చేసి బాలింతలకు సౌకర్యం కల్పించాలని మంత్రి సూచించారు.ప్రతి జిల్లాలో అడాప్షన్ సెంటర్లు ఏర్పాటు చేసే దిశగా చర్యలను వేగవంతం చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 17 అడాప్షన్ సెంటర్లు ఉన్నట్లు అధికారులు వివరించారు. పిల్లల సంరక్షణ, దత్తత ప్రక్రియ మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా సాగేలా వ్యవస్థను బలోపేతం చేయాలని అన్నారు.తెలంగాణను బాల్య వివాహాల రహిత రాష్ట్రంగా మార్చేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకు వెళ్లాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. గ్రామస్థాయి నుంచి విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, బాల్య వివాహాల నివారణపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.

### నిధులు లాప్స్ కాకుండా పూర్తిగా వినియోగించాలి

కేంద్రం నుంచి వచ్చే నిధులు లాప్స్ కాకుండా పూర్తిస్థాయిలో వినియోగించాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి రూపాయి సమర్థవంతంగా వినియోగించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం కోసం ప్రత్యేకంగా ఇద్దరు, ముగ్గురు అధికారులను నియమించి సమన్వయ వ్యవస్థను మరింత ప్రభావవంతంగా చేయాలని సూచించారు. క్షేత్రస్థాయి అధికారుల మధ్య సమన్వయం కోసం కూడా ప్రత్యేక బాధ్యతలు అప్పగించి, రోజువారీ, వారపు నివేదికలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.జిల్లా సంక్షేమ అధికారులు హాస్టళ్లు, అంగన్వాడీ కేంద్రాలను క్రమం తప్పకుండా సందర్శించాలని మంత్రి సూచించారు. ఎన్ని కేంద్రాలు, హాస్టళ్లను సందర్శించారు, అక్కడ గుర్తించిన సమస్యలు ఏమిటి, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలు ఏమిటన్న వివరాలతో నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.

# ప్రపంచంతో పోటీ పడే విద్యే లక్ష్యం

- ప్రతి మండలంలోని విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరేలా కృషి చేయాలని పిలుపు
- ఉపాధ్యాయుల సమస్యల పరిష్కార బాధ్యత తనదేనని హామీ
- ఆరు నెలలకోసారి టీచర్లతో సమావేశమై సమీక్షిస్తానన్న సీఎం
- ప్రభుత్వ కాలేజీలపై విద్యార్థుల్లో విశ్వాసం పెంచాలని సూచన
- విద్య, పిల్లల కోసం ఎంత ఖర్చైనా వెనుకాడబోమన్న రేవంత్
- 2034 వరకు తానే ముఖ్యమంత్రిగా కొనసాగుతానని వ్యాఖ్య
- రాజీనామా ఎందుకు చేయాలని ప్రతిపక్షాలను ప్రశ్నించిన సీఎం

**హైదరాబాద్, వెలుతురు, జూలై 30:**

ప్రపంచ దేశాలతో పోటీ పడే స్థాయికి తెలంగాణ విద్యార్థులను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఫిన్లాండ్, జర్మనీ వంటి దేశాల విద్యా విధానాలను కేవలం అధ్యయనం చేయడం కాకుండా రాష్ట్రంలో అమలు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. వెనుకబాటుతనాన్ని తొలగించగల శక్తి విద్యకే ఉందని, భాషా పరిజ్ఞానం మాత్రమే కాకుండా 12వ తరగతి వరకు విద్యార్థులకు ప్రపంచజ్ఞానం అందించాలని సూచించారు. ఫిన్లాండ్, జర్మనీలో పర్యటించిన ఉపాధ్యాయులతో హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ప్రభుత్వ పాఠశాలలను అత్యాధునికంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నామని సీఎం తెలిపారు. సర్కారు బడుల్లో ఏఐ కోడింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసి విద్యార్థులను భవిష్యత్ సాంకేతిక అవసరాలకు సిద్ధం చేస్తామని చెప్పారు. ప్రతి మండలంలోని విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చేరేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని, విద్యాభివృద్ధికి అవసరమైన సూచనలు కింది స్థాయి నుంచే రావాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సలహాల ఆధారంగానే విధానాలను రూపొందించి అమలు చేస్తామని చెప్పారు.

తాను కూడా మధ్యతరగతి కుటుంబంలో పుట్టి ప్రభుత్వ పాఠశాలలోనే చదివానని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. ప్రభుత్వ విద్యతోనే ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్నానని పేర్కొంటూ, ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థుల జీవితాలను మార్చగల సామర్థ్యం కలిగి ఉన్నాయని అన్నారు. ప్రభుత్వ కాలేజీల్లో చదివితే ఉద్యోగాలు వస్తాయనే నమ్మకాన్ని విద్యార్థుల్లో కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని చెప్పారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కార బాధ్యత తనదేనని హామీ ఇచ్చిన సీఎం, పిల్లల విద్యకు సంబంధించిన అంశాలపై మాత్రం ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని కోరారు.

ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఉపాధ్యాయులతో సమావేశమై సమస్యలు, సూచనలపై చర్చిస్తానని తెలిపారు. ఐఏఎస్ అధికారులను చేసినంత సులువుగా టీచర్ల బదిలీలు చేయలేమని వ్యాఖ్యానించారు.

రాజకీయ అంశాలనూ ప్రస్తావించిన రేవంత్‌రెడ్డి, 2034 వరకు తానే ముఖ్యమంత్రిగా కొనసాగుతానని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు చెల్లించడం ప్రభుత్వ బాధ్యత అని చెప్పారు. విద్యాశాఖకు రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్‌పై స్పందిస్తూ, విద్యార్థులకు అల్పాహారం అందించడం, విద్యా సంస్కరణలు చేపట్టడమే తన తప్పా అని ప్రశ్నించారు. విద్య, పిల్లల భవిష్యత్తు కోసం ఎంత ఖర్చైనా వెనుకాడబోమని స్పష్టం చేశారు.

# పటాన్‌చెరు-ఆదిలాబాద్ రైల్వే లైన్ వేగం పెంచండి

**న్యూఢిల్లీ వెలుతురు జూలై 30:**

పటాన్‌చెరు–ఆదిలాబాద్ కొత్త రైల్వే మార్గం మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతూ బీజేపీ శాసనసభా పక్ష నేత, నిర్మల్ ఎమ్మెల్యే అలేటి మహేశ్వర్‌రెడ్డి, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు న్యూఢిల్లీలో కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిశారు. ఈ రైల్వే మార్గానికి త్వరితగతిన ఆమోదం తెలపడంతో పాటు రైల్వే పింక్‌బుక్‌లో చేర్చి నిధులు కేటాయించాలని వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఉత్తర తెలంగాణ జిల్లాలకు మెరుగైన రైలు అనుసంధానం కల్పించడంలో పటాన్‌చెరు–ఆదిలాబాద్ రైల్వే లైన్ కీలకమని ప్రతినిధి బృందం వివరించింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే పారిశ్రామిక, వాణిజ్య, వ్యవసాయ రంగాలతో పాటు ప్రయాణ సౌకర్యాలు కూడా మెరుగుపడతాయని కేంద్ర మంత్రికి వివరించినట్లు సమాచారం.ఇప్పటికే ఈ రైల్వే మార్గానికి సంబంధించి డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు (డీపీఆర్)ను దక్షిణ మధ్య రైల్వే రైల్వే బోర్డుకు సమర్పించినట్లు కేంద్ర ప్రభుత్వం గతంలో పార్లమెంట్‌లో వెల్లడించింది. సుమారు 320 కిలోమీటర్ల పొడవుతో ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టు పరిశీలనలో ఉన్నట్లు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ పార్లమెంట్‌కు తెలిపిన విషయం తెలిసిందే.

అలాగే ఇటీవల కూడా పటాన్‌చెరు–ఆదిలాబాద్ రైల్వే లైన్‌ను పింక్‌బుక్‌లో చేర్చి త్వరగా మంజూరు చేయాలని బీజేపీ నేతలు కేంద్ర రైల్వే శాఖను కోరినట్లు సమాచారం. ప్రాజెక్టుకు సంబంధించిన పరిపాలనా అనుమతులు, నిధుల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది.

# కూరగాయల సాగును ప్రోత్సహించండి



- సెంట్రలైజ్డ్ కిచెన్స్ పరిసర ప్రాంతాల్లో దృష్టి పెట్టండి
- ఆర్గానిక్ సాగు దిశగా రైతులకు అవగాహన కల్పించండి
- నిపుణుల కమిటీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఎల్ నినో పరిస్థితుల ప్రభావంపై నివేదికను అందజేసిన కమిటీ

**హైదరాబాద్ వెలుతురు జూలై 30:**

రాష్ట్రంలో కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు వ్యవసాయ శాఖతో కలిసి అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇందుకు అవసరమైన విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనాన్ని అందించేందుకు కొత్తగా నిర్మిస్తున్న సెంట్రలైజ్డ్ కిచెన్ పరిసర ప్రాంతాల్లో ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. ఆర్గానిక్ పద్ధతిలో కూరగాయలు, ఇతర పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులు పండించిన పంటలను నేరుగా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ నుంచి ఎక్స్టెన్షన్ అధికారులను నియమించి, సంబంధిత విభాగాల్లో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గురువారం ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ఎల్ నినో పరిస్థితుల ప్రభావంపై నిపుణుల కమిటీ నివేదికను సమర్పించింది. నివేదికలో కమిటీ ప్రభుత్వానికి పలు కీలక సూచనలు చేసింది. తెలంగాణలో ప్రస్తుత ఎల్ నినో పరిస్థితుల ప్రభావం, అత్యవసర కార్యాచరణ ప్రణాళికపై నివేదికలో ప్రస్తావించింది. రాష్ట్రంలో తగినంత వర్షపాతం నమోదు కాకపోవడంతో వ్యవసాయంపై తీవ్ర ప్రభావం పడిందని తెలిపింది. ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని పేర్కొంది. గ్రామాల వారీగా అత్యవసర ప్రణాళికలు రూపొందించి పప్పు ధాన్యాలు, నూనె గింజలు, చిరు ధాన్యాలు, కూరగాయల పంటలను ప్రోత్సహించాలని తెలిపింది. 75శాతం సబ్సిడీతో ఈ పంటలకు సంబంధించిన విత్తనాలను అందించాలని, ప్రత్యామ్నాయ పంటలకు కొత్త రుణాలు మంజూరు చేయాలని కమిటీ సూచించింది.గత ఏడాది ఈ సీజన్ లో 79.49 లక్షల ఎకరాలు సాగవగా, ఈ ఏడాది 74.56 లక్షల ఎకరాలు మాత్రమే సాగయ్యాయని పేర్కొంది. పత్తి పంట 45 లక్షల ఎకరాలు, సోయాబీన్ 3.62 లక్షల ఎకరాలు, వరి 14.92 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ప్రధాన పంటల సాగు ఉందని నివేదికలో తెలిపింది. ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో 75 నుంచి 90శాతం సబ్సిడీ అందించి డ్రిప్, స్ప్రింక్లర్ సాగు పద్ధతులను ప్రోత్సహించాలని సూచించింది. పశుగ్రాస విత్తనాలు సబ్సిడీపై అందించి... పశు గ్రాస సాగును ప్రోత్సహించాలని, సాగునీటి కోసం నిరంతర విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని తెలిపింది. వ్యవసాయ విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తల ద్వారా రైతులకు సాంకేతిక సూచనలు అందించాలంది. హైదరాబాద్ పరిసర గ్రామాల్లో కూరగాయల సాగును ప్రోత్సహిస్తూ రైతు బజార్లకు రవాణా సౌకర్యం కల్పించాలని నివేదికలో పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో డైరీ యూనిట్లను స్థాపించేందుకు ఆర్థిక సహాయం అందించాలని, అత్యవసర చర్యల అమలును పర్యవేక్షించేందుకు గ్రామస్థాయి బృందాలను ఏర్పాటు చేయాలని తెలిపింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి, నిపుణుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# సబ్ సెంటర్లు, పిహెచ్సిలు, సిహెచ్సిలు, ఏరియా ఆసుపత్రుల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి



- ప్రతి డాక్టరు కమిట్మెంట్తో పని చేయాలి, డాక్టర్ వృత్తి గొప్పది, బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించొద్దు
- పేద ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట
- వైద్యశాఖ సమీక్షలో కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

**మునుగోడు వెలుతురు జూలై 30:**

మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా సబ్ సెంటర్లు పీహెచ్సీలు సిహెచ్సిలు ఏరియా ఆసుపత్రులను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి అవసరమయ్యే మౌలిక సదుపాయాలు, సిబ్బంది, సాంకేతిక పరికరాలు, కావలసిన నిధులకు సంబంధించిన వివరాలతో ప్రణాళికలు సిద్ధం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా నల్గొండ జిల్లా వైద్యాధికారులను ఆదేశించారు గౌరవ మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి మునుగోడు లోని క్యాంపు కార్యాలయంలో వైద్యశాఖ సమస్యలు, చేయాల్సిన అభివృద్ధి పై యాదాద్రి భువనగిరి జిల్లా వైద్యాధికారులు నల్గొండ జిల్లా వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.. ఈ సమావేశంలో మునుగోడు, నాంపల్లి, పిహెచ్సిల ఆధునీకరణ తోపాటు 30 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయడం, మర్రిగూడ సిహెచ్సి ని 30 పడకల నుండి 50 పడకలకు పెంచడం సిబ్బంది నియామకం సాంకేతిక పరికరాల కల్పన పోస్టుమార్టం ఎగ్జామిన్ రూమ్,, చండూరు రెవిన్యూ కేంద్రంలో వంద పడకలతో ఏరియా ఆసుపత్రి మంజురు నిర్మాణం, గట్టుపల్ పిహెచ్సికి సిబ్బంది నియామకం సాంకేతిక పరికరాల కల్పన కు కావలసిన అంచనాలు రూపొందించాలన్నారు.జాతీయ రహదారి 65 పై ప్రమాదాలు జరిగినప్పుడు గోల్డెన్ హవర్లో హైదరాబాదు తీసుకెళ్లలేకపోతున్నారని ఈలోపే చాలామంది మరణిస్తున్నారని.. చౌటుప్పల్ ప్రాంతంలో అత్యవసర చికిత్స కోసం ట్రామా కేర్ సెంటర్ ని ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు... ట్రామా కేర్ సెంటర్ తో పాటు చౌటుప్పల్లో వంద పడకల ఏరియా ఆసుపత్రిని త్వరితగతిన పూర్తి చేసి సాంకేతిక పరికరాల కల్పనతో ఆధునికరించాల్సిన అవసరం ఉందన్నారు...ప్రైవేట్ ఆస్పత్రిలో బిల్లులు కట్టలేక ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉందని గుర్తు చేస్తూ ప్రజా వైద్యం పైన ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు.. ప్రస్తుతం గ్రామాలలో నిర్మించే ప్రాథమిక ఉప ఆరోగ్య కేంద్రాల బడ్జెట్ మారుతున్న పరిస్థితులు, పెరుగుతున్న ధరలు, అభివృద్ధి చెందిన సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా సరిపోవడం లేదని సబ్ సెంటర్లతో పాటు పిహెచ్సిలు సిహెచ్సీ లు, ఏరియా ఆసుపత్రుల బడ్జెట్ పెంపు విషయం కూడా ఆరోగ్యశాఖ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు... పీహెచ్సీలలో సిహెచ్సి లలో డాక్టర్లు కమిట్మెంట్తో పని చేయాలని, అన్ని వృత్తుల కంటే డాక్టర్ వృత్తి ఎంతో గొప్పదని బాధ్యత రాహిత్యంగా ప్రవర్తించొద్దన్నారు. ఈ సమీక్ష సమావేశంలో నల్గొండ జిల్లా డి ఎం హెచ్ ఓ రాహుల్, డి సి హెచ్ మాత్య నాయక్, యాదాద్రి భువనగిరి జిల్లా డి ఎం హెచ్ ఓ మనోహర్, డి సి హెచ్ సూర్య శ్రీ లతో పాటు మర్రిగూడ చౌటుప్పల్ సిహెచ్సి వైద్యాధికారులు, చండూరు మునుగోడు నాంపల్లి మర్రిగూడ వైద్యాధికారులు, నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌ను ప్రశ్నించే ముందు చైనాతో తమ సంబంధాలపై బీజేపీ, ఆర్ఎస్ఎస్ దేశ ప్రజలకు సమాధానం చెప్పాలి

- 2009, 2011 చైనా పర్యటనల పూర్తి వివరాలను బహిర్గతం చేయాలి

**హైదరాబాద్ వెలుతురు జూలై 30:**

కాంగ్రెస్ పార్టీపై "చైనా ఏజెంట్లు", "చైనాకు మద్దతుదారులు" అంటూ నిరాధార రాజకీయ ఆరోపణలు చేయడాన్ని అలవాటుగా మార్చుకున్న భారతీయ జనతా పార్టీ, ముందుగా తమకు అనుబంధంగా ఉన్న రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) నాయకుల చైనా పర్యటనలపై దేశ ప్రజలకు పూర్తి వివరణ ఇవ్వాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. ప్రసన్న కుమార్ శర్మ డిమాండ్ చేశారు.2009, 2011 సంవత్సరాల్లో ఆర్ఎస్ఎస్ సీనియర్ నాయకుడు రామ్ మాధవ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందాలు చైనా పర్యటించిన విషయం బహిరంగ సమాచారం. అయితే ఆ పర్యటనల ఉద్దేశ్యం ఏమిటి? ఎవరెవరిని కలిశారు? ఏ అంశాలపై చర్చించారు? ఆ చర్చల ఫలితాలు ఏమిటి? దేశ ప్రజలకు ఎందుకు వెల్లడించడం లేదు? అనే ప్రశ్నలకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు.కాంగ్రెస్ పార్టీపై చైనా పేరుతో రాజకీయ దాడులు చేసే ముందు ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

**ప్రసన్న కుమార్ శర్మ లేవనెత్తిన ప్రశ్నలు:**

- 2009, 2011లో రామ్ మాధవ్ నేతృత్వంలోని ఆర్ఎస్ఎస్ ప్రతినిధి బృందాలు చైనాకు ఎందుకు వెళ్లాయి?
- ఆ పర్యటనలకు ఆహ్వానం ఇచ్చింది ఎవరు? వాటి అధికారిక ఉద్దేశ్యం ఏమిటి?
- చైనా అధికార పార్టీ, ప్రభుత్వ ప్రతినిధులతో ఏయే సమావేశాలు జరిగాయి?
- ఆ సమావేశాల్లో చర్చించిన అంశాలపై దేశ ప్రజలకు పూర్తి వివరాలు ఎందుకు వెల్లడించడం లేదు?
- కాంగ్రెస్ పార్టీని చైనా పేరుతో విమర్శించే బీజేపీ, తమ నాయకుల చైనా పర్యటనలపై ప్రజలకు పారదర్శకంగా సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉందా?

ప్రజాస్వామ్యంలో ప్రతి రాజకీయ పార్టీ ప్రజలకు జవాబుదారిగా ఉండాలని, ఇతరులపై వేలెత్తి చూపే ముందు తమ చర్యలపై ప్రజలకు పూర్తి వివరణ ఇవ్వడం నైతిక బాధ్యత అని ప్రసన్న కుమార్ శర్మ పేర్కొన్నారు.

దేశభక్తిని రాజకీయ ఆయుధంగా ఉపయోగిస్తూ కాంగ్రెస్ పార్టీపై అసత్య ప్రచారం చేయడం ద్వారా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోవాలని ఆయన హితవు పలికారు. దేశ ప్రయోజనాలకు సంబంధించిన అంశాల్లో రాజకీయ ద్వంద్వ వైఖరి కాకుండా పారదర్శకత, జవాబుదారీతనం అవసరమని స్పష్టం చేశారు.

ప్రజలు తెలుసుకోవాలనుకుంటున్నది ఒక్కటే — కాంగ్రెస్‌పై ఆరోపణలు చేసే ముందు, 2009 మరియు 2011లో జరిగిన చైనా పర్యటనల పూర్తి వివరాలను బీజేపీ, ఆర్ఎస్ఎస్ దేశ ప్రజల ముందుంచడానికి సిద్ధంగా ఉన్నాయా?

దేశభక్తి నినాదాలతో రాజకీయ లబ్ధి పొందాలని చూడటం కంటే, నిజాలను ప్రజల ముందు ఉంచడమే ప్రజాస్వామ్య విలువలకు అనుగుణమని పి. ప్రసన్న కుమార్ శర్మ పేర్కొన్నారు



పి. ప్రసన్న కుమార్ శర్మ,
రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి

# బీసీ ఉద్యోగులపై వేధింపులను ఆపాలి

- బిసి ఉద్యోగుల పై వ్యక్తిత్వ హననం చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి
- బీసీ ఉద్యోగులపై అక్రమ కేసులను తొలగించి, నిరాధారమైన ఆరోపణలు చేస్తున్న బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- బీసీ ఉద్యోగులను మానసికంగా వేధిస్తూ తప్పుడు ప్రచారాలు చేస్తున్న వ్యక్తులపై కేసులు నమోదు చేయాలి



**హైదరాబాద్ వెలుతురు జూలై 30:**

బీసీ ఉద్యోగులపై రోజురోజుకు వేధింపులకు గురిచేస్తూ, ఉద్యోగులను మానసికంగా వేధిస్తూ అక్రమ కేసులను బనయిస్తున్నారని గురువారం రోజున బీసీ సంఘాల నేతలు బషీర్బాగ్ ప్రెస్ క్లబ్లో మీడియా సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, బిసి జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ మాట్లాడుతూ బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లు రిజర్వేషన్లు ఇవ్వకుండా, పోస్టింగులలో ప్రాధాన్యత ఇవ్వకుండా, మానసికంగా వేధిస్తూ తోటి ఉద్యోగులతో కించపరిచే విధంగా చేస్తున్నటువంటి అధికారులపై మరియు బలహీన వర్గాల సంబంధించినటువంటి ఉద్యోగులను మానసికంగా వేధిస్తూ అక్రమ కేసులను పెట్టి సస్పెన్షన్ చేసి ఏ కారణం లేకుండా సస్పెండ్ చేయడం ఎంతవరకు న్యాయమని, ఈరోజు వారు డిమాండ్ చేశారు,

మొన్ననే హైదరాబాదులో మలక్పేట్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా పని చేస్తున్నటువంటి నరసింహ గౌడ్ గారిని అకారణంగా ఒక మహిళా కానిస్టేబుల్ ను వేధిస్తున్నాడు అనే తప్పుడు ఆరోపణలు పెట్టి సస్పెండ్ చేయడం జరిగింది, ఇది చాలా బాధాకరమైనటువంటి విషయం, కానీ అసలు విషయానికి వస్తే ఒక మహిళా అడ్వకేటు అతనిపై కంప్లీట్ చేసి కావాలనే రద్దంతం చేస్తూ వారి సస్పెండ్ కు కారణమైంది, గౌరవ సిపి సజ్జనార్ గారు ఈ విషయం పైన లోతుగా పరిశీలించి, ఏ తప్పు చేయనటువంటి అధికారినినీ , ఏ కారణం లేకుండా తప్పుడు ఆరోపణలతో సిఐ గారిని సస్పెండ్ చేశారు ఉత్తరవులు ఇచ్చారు, ఇప్పటికైనా లోతుగా పరిశీలించి వారి సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరుతున్నాం,

ఫిర్యాదు చేసినటువంటి అడ్వకేట్ గారు వివిధ డిపార్ట్మెంట్లో ఇప్పటివరకు 50 మంది పైన కేసులు వేసి అధికారులను మానసికంగా హింసిస్తూ బెదిరింపులు చేస్తున్నటువంటి ఆ వ్యక్తి పైన చర్యలు తీసుకోవాల్సింది పోయి మరియు నిజాయితీగా పనిచేస్తున్నటువంటి ఒక అధికారి పైన సస్పెండ్ చేయడం చాలా బాధాకరమైన విషయం,

గౌరవ సీపీ గారు ఈ విషయంపై ఇప్పటికైనా స్పందించి అధికారులపై పెట్టినటువంటి కేసులను వివిధ పోలీస్ స్టేషన్లో 50 కి పైగా ఉన్నాయి, హైదరాబాద్ లో ఏ పోలీస్ స్టేషన్ చూసిన ఆమె కేసులు వేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తు, అధికారుల పై తప్పుడు ఆరోపణలు చేస్తూన ఆమె పైన వెంటనే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు,

బీసీ ఉద్యోగులను మానసికంగా హింసిస్తూ, వారిపై దౌర్జన్యాలు చేస్తూ వారిని అన్యాయాల గురి చేస్తున్న వారి పైన బీసీ సంక్షేమ సంఘం పోరాడుతది, వారి తరపున ప్రత్యక్షంగా పాల్గొని బీసీ ఉద్యోగులను కాపాడుకునే విధంగా ఈ రోజు బీసీ సంఘం ఉందని చెప్పి కోరుతూ బీసీలపై దాడులు ఆపకపోతే అక్రమ కేసులు ఆపకపోతే ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకోవడానికి కూడా సిద్ధంగా ఉన్నామని వారు డిమాండ్ చేశారు,

ఈ కార్యక్రమంలో బిసి యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షులు ఈడిగ శ్రీనివాస్ గౌడ్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు ఇంద్రం రజక, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు తొడుపునూరి సత్యం గౌడ్, గుంటి మహేష్ మీరు, బండి గారి రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు తక్షణ న్యాయం అందించే పోలీసు అధికారిగా పేరున్న గౌరవ సిఐగా మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

- కాంగ్రెస్ నాయకులు భీమ లక్ష్మణ్ ముదిరాజ్

**హైదరాబాద్ వెలుతురు జూలై 30:**

గురువారం రోజున సికింద్రాబాద్ గాంధీనగర్ పోలీస్ స్టేషన్లో SHO & సీఐ గా బాధ్యతలు స్వీకరించిన సురేష్ బాబు గారిని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు భీమ లక్ష్మణ్ ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిసి, శ్రీ కొమురవెల్లి బండారి మల్లికార్జున స్వామి వారి పవిత్ర శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.


ఈ సందర్భంగా భీమ లక్ష్మణ్ ముదిరాజ్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తూ, ఆపదలో ఉన్న వారికి తక్షణ న్యాయం అందించే నిబద్ధత కలిగిన పోలీసు అధికారిగా సురేష్ బాబు ఇప్పటికే మంచి గుర్తింపు పొందారని పేర్కొన్నారు.గతంలో వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహించిన సమయంలో ప్రజలకు అందించిన సేవలు, తీసుకున్న నిష్పాక్షిక నిర్ణయాలు ఆయనకు ప్రత్యేకమైన గౌరవాన్ని తీసుకువచ్చాయని, అదే సేవా స్ఫూర్తితో గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా ప్రజలకు న్యాయబద్ధమైన, పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించి పోలీసు శాఖకు, ప్రజా ప్రభుత్వానికి మరింత మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

పోలీసు వ్యవస్థలో ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తూ, తన నిజాయితీ, కర్తవ్యనిష్ఠతో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించి, ప్రజల మన్ననలు పొందే అధికారిగా మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ, నూతన బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మరోసారి శ్రీ సురేష్ బాబు గారికి శుభాకాంక్షలు తెలియజేశారు.



# మహాభారతం - అధికారం, సంపద, వివక్ష

మహాభారతం అనగానే సాధారణంగా మన మనస్సులో మెదిలేవి రాజవంశాల నడుమ సాగిన ఆధిపత్య పోరాటాలు, వ్యూహ ప్రతివ్యూహాలు, ధర్మ సూక్ష్మాలు, రణరంగంలో మ్రోగిన శంఖారావాలు. కానీ ఈ ప్రాచీన కావ్యాన్ని పరిశోధనాత్మక దృష్టితో, వర్తమాన సామాజిక కోణంలో విశ్లేషిస్తే, అది కేవలం ఒక వీరగాథ మాత్రమే కాదని స్పష్టమవుతుంది. మానవ సమాజంలో ఆనాటి నుంచి వేళ్లానుకున్న సంక్లిష్టమైన రాజకీయ, సామాజిక, ఆర్థిక నిర్మాణాలను అత్యంత సజీవంగా, నిష్పాక్షికంగా ఆవిష్కరించిన కాలాతీత దర్పణమిది. మహర్షి వేదవ్యాసుడు రచించిన ఈ బృహత్ కావ్యంలో అధర్మంపై ధర్మం సాధించిన ఆధ్యాత్మిక విజయం ఒకవైపు స్పష్టంగా కనిపిస్తుంటే, మరోవైపు ఆనాటి సమాజంలో రాజ్యం చేసిన గంభీరమైన ఆర్థిక అసమానతలు, వర్గ వైషమ్యాలు, సామాజిక అంతరాలు అత్యంత స్పష్టంగా గోచరిస్తాయి. సంపద, అధికారం, ఉన్నత సామాజిక హోదా అనేవి కేవలం సమాజంలోని కొద్దిమంది పాలకుల, అభిజాత వర్గాల చేతుల్లోనే కేంద్రీకృతమై, మెజారిటీ సామాన్య ప్రజలు నిరంతరం అణచివేతకు, నిర్లక్ష్యానికి గురైన దారుణమైన తీరును మహాభారతంలోని వివిధ పాత్రలు మన కళ్లముందు ఉంచుతాయి. ఆనాటి రాజసభల నిర్ణయాలు పాలకుల స్వార్థ ప్రయోజనాలకే పెద్దపీట వేశాయి. నిరుపేదల కష్టాలు, వారి శ్రమ దోపిడీకి గురైన తీరు మహాభారత కథనంలో ఒక అంతర్వాహినిగా నిరంతరం కనిపిస్తుంది.ఆనాటి ప్రాచీన సమాజం వర్ణాశ్రమ ధర్మం ప్రాతిపదికగా విభజించబడి నడిచేది. ఈ విభజన కేవలం జీవన శైలికి లేదా ధార్మిక పూజా విధానాలకు మాత్రమే పరిమితం కాలేదు. అది ఒక వ్యక్తి యొక్క ఆర్థిక అవకాశాలను, వృత్తిపరమైన ఎదుగుదలను, భవిష్యత్తు సామాజిక హోదాను శాసించే ప్రధాన శక్తిగా మారింది. ఇందుకు అడవిలో జన్మించిన నిషాద కుమారుడైన ఏకలవ్యుడి ఉదంతమే స్పష్టమైన, విషాదకరమైన ఉదాహరణగా నిలుస్తుంది. ఏకలవ్యుడికి ధనుర్విద్యలో అపారమైన ప్రతిభ, అసమానమైన పట్టు ఉన్నప్పటికీ, రాజగురువైన ద్రోణాచార్యుడు అతనికి విద్యను నేర్పడానికి ససేమిరా అంగీకరించలేదు. అంతటితో ఆగక, తన స్వయంకృషితో, ఏకాగ్రతతో విద్యను సాధించిన ఆ యువకుడి నుంచి గురుదక్షిణ పేరిట కుడిచేతి బొటనవేలిని కోరి అతని భవిష్యత్తును, కలలను శాశ్వతంగా అంధకారం చేశారు. ద్రోణాచార్యుడి ధోరణి నాటి అధికార వర్గాలు ఆధిపత్యాన్ని కాపాడుకునేందుకు ఏ స్థాయికైనా తెగిస్తాయనే నిజాన్ని ఎండగడుతోంది. ఇది అణగారిన వర్గాల ప్రతిభపై పడిన పెద్ద దెబ్బ. జన్మను బట్టి సంపదను, విద్యను, సామాజిక అవకాశాలను నిరాకరించే అణచివేత ధోరణికి ఇది నిదర్శనం. అపారమైన ప్రతిభ ఉన్నప్పటికీ, జన్మ ఆధారంగా అవకాశాలు నిరాకరించబడే ఈ దుస్థితి నేటి వర్తమాన సమాజంలోనూ రూపాంతరం చెంది కొనసాగుతుండటం విస్మరించలేని సత్యం.మహాభారతంలో ఆర్థిక, సామాజిక అసమానతల చిత్రణకు మరో సజీవ సాక్ష్యం కర్ణుడి పాత్ర. శౌర్యంలో, పరాక్రమంలో ఎవరికీ తీసిపోని కర్ణుడు, సూతపుత్రుడిగా పెరగడం వల్ల జీవితాంతం అవమానాలను, వివక్షను ఎదుర్కోవాల్సి వచ్చింది. ద్రౌపది స్వయంవరంలో అతని కులాన్ని, సామాజిక హోదాను ఎత్తిచూపుతూ



పోటీకి అనర్హుడిగా ప్రకటించడం, రంగస్థలంలో అతని సాటిలేని విలువిద్య సామర్థ్యాన్ని తక్కువ చేసి మాట్లాడటం వంటి పరిణామాలు నాటి సమాజంలో రాజ్యం చేసిన కుల సంస్కృతిని తెలియజేస్తాయి. కర్ణుడి దానగుణాన్ని మెచ్చుకున్న సమాజమే అతని కులాన్ని బట్టి తక్కువ చేసి చూడటం నాటి ద్వంద్వ నీతికి అద్దం పడుతోంది. సంపద, ఉన్నత హోదా లేకపోతే ఎంతటి మహానాయకుడైనా, విద్వాంసుడైనా సమాజంలో తగిన గుర్తింపు పొందలేడనే చేదు నిజాన్ని కర్ణుడి జీవిత పోరాటం చాటిచెబుతోంది. కౌరవ నాయకుడైన దుర్యోధనుడు అతనికి అంగరాజ్యాన్ని ధారబోసి, రాజరికాన్ని ఇచ్చిన తర్వాతే నాటి రాజసభలు అతని ప్రతిభను గుర్తించడానికి అంగీకరించాయి. అంటే, ఒక వ్యక్తి యొక్క గౌరవాన్ని, విలువను అతని వ్యక్తిగత గుణాలు కాక, అతని వద్ద ఉన్న సంపద, అధికారమే నిర్ణయిస్తాయనే నిజాన్ని ఈ ఘటన బహిర్గతం చేస్తోంది.పాండవులు, కౌరవుల నడుమ సాగిన రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యం కలిగిన మహా మేధావి విదురుడు. ధర్మశాస్త్రాలు ఔపోసన పట్టిన జ్ఞానిగా, దూరదృష్టి కలిగిన రాజనీతిజ్ఞుడిగా విదురునికి పేరుంది. అయినప్పటికీ, దాసీ పుత్రుడిగా జన్మించడమే అతనికి పెద్ద శాపంగా మారింది. అపారమైన అర్హత, నీతి నిజాయితీలు ఉన్నప్పటికీ అతనికి రాజ్యాధికారంపై హక్కు లభించలేదు. మంత్రిగా, సలహాదారుగా అతని పాత్ర అత్యంత కీలకమైనప్పటికీ, ఆర్థికంగా, రాజకీయంగా అతను ఎల్లప్పుడూ ధృతరాష్ట్రుడు, పాండురాజుల నీడలోనే జీవించాల్సి వచ్చింది. సత్యం మాట్లాడే విదురుడి హెచ్చరికలను రాజసభలో ఎవరూ పట్టించుకోకపోవడం రాజ్యాధికారం ఉన్నవారి అహంకారానికి ప్రతీకగా నిలుస్తుంది. సమాజంలో నైతికత, జ్ఞానం కంటే జన్మ, సంపద, వంశపారంపర్య హోదాకే ప్రాధ్యాన్యం దక్కుతుందనే క్రూరమైన వాస్తవాన్ని విదురుడి జీవితం నొక్కి చెబుతోంది.మహాభారత కావ్యంలో అత్యంత కీలకమైన పరిణామం జూద ఘట్టం. ఈ సన్నివేశంలో ధర్మరాజు తన రాజ్యాన్ని, సమస్త సంపదను, ఖజానాను పందెంగా ఒడ్డి ఓడిపోయాక, తన సోదరులను, తనను, ఆఖరికి ధర్మపత్ని ద్రౌపదిని కూడా పందెంగా పెట్టాడు. ఈ ఘటన ఆనాటి సమాజంలో స్త్రీలను, మానవ హక్కులను కూడా కేవలం ఒక భౌతిక ఆస్తిగా, చరచరాస్తులుగా పరిగణించే భయంకరమైన ధోరణిని ఎండగడుతోంది. నిండు రాజసభలో ద్రౌపదికి జరిగిన పరాభవం, ఆర్థిక అధికారం ఉన్నవారు బలహీనులను, మహిళలను ఎంతటి దారుణంగా వస్తువులుగా మారుస్తారో చాటిచెప్పే విషాదకర సంఘటన.పాండవులు రాజభోగాలను వదిలి పన్నెండేళ్లు అడవుల్లో కష్టాలు అనుభవించడం, మరోవైపు హస్తినాపురంలో కౌరవులు సకల రాజభోగాలు అనుభవించడం నాటి తీవ్రమైన ఆర్థిక అస్థిరతకు, వ్యత్యాసాలకు ప్రత్యక్ష నిదర్శనం. అదే సమయంలో ధర్మరాజు నిర్వహించిన రాజసూయ యాగం, రాజులు తమ అధికారాన్ని, సంపదను ప్రదర్శించుకునే ఒక వేదికగా మారింది. బలమైన రాజ్యాలు చిన్న రాజ్యాల నుంచి కప్పాలు వసూలు చేసి సంపదను కేంద్రీకరించడం నాటి రాజకీయ, ఆర్థిక దోపిడీ వ్యవస్థను స్పష్టం చేస్తోంది.సమాజంలో ఉన్న ఈ లోతైన అంతరాలను గమనించిన వ్యాసమహర్షి కేవలం సమస్యలను చూపించడమే కాక, పరిష్కారాలను కూడా సూచించారు. కర్ణుడి దాన గుణం, ధర్మరాజు నిర్వహించిన దానధర్మాలు సమాజంలో సంపద పునఃపంపిణీ జరగాలనే సందేశాన్ని ఇస్తాయి. సంపన్నులు తమ వద్ద ఉన్న ధనాన్ని లేనివారికి పంచి ఇవ్వడం ద్వారా సామాజిక సమతుల్యత సాధించవచ్చని మహాభారతం చాటుతోంది.వేల సంవత్సరాల క్రితం నాటి మహాభారతం నేటి ఆధునిక యుగానికి కూడా అద్భుతమైన మార్గదర్శి. ఏకలవ్యుడు, కర్ణుడు, విదురుడి పాత్రల ద్వారా వ్యక్తమైన ఆర్థిక, సామాజిక వ్యత్యాసాలు నేటికీ రూపాంతరం చెంది కొనసాగుతున్నాయి. నేటి ప్రజాస్వామ్య వ్యవస్థలోనూ ఇటువంటి సామాజిక, ఆర్థిక అంతరాలు నవసమాజ నిర్మాణానికి పెద్ద ఆటంకంగా మారాయి. సంపద కేంద్రీకరణ, అవకాశాల అసమానతలకు అడ్డుకట్ట వేసి, సమసమాజ స్థాపనకు కృషి చేయాలనే ఆలోచనను ఈ కావ్యం రేకెత్తిస్తుంది. అందుకే మహాభారతం కేవలం పురాణం కాదు, ఆర్థిక సమానత్వాన్ని కోరుకునే ఒక శాశ్వత మార్గదర్శి.



డా. సూర్యదేవర రామకృష్ణ ,
Moral Philosopher, 9490754169

# తెలంగాణలో భారీ వర్షాలు.. నిండుకుండల్లా జలాశయాలు!

- **పర్ణశాల, తాళిపేరు వద్ద వరద ఉద్ధృతి: స్థానిక వాగులు పొంగిపొర్లుతున్న పరిస్థితి**
- **శ్రీరాంసాగర్, నిజాంసాగర్‌లకు భారీగా వరద: కడెం ప్రాజెక్టుకు నిలకడగా ఇన్‌ఫ్లో**
- **జగిత్యాలలో స్తంభించిన రవాణా, పాఠశాలలకు సెలవు: కలెక్టరేట్‌లో హెల్ప్‌లైన్ ఏర్పాటు**
- **కాళేశ్వరం, మేడిగడ్డ వద్ద ప్రవాహాల ఉద్ధృతి: పుష్కర ఘాట్లను తాకుతున్న గోదావరి**
- **సింగూరు ప్రాజెక్టు నీటి నిల్వల వివరాలు: దిగువకు ప్రవాహాలను విడుదల చేస్తున్న అధికారులు**
- **పరీవాహక ప్రజలకు అధికారుల తీవ్ర అప్రమత్తత: అత్యవసర సహాయక చర్యలు సిద్ధం**

**హైదరాబాద్, వెలుతురు, జూలై 30:**

తెలుగు రాష్ట్రాల్లో, ముఖ్యంగా తెలంగాణలోని ఎగువ ప్రాంతాలు మరియు వివిధ జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రధాన జలాశయాలన్నింటికీ భారీగా నీరు వచ్చి చేరుతోంది. వర్షాల ప్రభావంతో ఈ సీజన్‌లో మొదటిసారిగా ప్రాజెక్టుల్లో మొత్తం నీటి నిల్వలు 33 శాతానికి చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రధాన నదులైన గోదావరి, కృష్ణాలు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. గోదావరిలో నీటిమట్టాలు రోజురోజుకూ పెరుగుతుండగా, కృష్ణా నదిలో వరద ప్రవాహం శ్రీశైలం ప్రాజెక్టు వైపు వేగంగా పరుగులు తీస్తోంది.

భద్రాచలంలో బుధవారం వరకు 16 అడుగుల మేర ప్రవహించిన గోదావరి నది, గురువారం ఉదయానికి ఏకంగా 27 అడుగులకు పెరిగింది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ఉద్ధృతి కారణంగా భద్రాచలం వద్ద నీటిమట్టం మరింతగా పెరిగే అవకాశం ఉందని కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రవాహం పెరగడంతో భద్రాచలం స్నానఘట్టాల వద్ద మెట్ల వరకు వరద నీరు వచ్చి చేరింది. దుమ్ముగూడెం మండలం పర్ణశాల వద్ద సీత వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తుండగా, చర్ల మండలంలోని తాళిపేరు జలాశయానికి ఎగువ నుంచి భారీగా వరద వచ్చి చేరుతోంది.


ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ప్రముఖ నీటిపారుదల ప్రాజెక్టయిన శ్రీరాంసాగర్‌కు వరద నీరు పోటెత్తుతోంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులోకి 9,250 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో నీటిమట్టం 1,065.7 అడుగులకు చేరింది. నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి 3,935 క్యూసెక్కుల వరద వస్తుండటంతో ప్రస్తుత నీటిమట్టం 1,395.8 అడుగులకు పెరిగింది. నిజాంసాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు, పూర్తిస్థాయి సామర్థ్యం 17.80 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 7.46 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అలాగే నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టుకు 42 వేల క్యూసెక్కుల వరద వస్తుండటంతో నీటిమట్టం 693 అడుగులకు పెరిగింది.

జగిత్యాల జిల్లా వ్యాప్తంగా రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల నేరెళ్ల, అనంతారం ప్రాంతాల్లో జాతీయ రహదారిపై నుంచి వరద నీరు పొంగిపొర్లుతోంది. వాగుల ఉద్ధృతి పెరగడంతో వరుసగా రెండో రోజు కూడా రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పరిస్థితి తీవ్రతను బట్టి అధికారులు జగిత్యాల జిల్లాలోని పాఠశాలలకు సెలవు ప్రకటించారు. స్థానిక కలెక్టరేట్‌లో ప్రజల అత్యవసర సహాయం కోసం 7989193131 అనే హెల్ప్‌లైన్ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చారు.

కాళేశ్వరం సమీపంలో గోదావరి, ప్రాణహిత నదులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో సాధారణ పుష్కర ఘాట్, సరస్వతీ పుష్కర ఘాట్‌ల వద్ద జలకళ సంతరించుకుంది. ఇక్కడ నీటి మట్టం 6.32 మీటర్లకు పెరిగింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీకి ఎగువ నుంచి దాదాపు 1.1 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. అయితే గత మూడేళ్లుగా బ్యారేజీకి సంబంధించిన 85 గేట్లను తెరచే ఉంచడంతో వచ్చిన నీరు వచ్చినట్లే దిగువ ప్రాంతాలకు ప్రవహించిపోతోంది.

సంగారెడ్డి జిల్లాలోని సింగూరు జలాశయానికి ప్రస్తుతం 517 క్యూసెక్కుల వరద చేరుతుండగా, అధికారులు అవుట్‌ఫ్లోగా 470 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సింగూరు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 29.91 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.24 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. వర్షాలు ఇలాగే కొనసాగితే నీటి నిల్వలు మరింత పెరిగే అవకాశముందని అధికారులు తెలిపారు.

వర్షాల ఉద్ధృతి మరియు నదీ ప్రవాహాలు పెరుగుతున్న దృష్ట్యా గోదావరి పరివాహక ప్రాంత ప్రజలను అధికారులు ముందస్తుగా అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని హెచ్చరించారు. ఏయే జిల్లాల్లో వర్ష తీవ్రత ఎక్కువగా ఉందో అక్కడ సహాయక బృందాలను సిద్ధంగా ఉంచామని, పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని అధికారులు తెలిపారు.



# ఆ నిధులపై అనుమానాలున్నాయ్.... విచారణ జరపండి

- **ఆర్థిక సంఘం నిధుల వినియోగంలో పారదర్శకత, జవాబుదారీతనం, ఆర్థిక క్రమశిక్షణ పాటించాల్సిందే**
- **కేంద్ర, రాష్ట్రాల పంచాయతీరాజ్ శాఖల మంత్రులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ లేఖ**
- **నిధుల వినియోగంపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని కోరిన కేంద్ర మంత్రి**

**న్యూఢిల్లీ వెలుతురు జూలై 30:**

తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు కేంద్ర ఆర్థిక సంఘం విడుదల చేస్తున్న నిధుల వినియోగంపై అనేక అనుమానాలున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. ఆర్థిక సంఘం నిబంధనలకు విరుద్ధంగా నిధులను వినియోగిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ఆర్థిక సంఘం మార్గదర్శకాలకు విరుద్ధంగా నిధులను ఖర్చు చేయాలంటూ సర్పంచులపై ఒత్తిడి తెస్తున్నారని పేర్కొన్నారు. నిధుల వినియోగంపై అనేక అనుమానాలు, ఆందోళనలు నెలకొన్న నేపథ్యంలో పూర్తిస్థాయిలో నిష్పాక్షిక విచారణ జరపాలని కోరుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖ రాశారు. ఈ మేరకు కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ (లలన్ సింగ్), రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్కకు లేఖ రాశారు. ఇటీవల బండి సంజయ్ కేంద్ర ఆర్థిక సంఘం మార్గదర్శకాలకు భిన్నంగా తెలంగాణలో నిధులను వినియోగించాలంటూ గ్రామ పంచాయతీ సర్పంచ్ లపై అధికారులు ఒత్తిడి తెస్తున్నారని పేర్కొంటూ కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ కు లేఖ రాయగా, మీడియాలో ప్రచురితమైన విషయం తెలిసిందే. బండి సంజయ్ రాసిన లేఖలోని అంశాల్లో వాస్తవం లేదంటూ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణా ఉపాధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్ మరుసటి రోజు మీడియాకు ప్రకటన విడుదల చేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కేంద్రం విడుదల చేసిన ఆర్థిక సంఘం నిధుల వినియోగంలో ఉల్లంఘనలు జరుగుతున్నాయని, నిబంధనలకు విరుద్ధంగా నిధులను ఖర్చు చేయాలంటూ అధికారులు తమపై ఒత్తిళ్లు తెస్తున్నారంటూ పలువురు సర్పంచులు తనకు అందజేసిన ఫిర్యాదులను కేంద్ర, రాష్ట్ర మంత్రుల దృష్టికి తీసుకొచ్చారు. కేంద్ర ఆర్థిక సంఘం మార్గదర్శకాలకు భిన్నంగా కొన్ని పంచాయతీల్లో నిధులను ఖర్చు చేసిన అంశాలకు సంబంధించిన ఆధారాలను సైతం లేఖతోపాటు జత చేసి పంపారు. గ్రామీణ ప్రజాస్వామ్యానికి పంచాయతీరాజ్ వ్యవస్థే పునాది అని గుర్తు చేశారు. ఈ వ్యవస్థలో నిధుల వినియోగంలో నిబంధనలను ఉల్లంఘిస్తే గ్రామాల అభివృద్ధిపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పంచాయతీల ఆర్థిక స్వయం ప్రతిపత్తి దెబ్బతింటోందని తెలిపారు. ఈ విషయంలో తక్షణమే జోక్యం చేసుకోవాలని ఆయా మంత్రులను కోరారు. సర్పంచులు చేసిన ఫిర్యాదులు, తనకు అందించిన ఆధారాలను దృష్టిలో ఉంచుకుని నిష్పాక్షిక విచారణ జరిపి నిజాలను నిగ్గు తేల్చాలని ఆయా మంత్రులను కోరారు.

# భవన నిర్మాణ కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

- **కాటం నరసింహ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి.**
- **భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోరిగే సోములు**

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 30:**

అనారోగ్యంతో మరణించిన భవన నిర్మాణ కార్మికుడు కాటం నర్సింహ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గొరిగే సోములు డిమాండ్ చేశారు. రామన్నపేట పట్టణ కేంద్రానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు కాటం నర్సింహ అనారోగ్యంతో మృతి చెందగా భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పూల మాల వేసి జోహార్లు అర్పించి కుటుంబానికి 6500/– రూ ఆర్థిక సహకారం అందజేయడం జరిగింది.

ఈ సందర్భంగా మాట్లాడుతూ భవన నిర్మాణ వృత్తినే నమ్ముకొని జీవిస్తూ ఆరోగ్యం చెడిపోవడంతో చికిత్స చేయించుకునే స్తోమత లేక మరణించాడని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు వంగాల మారయ్య, బుడ్డ ప్రసాద్, నాయకులు బాకీరు చెన్నయ్య,శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# మంచాల మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు ప్రజా ప్రతినిధులతో ఎమ్మెల్యే సమీక్ష

- **ప్రభుత్వ ప్రవేశపెట్టి సంక్షేమ పథకాలు పేదల గడపకు చేర్చే బాధ్యత అధికారులదే ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**

**మంచాల వెలుతురు జులై 30:**





మంచాల మండలం ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం సాయంత్రం అధికారులు ప్రజాప్రతి నిధులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు పేదప్రజల సంక్షేమమే లక్ష్యంగాప్రభుత్వం అమలుచేస్తున్న ప్రతీ పథకాన్ని పేదల గడపకు చేర్చేబాధ్యత అధికార యంత్రాంగం పైనే ఉం టుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేమల్ రెడ్డి రంగారెడ్డి చెప్పారు దాదాపు ఇరవైశాఖలకు పైగా అ ధికారులు సర్పంచ్ లు ఈసమావేశానికి హాజరుకాగా ఒక్కోశాఖ పనితీరు గురించి చీకటిపడేవ రకు ఆరాతీశారు అక్రమ కార్యకలాపాలకు అధికారులెవరూ సహకరించవద్దని సూచించారు నే రాల కట్టడిపై ఏసీపీ రాజు సూచనల మేరకు ప్రతీ గ్రామంలో ప్రవేశ మార్గం కీలకప్రాంతాల్లో తప్ప నిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేవిధంగా చర్యలు తీసు కోవాలని ఈసందర్భంగా ఎమ్మెల్యే చెప్పారు పశువైద్యశాఖ అధికారులు సి బ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సేవలందిస్తు న్నందున ప్రతీ పర్య టన అందించిన సేవలపై రికార్డు నమోదు చేయాలని చెప్పారు మండలంలోని23గ్రా మపంచాయతీ లుండగాఎంతమంది గ్రామపంచాయతీ కార్యదర్శులు మంది హాజరయ్యారని ఆరాతీసిన ఎమ్మెల్యే పథకాల అమలు విషయంలో కార్యదర్శులదే కీలకపాత్రగా పేర్కొన్నారు ప్రభుత్వం నుంచి అందుతున్న పథకాల అమలుపై ప్రతీ 45రోజులకొకసారినివేదిక తయారు చే యాలని చెప్పారు పేదల గడపకు సర్కార్ ఫలాలు అందితేనే సమాజశ్రేయస్సు సాధ్యమని చె ప్పారు ప్రభుత్వం ఇరవై నాలుగు గంటల కరెంటు అందిస్తున్న తరుణంలో విద్యుత్ కోతలు ఉం డవద్దని ఏదైనా కారణంతో నిలిపివేయాల్సి వస్తే ముందస్తుగా తప్పకుండా సమాచారం ఇవ్వాల ని విద్యుత్ అధికారులకు సూచించారు కరెంటు కోతల విషయంలో గ్రామపంచాయతీల్లో ప్రత్యే క రికార్డు నిర్వహించాలని కార్య దర్శులకు సూచించారు విద్యుత్ సరఫరా విషయంలో పకడ్బం దీగా వ్యవహరించాలని చెప్పారు నియోజకవర్గంలో వైద్య సేవల అంశంపై ఇటీవల రాష్ట్రస్థాయి ఉన్నతాధికా రులతో సచివాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షను గుర్తుచేసిన ఎమ్మెల్యే దానికి సంబంధించిన పురోగతిని అడిగి తెలుసుకున్నారు ఆరోగ్యకేంద్రాల్లో ఖాళీపోస్టులు సదుపాయా లు రోగులకు అందుతున్న సేవలగురించి ఆరాతీశారు వైద్యసేవల విషయంలో ఎలాంటి నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించ వద్దని చెప్పారు గర్భిణులు బాలింతలు చిన్నారులకు పోషకాహారం అందజేత అంగన్ వాడీ సేవల గురించి ఐసీడీఎస్ అధికారులతో మాట్లాడారు అలాగే ఎక్సైజ్ ఆర్ అండ్ బీ వ్యవసాయం రెవెన్యూ తదిత రశాఖలపై ప్రజాప్రతి నిధులు తనదృష్టికి తీసుకువచ్చిన అంశా లపై అధికారులతో ఆరాతీశారు విధుల నిర్వహణలో ఎవరికీ లాలూచీ పడాల్సిన అవసరంలే దని చెప్పిన ఎమ్మెల్యే పదేళ్లలో జరిగిన నష్టాన్ని పూడ్చుతూ ప్రజలకు మెరుగైన పాలన అంది స్తున్నట్లు చెప్పారు ఇందుకు అన్ని శాఖలు సమన్వయంతో సాగాలని సూచించారు ఈకార్యక్ర మంలో మంచాల మండలం తహసిల్దార్ వెంకట ప్రసాద్ రావు ఎంపీడీవో వసంతలక్ష్మి.ఇబ్రహీం పట్నం ఏసిపి రాజు మంచాల సిఐ ఏ మధు వివిధ శాఖల అధి కారులు వివిధ గ్రామాల సర్పం చ్ లు తదితరులు పాల్గొన్నారు.

# నల్ల పోచమ్మ అమ్మవారి బోనాల జాతరకు టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగంకు ఆహ్వానం

**కూకట్ పల్లి జూలై 30 వెలుతురు:**



శ్రీ శ్రీ శ్రీ నల్ల పోచమ్మ దేవి అమ్మవారి బోనాల జాతర మహోత్సవాల సందర్భంగా టీపీసీసీ అధికార ప్రతినిధి డాక్టర్ సత్యం శ్రీరంగం ను ఆలయ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి జాతరకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రతినిధులు బోనాల జాతర నిర్వహణకు సంబంధించిన వివరాలను సత్యం శ్రీరంగంకు తెలియజేసి, మహోత్సవాలకు విచ్చేసి అమ్మవారి ఆశీర్వాదాలు పొందాలని కోరారు. ఆయన ఆహ్వానాన్ని సాదరంగా స్వీకరించి జాతర విజయవంతం కావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ బీ–బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, ఆలయ కమిటీ చైర్మన్ రాచమల్ల బిక్షపతి గౌడ్, బోర్డు సభ్యులు పాండు ముదిరాజ్, నర్సింగ్ రావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాచమల్ల శేఖర్ గౌడ్, రమేష్ గుప్తా, దాదే కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# కుత్బుల్లాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతన బోర్‌వెల్ ప్రారంభోత్సవం

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 30:**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ (కుత్బుల్లాపూర్ డివిజన్) పరిధిలోని కుత్బుల్లాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంపీ లాడ్స్ (MPLADS) నిధుల ద్వారా మంజూరైన నూతన బోర్‌వెల్‌ను గురువారం ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వచ్ఛమైన నీటి సౌకర్యం కల్పించేందుకు ఎంపీ లాడ్స్ నిధులు మంజూరు చేసిన మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఈ బోర్‌వెల్ ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బందికి స్వచ్ఛమైన నీటి సౌకర్యం అందుబాటులోకి రావడం సంతోషకరమని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని తెలిపిన బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహా రెడ్డి.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, డివిజన్ అధ్యక్షులు జోగిని రాజు, నార్లకంటి ప్రతాప్, నల్లనాగుల కృష్ణ, పెద్దింటి సాయిలు, ప్రవీణ్ గౌడ్, సతీష్ చక్రవర్తి, బాలరాజు, నాగదీప్ గౌడ్, పద్మా రెడ్డి, బాబి నీల, లక్ష్మి, పాపయ్య దొర, అంజయ్య, వీరేశం, దీపిక, వెంకటేశ్వరన్, రాజు, మహేష్, అభిద్, శ్రీకాంత్, తేజ తదితరులు పాల్గొన్నారు.

# కన్న కొడుకులా అండగా నిలిచిన వడ్డేపల్లి రాజేశ్వరరావు.. వృద్ధురాలికి వినికిడి పరికరం అందజేత"

**కూకట్ పల్లి జూలై 30 వెలుతురు:**

మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు మరోసారి తన సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. కూకట్‌పల్లి వెంకటేశ్వర నగర్‌కు చెందిన 80 ఏళ్ల వృద్ధురాలు విరమ్మ రెండు చెవులు వినిపించక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ జీవనం సాగిస్తున్నారు. తన కుమార్తె సహాయంతో ఆమె వడ్డేపల్లి రాజేశ్వరరావును ఆశ్రయించారు. వృద్ధురాలి దయనీయ పరిస్థితిని ప్రత్యక్షంగా చూసిన రాజేశ్వరరావు ఆమెకు ధైర్యం చెబుతూ, "అవ్వా... బాధపడకు. నేను నీ కొడుకు లాంటివాడిని" అంటూ మనోధైర్యం నింపారు. అనంతరం సంబంధిత వైద్యుల వద్దకు తీసుకెళ్లి అవసరమైన వైద్య పరీక్షలు చేయించి, వినికిడి సమస్యకు అవసరమైన హియరింగ్ ఎయిడ్‌ను అందజేశారు. ధ్వని పరికరం అందుకున్న అనంతరం భావోద్వేగానికి గురైన వీరమ్మ, "నా కష్టం తీర్చిన భగవంతుడు నువ్వేనయ్యా" అంటూ కన్నీటి పర్యంతమై రాజేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ, "నీకు ఎవరూ లేరని బాధపడకు అవ్వా... నేనున్నాను. ఏ కష్టం వచ్చినా ధైర్యంగా చెప్పు. నీకు ఎల్లప్పుడూ అండగా ఉంటాను" అని భరోసా ఇచ్చారు. నిస్సహాయ వృద్ధురాలి సమస్యను తన సమస్యగా భావించి వెంటనే స్పందించి వినికిడి పరికరం అందించడం ద్వారా ఆమె జీవితంలో కొత్త ఆశలు నింపిన రాజేశ్వరరావు సేవా భావాన్ని స్థానికులు, ప్రజాప్రతినిధులు, సామాజికవేత్తలు అభినందించారు. మానవత్వానికి నిదర్శనంగా నిలిచిన ఈ సేవా కార్యక్రమం



స్థానికంగా ప్రశంసలు అందుకుంటోంది.

# వర్షాకాలం–బోనాలపై జహీరాబాద్ మున్సిపల్ కౌన్సిల్ కీలక నిర్ణయాలు





- **అత్యవసర కౌన్సిల్ సమావేశంలో మూడు తీర్మానాలకు ఆమోదం...**
- **కాంగ్రెస్, మజ్లిస్ కౌన్సిలర్లు గైర్హాజరు.. పాల్గొన్న బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు...**

**జహీరాబాద్ వెలుతురు, జూలై 30:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపాలిటీలో వర్షాకాల పరిస్థితులు, బోనాల పండుగ ఏర్పాట్లపై గురువారం అత్యవసర మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో జరిగిన ఈ సమావేశానికి కాంగ్రెస్, మజ్లిస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు గైర్హాజరుకాగా, బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.సమావేశంలో పట్టణంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, లోతట్టు ప్రాంతాల్లో నీటిమునిగే పరిస్థితులను నివారించే చర్యలు, డ్రైనేజీల శుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణ, ప్రజారోగ్య పరిరక్షణ, దోమల నివారణ చర్యలు, తాగునీటి సరఫరా, వీధి విద్యుత్ దీపాల నిర్వహణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.అదేవిధంగా రానున్న బోనాల పండుగను దృష్టిలో ఉంచుకుని ఆలయాల పరిసరాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సదుపాయం, విద్యుత్ వెలుగులు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సమావేశంలో సూచించారు.ఈ సందర్భంగా వర్షాకాల సన్నద్ధత, బోనాల ఉత్సవాల ఏర్పాట్లకు సంబంధించి మూడు కీలక తీర్మానాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. కౌన్సిల్ ఆమోదించిన తీర్మానాలను ఆలస్యం చేయకుండా వెంటనే అమలు చేయాలని సంబంధిత శాఖల అధికారులకు చైర్‌పర్సన్, మున్సిపల్ కమిషనర్ జి. ప్రభాకర్ ఆదేశాలు జారీ చేశారు.ప్రతి శాఖ పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, కౌన్సిల్ ఆమోదించిన నిర్ణయాలను నిర్దేశిత గడువులో అమలు చేసి, అమలు నివేదికలను సమర్పించాలని కమిషనర్ సూచించారు. వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, బోనాల పండుగను సజావుగా నిర్వహించేలా అన్ని శాఖలు సమర్థవంతంగా పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు.

# 277వ డివిజన్ మహాదేవపురంలో నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూలై 30:**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి కృషితో, సీఎంసీ స్పెషల్ ఫండ్ ద్వారా రూ.40 లక్షలు మరియు రూ.68 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో 277వ డివిజన్ పరిధిలోని మహాదేవపురం కాలనీలో నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను గురువారం ఘనంగా ప్రారంభించారు. మహాదేవపురం కాలనీలోని A, D, M, W మరియు X బ్లాక్‌లతో పాటు ఫేజ్–2 పరిధిలోని పలు ప్రాంతాల్లో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను కొలన్ హన్మంత్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, కాలనీల సమగ్ర అభివృద్ధి, నాణ్యమైన రహదారుల నిర్మాణం, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇస్తూ, ప్రతి కాలనీ అభివృద్ధే తమ లక్ష్యమని పేర్కొన్నారు.మహాదేవపురం కాలనీ అభివృద్ధికి విశేష కృషి చేసి సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి కి కాలనీ వాసులు, వెల్ఫేర్ సొసైటీ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో



మహాదేవపురం 277వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు సిద్ధనోళ్ల సంజీవ్ రెడ్డి, స్టేట్ మహిళా వైస్ ప్రెసిడెంట్ అంజలి యాదవ్, మహాదేవపురం కాలనీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు కే. వెంకటరెడ్డి, ప్రసాద్, రాంచందర్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, ప్రవీణ్, వెంకట్ రెడ్డి, కృష్ణ రెడ్డి, దిలీప్, రాజమహేంద్ర, మల్లారెడ్డి, జాంగా రెడ్డి, శివ రెడ్డి, రాంచందర్ (ఎస్ఐ), సంతోష్, రంజిత్, వెంకటేష్, సురేష్, చావా శ్రీనివాస్, వీరయ్య, ప్రభాకర్, అనిల్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, ప్రశాంతి, చర్చి పాస్టర్లు, కాలనీ వాసులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైన్స్ షాప్, ఇళ్లలో చోరీలు చేసిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- **పూణెలో ఇద్దరు నిందితుల అరెస్ట్.. మరో ముగ్గురు పరారీ...**
- **పలు చోరీ కేసులు ఛేదించిన సంగారెడ్డి జిల్లా పోలీసులు...**

**జహీరాబాద్ వెలుతురు, జూలై 30:**

సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి గ్రామంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ వైన్స్ షాప్‌తో పాటు ఓ ఇంట్లో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించి, అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు చెందిన ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. జిల్లా ఎస్పీ పంకజ్ పరితోష్ ఆదేశాలు, జహీరాబాద్ డీఎస్పీ బి. సైదా పర్యవేక్షణలో సీఐ శివలింగం ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు.సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితులను గుర్తించిన పోలీసులు మహారాష్ట్రలోని పూణే నగరంలో రాహుల్ నందు రాథోడ్, జోగ్‌రాజ్ గురుదర్‌సింగ్ బిరావత్‌లను అదుపులోకి తీసుకున్నారు. మరో ముగ్గురు నిందితులు వర్ధమాన్, దక్ష్, శుక్రాచారి పరారీలో ఉన్నారు.దర్యాప్తులో ఈ ముఠా మొగుడంపల్లి చోరీ కేసుతో పాటు ఆల్గోల్, జహీరాబాద్, ఝరాసంగం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు ఇళ్ల చోరీ కేసుల్లో కూడా ప్రమేయం ఉన్నట్లు వెల్లడైంది. అరెస్టు చేసిన ఇద్దరు నిందితులను కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం రిమాండ్‌కు పంపింది.ఈ కేసును త్వరితగతిన ఛేదించి నిందితులను అరెస్టు చేయడంలో విశేష ప్రతిభ కనబరిచిన చిరాగ్‌పల్లి ఎస్ఐ వినయ్ కుమార్, జహీరాబాద్ రూరల్ ఎస్ఐ రాజేందర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ నర్సిములు, కానిస్టేబుళ్లు ఓందేవ్, రాకేష్, హరినేత్ర, ఆనంద్‌తో పాటు ప్రత్యేక బృందంలోని సిబ్బందిని జిల్లా పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.






# జహీరాబాద్ మీదుగా బుల్లెట్ ట్రైన్‌కు కేంద్రం సానుకూల స్పందన

- **ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి వినతిపత్రంపై పరిశీలనకు ఆమోదం తెలిపిన కేంద్ర రైల్వే మంత్రి....**

**జహీరాబాద్ వెలుతురు, జూలై 30:**



ముంబై–హైదరాబాద్ హైస్పీడ్ బుల్లెట్ ట్రైన్ కారిడార్‌ను జహీరాబాద్ మీదుగా ఏర్పాటు చేయాలన్న ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి విజ్ఞప్తిపై కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సానుకూలంగా స్పందించారు. ఈ నెల 11న కేంద్ర మంత్రికి వినతిపత్రం సమర్పించిన ఎమ్మెల్సీ, జహీరాబాద్ పారిశ్రామికాభివృద్ధి, ప్రయాణికుల సౌకర్యం, భవిష్యత్ రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని అలైన్‌మెంట్‌ను జహీరాబాద్ మీదుగా మార్చాలని కోరారు.ఈ విజ్ఞప్తిపై స్పందించిన కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్, ప్రతిపాదనను పరిశీలనకు స్వీకరించినట్లు అధికారిక లేఖ ద్వారా తెలిపారు. సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలించిన అనంతరం అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.కేంద్ర మంత్రి స్పందనపై ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. బుల్లెట్ ట్రైన్ మార్గం జహీరాబాద్ మీదుగా అమలైతే ఈ ప్రాంత పారిశ్రామిక, ఆర్థికాభివృద్ధికి కొత్త ఊతం లభిస్తుందని, రవాణా, లాజిస్టిక్స్ రంగాలు మరింత బలోపేతం కావడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కూడా గణనీయంగా పెరుగుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# రాబోయే 25 సంవత్సరాల జనాభాను దృష్టిలో పెట్టుకొని చందూరు మున్సిపాలిటీ అభివృద్ధి చేసుకోవాలి

- జంగాల కాలనీలో సమస్యలపై కాలనీవాసులతో ముఖాముఖి
- పీహెచ్సీ, బస్టాండ్ తో పాటు నిర్మాణంలో ఉన్న మున్సిపల్ భవనం పరిశీలన
- సరైన రహదారి సౌకర్యం లేకుండా నూతన మున్సిపల్ కార్యాలయాన్ని ఎలా నిర్మిస్తారంటూ సీరియస్
- పీహెచ్సీలో యునాని మందులు వేసుకున్న ఎమ్మెల్యే
- నిరుపేదల ఇండ్ల స్థలాల కోసం మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ ఖాళీ స్థలాలను గుర్తించి నివేదిక ఇవ్వాలని ఆదేశం
- చందూరు మున్సిపాలిటీ పర్యటన లో కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

**చందూరు వెలుతురు జూలై 30:**

రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఉన్న చందూరు మున్సిపాలిటీలో రాబోయే 25 సంవత్సరాల జనాభాను దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి పనులు జరగాలన్నారు గౌరవ మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి చందూరు మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులతో పాటు తిష్ట వేసిన సమస్యలను నేరుగా ప్రజల నుండి తెలుసుకోవడానికి చందూరు మున్సిపాలిటీలోని పలు వార్డులో పర్యటించారు.. ముందుగా జంగాల కాలనీ చేరుకున్న ఆయన అక్కడి నిరుపేదలతో సమావేశమై వాళ్ళ సమస్యలు విన్నారు.. జంగాల కాలనీలో ఉన్న గ్రౌండ్ లెవెల్ నీటి ట్యాంకులు సరిగా లేకపోవడంతో మున్సిపాలిటీ వ్యాప్తంగా 10 నూతన గ్రౌండ్ లెవెల్ నీటి ట్యాంకులు నిర్మించి నిరుపయోగంగా ఉన్న మరో 10 నీటి ట్యాంకులని ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు... అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు.. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం పాతబడిపోవడంతో దాన్ని పూర్తిగా తొలగించి అదే స్థలంలో నూతనంగా నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు.

### యునాని మందులు వేసుకున్న ఎమ్మెల్యే

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిశీలిస్తున్న సందర్భంలో అక్కడే ఉన్న యునాని విభాగానికి సౌకర్యాలు కల్పించాలని యునాని డాక్టర్ సౌజన్య గారు గౌరవ ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకువచ్చారు.. యునాని మందుల ప్రాముఖ్యతను తెలియజేయడంతో పాటు అవి వాడడం వల్ల ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని చెప్పడంతో అప్పటికప్పుడే కొన్ని మందులను స్వయంగా వేసుకున్నారు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి గారు.. యు నాని వైద్యంపై ప్రజల్లో సరైన అవగాహన లేదని అవగాహన కల్పించి మందులను వాడేటట్లు చేయాలని డాక్టర్ సౌజన్య గారికి సూచించారు.

### మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ అభివృద్ధి పనులపై సమీక్ష

ఇప్పటివరకు జరిగిన మున్సిపల్ అభివృద్ధి పనులతో పాటు జరుగుతున్న పనులు మంజూరైన పనులకు సంబంధించి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ మల్లేష్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.. పబ్లిక్ హెల్త్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో జరుగుతున్న పనుల పురోగతిని, మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన పనుల గురించి గౌరవ ఎమ్మెల్యే గారికి వివరించారు.. చందూరు మున్సిపాలిటీలో రాబోయే 25 సంవత్సరాలు దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలన్నారు... ప్రస్తుతం నూతనంగా నిర్మిస్తున్న మున్సిపల్ కార్యాలయ భవనానికి రహదారి సౌకర్యం సరిగా లేదని నిర్మాణాన్ని ఆపి వేరేచోట ఒక ఎకరంలో ఆధునిక హంగులతో నూతన మున్సిపాలిటీ కార్యాలయ భవనాన్ని నిర్మించుకోవాలని దీనికి సంబంధించిన పరిపాలన అనుమతుల కోసం రాష్ట్ర మున్సిపాలిటీ శాఖ కమిషనర్ శ్రీదేవి గారితో ఫోన్లో మాట్లాడారు... ఇప్పుడు కడుతున్న భవనాన్ని వేరే అవసరాలకు ఉపయోగించుకొని నూతనంగా మరోచోట మున్సిపల్ కార్యాలయం నిర్మించుకోవచ్చని ఆమె హామీ ఇచ్చారు... దీంతో పట్టణంలో ఉన్న మార్కెట్ యార్డు స్థలంలో కానీ దేవాదాయ శాఖ భూమిలో గాని స్థలం కేటాయింపచేసి దాంట్లో నూతన మున్సిపల్ కార్యాలయ భవనాన్ని నిర్మించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. చందూరు పట్టణంలో ప్రధాన రహదారిని అభివృద్ధి చేసుకున్నామని వార్డుల్లోని అంతర్గత రోడ్లు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి చేసుకోవాలన్నారు.. అధికారులు ప్రణాళికలు రూపొందించి అంచనాల నివేదిక తయారు చేస్తే పరిపాలన అనుమతులు ఆర్థిక అనుమతులతో పాటు నిధులు తీసుకొచ్చే బాధ్యత నాది అని భరోసా ఇచ్చారు. ప్రతి వార్డులో సుమారు 20 మంది నిరుపేదలను గుర్తించి వారందరికీ ఇళ్లస్థలాలు ఇచ్చేలా ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని ఎమ్మార్వో గారిని ఆదేశించారు. గౌరవ ఎమ్మెల్యే గారి వెంట చందూరు మున్సిపల్ చైర్మన్ కోడి శ్రీనివాసులు, వైస్ చైర్మన్ బూతరాజు దశరథ, అన్ని వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ మల్లేశం, డి ఈ మనోహర, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు ఉన్నారు.





# దోపిడీ అంతమయ్యేదాకా కమ్యూనిస్టుల పోరాటాలు







- సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి

**సంస్థాన్ నారాయణపురం వెలుతురు జూలై 30:**

సమాజంలో పేదలు, కార్మికులు మరియు రైతులపై దోపిడీ, అసమానతలు కొనసాగుతున్నంత కాలం కమ్యూనిస్టుల పోరాటాలు కొనసాగుతూనే ఉంటాయని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి అన్నారు. సంస్థాన్ నారాయణపురం మండలం చిల్లాపురం గ్రామంలో గురువారం నిర్వహించిన సిపిఐ సీనియర్ నాయకులు అమరజీవి మేకల రాములు సంస్మరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కమ్యూనిజం యొక్క మూల సిద్ధాంతం మరియు కార్మిక వర్గ విముక్తి కోసం పోరాటాలు అనివార్యమని తెలిపారు. చరిత్రలో ఎన్నో రైతాంగ పోరాటాలు, కార్మిక ఉద్యమాలు, పీడిత ప్రజల హక్కుల కోసం కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో జరిగాయని చెప్పారు. సుదీర్ఘంగా కొనసాగుతున్న పోరాటాలను, విజయాలను ఆదర్శంగా తీసుకుని ప్రజా ఉద్యమాలకు సిద్ధం కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నేటి సమాజంలో ఆర్థిక అసమానతలు, అన్యాయాలు ఉన్నంత వరకు ఈ సైద్ధాంతిక పోరాటాలు కొనసాగుతూనే ఉంటాయన్నారు.

దేశంలో కమ్యూనిస్టుల ఆవశ్యకత ఈనాడు పెరిగిందన్నారు . ఉద్యోగ భద్రత లేదని, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు పేరుతో అతి తక్కువ వేతనాలతో శ్రమను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ప్రశ్నించేవారిని అణచి వేస్తున్నారని, రాజ్యాంగాన్ని కాలరాస్తున్నారని అన్నారు. కవులు, కళాకారులపై మతోన్మాద, అరాచక శక్తులు దాడి చేస్తున్నాయని అన్నారు. బిజెపి ప్రభుత్వం సోషల్ మీడియాని ఒక ఆయుధం గా మలుచుకొని ద్రోహపూరిత విషజ్వాలలను విర జిమ్ముతుందన్నారు. ప్రపంచంలో బలమైన శక్తి కమ్యూనిజం అన్నారు. కమ్యూనిజం ఇంకెక్కడ ఉన్నది అనేవారికి జవాబు, ప్రపంచ జనాభా 600 కోట్లలో మూడో వంతు అనగా 108 కోట్ల జనాభా కలిగిన దేశాలలో కమ్యూనిస్టులు అధికారంలో ఉన్నారని గుర్తు చేశారు. కమ్యూనిస్టుకు మరణం లేదని, కమ్యూనిజానికి అంతం లేదని అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ పొత్తులు ఉన్నప్పటికీ, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల తరపున ఉద్యమాలకు వెనకాడబోమని తెలిపారు. సిపిఐ ప్రజా ఉద్యమాలు చేపట్టి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ పోరాట స్ఫూర్తిని పుణికి పుచ్చుకొని దేశంలో, రాష్ట్రంలో ఉన్న పేదవర్గాల హక్కుల కోసం ప్రజా ఉద్యమాలకు మరింత పదును పెడతామన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం సోషలిస్టు వ్యవస్థ మాత్రమేనని, మనిషి కేంద్రంగా పుట్టిన సిద్ధాంతమే కమ్యూనిస్టు సిద్ధాంతమన్నారు. మనిషి ఉన్నంతకాలం, మనిషిలో ఆలోచనలు, భావాలు, ప్రశ్నలు ఉన్నంత కాలం కమ్యూనిజం ఉంటుందన్నారు. సృష్టి ఉన్నంతకాలం కమ్యూనిజం కొనసాగుతుందని, కమ్యూనిస్టుల విలీనం దేశానికి, దేశ ప్రయోజనాలకు ఒక దిక్సూచి అన్నారు.

మేకల రాములు సిపిఐ లో క్రియాశీలక నాయకుడిగా చేశారని, రాచకొండ ప్రాంతంలో దొరల భూస్వాముల అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడాడని కొనియాడారు. గిరిజన తండాలో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు పాలకుల దృష్టికి తీసుకు వచ్చి సమస్యలను పరిష్కరించేవాడని అన్నారు.

### పోరాటాల్లో ముందుండే రాములు

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఈ ప్రాంతంలో నిర్వహించే పోరాటాల్లో మేకల రాములు ముందుండేవారని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కొనియాడారు. నాటి పాలకులు మేకల రాములుపై మోపిన అక్రమ కేసులకు భయపడకుండా జైల్ జీవితం అనుభవించాడని గుర్తు చేశారు. పార్టీ అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడేవారన్నారు. ఆయన పోరాట స్ఫూర్తితో కమ్యూనిస్ట్ కార్యకర్తలు ముందుకెళ్లాలని అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి సమక్షంలో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు సిపిఐ లో చేరారు. సభకు సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్ అధ్యక్షత వహించారు.

కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కురిమిద్దె శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య, పల్లె శేఖర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు చిలువేరు అంజయ్య, సిపిఐ సర్పంచ్ ముత్యాల ఆంజయ్య, మాజీ సర్పంచ్ నరేందర్ రెడ్డి, నాయకులు జగన్, కలకొండ సంజీవ, కొప్పు యాదయ్య, పాండురంగారావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పనకబండలో హరితహారం కార్యక్రమం మొక్కలు పంపిణీ చేసిన సర్పంచ్

**మోత్కూర్, జులై 30,వెలుతురు న్యూస్ :**



మోత్కూర్ మండలం పనకబండ గ్రామంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ లోతకుంట రేణుక మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ చెట్లే మానవాళి మనుగడకు మూలం అని ఒక్క వ్యక్తికి కనీసం 500 చెట్ల చొప్పున ఉంటే కానీ పర్యావరణం సమ తుల్యతను పాటించదని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాధారవు మల్లేష్, గ్రామ కార్యదర్శి కేతావత్ అలివేలు, ఫీల్డ్ అసెస్మెంట్ రాంపాక రవి,అప్పం జలంధర్,వడ్డేపల్లి విజయ,లోతకుంట శివ, రాపోల్ రాజు,లోతకుంట శ్రీశైలం రాపోల్ లలిత,ఎండీ అక్బర్ గ్రామ సిబ్బంది వడ్డేపల్లి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# దత్తప్ప గూడెం లో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

**మోత్కూర్, జూలై 30,వెలుతురు న్యూస్ :**



మోత్కూరు మండలం దత్తప్పగూడెం గ్రామానికి చెందిన దేవసారి వీరమ్మ నా అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందగా వీరికి మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గారు మాజీ ఎంపీటీసీ ఎలుగు పార్వతమ్మ యాదయ్య గార్ల సహాయంతో 60,000/- వేయిల చెక్కు మంజూరు అయింది. ఆ చెక్కును గ్రామ శాఖ ఉపాధ్యక్షుడు చింత చంద్రయ్య, 3వ వార్డు మెంబర్ ముక్కెర్ల మత్స్యగిరి గురువారం నాడు అందజేశారు.ఈ కార్యక్రమంలో నోముల సాయిలు,యూత్ కాంగ్రెస్ నాయకులు తొంట నరేందర్,దేవసరి రాములు,ఏలుగు ఐలయ్య, వల్లందాస్ వెంకన్న,ధర్మారెడ్డి, దేవసరి వెంకన్న,ఓర్సు చంద్రయ్య,భూమ యాదయ్య, గొలుసుల నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# గీత కార్మికుల హక్కుల సాధన చైతన్య యాత్ర విజయవంతం చేయాలి

- గుండాల మండల కేంద్రంలో ఘనంగా గీత కార్మికుల చైతన్య యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

**గుండాల, జూలై 30(వెలుతురు):**



గుండాల మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న గీత కార్మికుల చైతన్య యాత్ర పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 2 నుంచి 18 వరకు నిర్వహించనున్న ఈ చైతన్య యాత్రను విజయవంతం చేయాలనే సంకల్పంతో గీత కార్మికులు, గౌడ కులస్తులు పెద్ద సంఖ్యలో హాజరై పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గీత కార్మికులు ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న సమస్యలు నేటికీ పరిష్కారం కాకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వేలాది కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాయని, ప్రభుత్వం గీత కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.చైతన్య యాత్ర ద్వారా గీత కార్మికుల హక్కులు, సంక్షేమం, ఉపాధి భద్రత, ప్రమాద బీమా, పెన్షన్, ఆర్థిక సహాయం, వృత్తి పరిరక్షణ వంటి అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. గీత కార్మికులందరూ కుల, ప్రాంత భేదాలకు అతీతంగా ఐక్యంగా ముందుకు వచ్చి యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఆగస్టు 2 నుంచి ప్రారంభమయ్యే ఈ యాత్ర రాష్ట్రంలోని పలు జిల్లాల మీదుగా కొనసాగి ఆగస్టు 18న హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వద్ద ముగుస్తుందని పేర్కొన్నారు. యాత్ర విజయవంతమైతే గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం స్పందించే అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సూదగాని రామచంద్రయ్య గౌడ్, పొడిచేటి వెంకన్న గౌడ్, ఏలికట్టె శేఖర్ గౌడ్, పాటు గుండాల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గౌడ కులస్తులు, గీత కార్మికులు పాల్గొని పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం చైతన్య యాత్రను విజయవంతం చేయాలని నినాదాలు చేస్తూ గీత కార్మికుల ఐక్యతను చాటిచెప్పారు.

# విద్యార్థుల వివరాలను యూడైస్ ప్లస్‌లో పగడ్బందీగా నమోదు చేయాలి

- జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ శ్రీహరి



గుండాల, జూలై 30:(వెలుతురు): యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల వివరాలను యూ-డైస్ ప్లస్ (U-DISE+)లో ఎలాంటి పొరపాట్లు లేకుండా పగడ్బందీగా నమోదు చేయాలని జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ శ్రీహరి సూచించారు.గుండాల మండల కేంద్రంలోని ఎంఆర్సీ (MRC)లో ఏర్పాటు చేసిన యూ-డైస్ ప్లస్ ప్రత్యేక క్యాంపును ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలోని 17 మండలాల మండల విద్యా వనరుల కేంద్రాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి, జిల్లాలోని 884 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు చెందిన సుమారు 1.15 లక్షల మంది విద్యార్థుల వివరాలను యూ-డైస్ ప్లస్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు.విద్యార్థుల నమోదు, డ్రాప్‌బాక్స్ క్లియరెన్స్, అపార్ (APAAR) నమోదు ప్రక్రియలను క్షేత్రస్థాయిలో సీఆర్పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్ల సహకారంతో సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఆధార్ నమోదు, తప్పుల సవరణలు, మాండేటరీ బయోమెట్రిక్ అప్‌డేట్ (MBU) కోసం విరించి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని 17 మండలాలకు ప్రత్యేక కోఆర్డినేటర్లను నియమించినట్లు తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మన్నె అగ్గి రాములు, విరించి సంస్థ ఆధార్ జిల్లా కోఆర్డినేటర్ రూపాని మహేష్, సీఆర్పీ దేవనబోయిన లింగయ్య, ఎంఐఎస్ కోఆర్డినేటర్ దేవనబోయిన నరేష్, కంప్యూటర్ ఆపరేటర్లు హనీఫ్ అజీముద్దీన్, సంతోష్, మౌనిక, అనిత, పాహిమా, కేజీబీవీ ఉపాధ్యాయులు కౌసల్య, అన్నపూర్ణ, శాంతినికేతన్ ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులు శోభ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి: తపస్

**చిన్నశంకరంపేట్ వెలుతురు జూలై 30:**






ఉద్యోగ,ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఆగస్టు 1న ఇందిరా పార్క్ వద్ద జరిగే మహా ధర్నా పోస్టర్ ను తపస్ చిన్న శంకరం పేట్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహేష్, శ్రీహరి ఆధ్వర్యంలో మోడల్ స్కూల్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్లా లక్ష్మణ్ మాట్లాడుతూ కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా జీఓ 317 బాధితులందరికీ న్యాయం, సిపిఎస్ రద్దు చేసి ఓ పి ఎస్ అమలు, పెండింగ్ డిఏలను, జిపిఎఫ్ బకాయిల విడుదల, పిఆర్సి అమలు వంటి హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని, మోడల్ స్కూల్, కేజీబివి, గురుకుల,రెసిడెన్షియల్ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, పదవి విరమణ పొందిన ఉద్యోగులకు రావలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని వారన్నారు.ఈ తపస్ జిల్లా బాధ్యులు శ్రీకాంత్ రెడ్డి, లింగం, అల్లం ఆంజనేయులు, మరియు నరేందర్, కవిత,చంద్ర కాంత్, స్వప్న, నవీన్, చంద్ర శేఖర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు .

# హౌసింగ్ బోర్డు కాలనీలో వర్షపు నీటి ముంపు సమస్యను పరిష్కరించండి

- **మున్సిపల్ కమిషనర్‌కు బిజెపి నాయకులు తోట సాగర్ వినతి**

**కరీంనగర్ వెలుతురు జూలై 30:**



కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 7వ డివిజన్ హౌసింగ్ బోర్డు కాలనీలో వర్షాకాలంలో నీటి ముంపుతో ఎదురవుతున్న తీవ్ర ఇబ్బందులు సమస్యలపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం రోజున బిజెపి కాంటెస్టెంట్ కార్పొరేటర్ తోట సాగర్ మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం సమర్పించారు. కాలనీలోని రోడ్ నంబర్ 2 శివాలయం ఏరియా పలు లోతట్టు ప్రాంతాలలో ప్రతి ఏటా వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోవడమే కాకుండా, నేరుగా ఇళ్లలోకి చేరుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.. ముఖ్యంగా హౌస్ నంబర్ 5-7-338/7 నుండి 5-7-338/15, 16 మరియు 5-7-283 ప్రాంతాలలోని ఇళ్లలోకి వర్షపు నీరు భారీగా వచ్చి చేరుతోందని, దీనివల్ల ఆ ప్రాంత ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఈ వర్షపు నీటిని మళ్లించడానికి చర్యలు తీసుకుని ఇళ్లలోకి నీరు రాకుండా తగు చర్యలు తీసుకోవాలని తోట సాగర్ వినతి పత్రంలో కోరారు.

# కరీంనగర్ కళాకారుల బోనాల జాతర పోస్టర్‌ను ఆవిష్కరించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

- **ఆగస్టు 5న బోనాల ర్యాలీ, సాంస్కృతిక కార్యక్రమాలకు ఘన ఏర్పాట్లు**

**కరీంనగర్ వెలుతురు జూలై 30:**



కరీంనగర్ కళాకారుల ఆధ్వర్యంలో ఆగస్టు 5వ తేదీన నిర్వహించనున్న కరీంనగర్ కళాకారుల బోనాల జాతర పోస్టర్‌ను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మేయర్ గారు మాట్లాడుతూ, ఆగస్టు 5న ఉదయం 9 గంటలకు గీతాభవన్, తెలంగాణ చౌక్ నుంచి బోనాల ర్యాలీ ప్రారంభమై కోతిరంపూర్ పోచమ్మ ఆలయం వరకు కొనసాగుతుందని, అక్కడ అమ్మవారికి బోనాలను సమర్పించనున్నట్లు తెలిపారు.అనంతరం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు (ఆట–పాట) నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కరీంనగర్ కళాకారులు పెద్ద ఎత్తున పాల్గొని బోనాల జాతరను విజయవంతం చేయాలని మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గోగుల ప్రసాద్, బాబు గౌరవేణి, సంతోష్ తమ్మిశెట్టి, అభినవ్ కొత్తకొండ, తిప్పబత్తిని రవి, చిలివేరి శ్రీకాంత్, యతిరాజు, దేవరాయ శ్రీనివాస్, దాసం అజయ్, సంద స్వప్న, గాజుల ప్రీతి తదితరులు పాల్గొన్నారు.

# మద్దతిచ్చి మోసపోయాం... మున్సిపల్ కార్యాలయం ఎదుట చెప్పుతో కొట్టుకున్న కౌన్సిలర్ భర్త

- **ఎంఐఎం మద్దతుతో చైర్మన్ అయ్యి.. మా వార్డులనే విస్మరించారని ఆగ్రహం...**
- **అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభించకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరిక...**

**జహీరాబాద్ వెలుతురు, జూలై 30:**





సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయం ఎదుట గురువారం కౌన్సిల్ సమావేశం సందర్భంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. 8వ వార్డు కౌన్సిలర్ సోని ఎర్మియా భర్త ఎర్మియా తనను తాను చెప్పుతో కొట్టుకుంటూ వినూత్న నిరసన చేపట్టడం కలకలం రేపింది. తమ వార్డులో అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోయాయని, ప్రజల సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ ఆయన ఈ నిరసనకు దిగారు.జహీరాబాద్ మున్సిపాలిటీ ఎన్నికల్లో ఏ పార్టీకి పూర్తి మెజారిటీ రాకపోవడంతో ఎంఐఎం కౌన్సిలర్ల మద్దతుతో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎం.డి. యూనుస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారని ఎర్మియా పేర్కొన్నారు. తమ భార్య సోని ఎర్మియా ఎంఐఎం తరపున 8వ వార్డు కౌన్సిలర్‌గా గెలిచినప్పటికీ, గత ఆరు నెలలుగా వార్డులో ఒక్క అభివృద్ధి పని కూడా చేపట్టలేదని ఆరోపించారు.ఇప్పటి వరకు జరిగిన మూడు కౌన్సిల్ సమావేశాల్లో తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు తదితర సమస్యలను ప్రస్తావించినప్పటికీ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ స్పందించలేదని అన్నారు. పలుమార్లు కాంగ్రెస్ ముఖ్య నాయకుల దృష్టికి తీసుకెళ్లినా పరిస్థితిలో మార్పు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చివరి ప్రయత్నంగా తనను తాను చెప్పుతో కొట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్నానని ఎర్మియా తెలిపారు. ఎంఐఎం మద్దతుతో అధికారంలోకి వచ్చి ఇప్పుడు తమ వార్డును విస్మరించడం అన్యాయమని మండిపడ్డారు. వెంటనే అభివృద్ధి పనులు ప్రారంభించకపోతే ప్రజలతో కలిసి మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ ఘటనతో మున్సిపల్ కార్యాలయం వద్ద కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# తీగలగుట్టపల్లి ఆర్వోబీ పనులపై మేయర్, కమిషనర్ ఆకస్మిక తనిఖీ

- **కార్పొరేషన్ ఆధ్వర్యంలోనే బీటీ రోడ్డు, కల్వర్టు నిర్మాణానికి నిర్ణయం**
- **కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆదేశాలతో హుటాహుటిన చర్యలు**
- **ప్రజలకు ఇబ్బందులు లేకుండా యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని అధికారులకు మేయర్ ఆదేశాలు**

**కరీంనగర్ వెలుతురు జూలై 30:**





కరీంనగర్ నగరంలోని తీగలగుట్టపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణ పనుల్లో నెలకొన్న జాప్యం, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల నేపథ్యంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఐఏఎస్ గురువారం ఆకస్మికంగా నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఇటీవల ఆర్వోబీ సమీపంలోని కల్వర్టులో ఓ వృద్ధురాలు పడిపోయిన ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ సంబంధిత ఆర్&బీ అధికారులు, కాంట్రాక్టర్లతో మాట్లాడి ప్రజలకు ఇబ్బందులు లేకుండా తక్షణ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం న్యూఢిల్లీ నుంచి మేయర్ కొలగాని శ్రీనివాస్‌తో ఫోన్‌లో మాట్లాడి, మున్సిపల్ కార్పొరేషన్ తరపున అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో మేయర్ వెంటనే సంఘటన స్థలాన్ని పరిశీలించి తాత్కాలిక పరిష్కారంగా బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టారు.అనంతరం మేయర్ కొలగాని శ్రీనివాస్, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఏసీపీ విజయ్ కుమార్ ఆర్వోబీ నిర్మాణ ప్రాంతానికి చేరుకుని బీటీ రోడ్డు, కల్వర్టు పరిస్థితిని పరిశీలించారు. ప్రజలు ఎదుర్కొంటున్న రాకపోకల ఇబ్బందులను ప్రత్యక్షంగా గమనించిన మేయర్, రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు అందుబాటులో లేకపోయినా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలోనే బీటీ రోడ్డు, కల్వర్టు నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని నిర్ణయించారు. సంబంధిత అధికారులకు వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా ఆర్&బీ అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ ఆర్వోబీ నిర్మాణంలో ప్రధాన అడ్డంకి భూసేకరణ జాప్యమేనని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో భూసేకరణ పూర్తికాకపోవడంతో పనులు ఆలస్యమయ్యాయని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేస్తూ త్వరలో నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు తెలిపారు.అలాగే ఆర్వోబీ నిర్మాణ సమయంలో ప్రజల రాకపోకలకు ప్రత్యామ్నాయంగా చేపట్టాల్సిన బీటీ రోడ్డు, కల్వర్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఆ పనులు నిలిచిపోయినట్లు అధికారులు వెల్లడించారు.ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వ సేతు బంధన్ పథకం కింద ఆర్వోబీ నిర్మాణానికి అవసరమైన నిధులు పూర్తిగా విడుదల చేసినప్పటికీ పనులు ఎందుకు ఆలస్యం అవుతున్నాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ కాంట్రాక్టర్‌ను ప్రశ్నించారు. దీనికి స్పందించిన నిర్మాణ సంస్థ ప్రతినిధులు భూసేకరణ ప్రక్రియ పూర్తికాగానే పనులు వేగవంతం చేస్తామని, వచ్చే ఆరు నెలల్లో ఒక వైపు ఆర్వోబీ నిర్మాణాన్ని పూర్తి చేసి, ఒప్పందం ప్రకారం వచ్చే ఏడాదిలోపు మొత్తం ఆర్వోబీ నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.అలాగే నగరంలోని పలు డివిజన్లలో వర్షాల ప్రభావానికి గురైన ప్రాంతాలను కూడా మేయర్ పరిశీలించి, అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రభుత్వాల మధ్య నిధుల అంశం ఎలా ఉన్నప్పటికీ నగర ప్రజలు ఇబ్బందులు పడకుండా మున్సిపల్ కార్పొరేషన్ తరపున అవసరమైన బీటీ రోడ్డు, కల్వర్టు నిర్మాణ పనులను అత్యవసరంగా చేపడతామని స్పష్టం చేశారు. పనుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ తనిఖీలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఐఏఎస్, ఏసీపీ విజయ్ కుమార్, సీఐ నిరంజన్ రెడ్డి, ఎస్సై లక్ష్మారెడ్డి, ఆర్&బీ అధికారులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్ల విస్తరణలో పారదర్శకత పాటించాలి.. వ్యాపారులను భయాందోళనలకు గురిచేయొద్దు

- **కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వకుండానే కొలతలు వేయడం సరికాదని మండిపాటు...**
- **మాస్టర్ ప్లాన్ పూర్తి వివరాలు బహిర్గతం చేయాలని డిమాండ్...**
- **వ్యాపారులకు ముందస్తు సమాచారం ఇచ్చి స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని సూచన...**
- **26వ వార్డు కౌన్సిలర్ నామ స్రవంతి రవికిరణ్....**

**జహీరాబాద్ వెలుతురు, జూలై 30:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలో భవాని మందిర్, హనుమాన్ మందిర్ రోడ్లలో మాస్టర్ ప్లాన్ ప్రకారం చేపడుతున్న రోడ్ల విస్తరణ ప్రక్రియలో అధికారులు అనుసరిస్తున్న విధానం సరికాదని 27వ వార్డు కౌన్సిలర్ నామ స్రవంతి రవికిరణ్ విమర్శించారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆమె ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ అధికారుల తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.పట్టణ అభివృద్ధికి, రోడ్ల విస్తరణకు తాము ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యతిరేకం కాదని, అభివృద్ధి పనులకు పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. అయితే ప్రజాప్రతినిధులకు కనీస సమాచారం ఇవ్వకుండా మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు అకస్మాత్తుగా రోడ్లకు కొలతలు వేయడం ప్రజల్లో అనుమానాలు, వ్యాపారుల్లో భయాందోళనలు సృష్టించిందన్నారు.గతంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో మాస్టర్ ప్లాన్ పూర్తి వివరాలను కౌన్సిల్ ముందు ఉంచాలని కోరినా, నెలలు గడిచినా ఎలాంటి సమాచారం ఇవ్వలేదని తెలిపారు. ఇప్పుడు ఒక్కసారిగా అధికారులు క్షేత్రస్థాయిలో కొలతలు చేపట్టడం, దీనిపై మీడియాలో వార్తలు రావడంతో రోడ్ల వెంట ఉన్న వ్యాపారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు.రోడ్డు ఎంత మేర విస్తరిస్తారు, ఎన్ని అడుగుల మేర నిర్మాణాలు ప్రభావితమవుతాయి, ఆక్రమణల తొలగింపు ఎలా ఉంటుంది వంటి అంశాలపై స్పష్టమైన ప్రణాళికను ప్రజల ముందుంచాలని ఆమె డిమాండ్ చేశారు. ముందస్తు సమాచారం ఉంటే వ్యాపారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు.నిన్న జరిగిన కొలతల విషయమై మున్సిపల్ కమిషనర్‌ను ప్రశ్నించగా, "సాధారణంగా పరిశీలనకు వెళ్లాం.. మీడియా ఫోటోలు తీసింది" అనే సమాధానం చెప్పడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రజలను, వ్యాపారులను అనవసరంగా భయాందోళనలకు గురిచేయకుండా, అందరికీ ఆమోదయోగ్యమైన ప్రణాళికతో, పూర్తి పారదర్శకతతో రోడ్ల విస్తరణ పనులు చేపట్టాలని ఆమె అధికారులను కోరారు.

# కరీంనగర్‌లో ఘనంగా నూతన మైసమ్మ దేవాలయ ప్రతిష్టా మహోత్సవ వేడుకలు...

**వేడుకల్లో పాల్గొన్న మేయర్ కోలగని శ్రీనివాస్**

**కరీంనగర్ వెలుతురు జూలై 30:**





కరీంనగర్ పదో డివిజన్ పరిధిలోని వివేకానంద నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన మైసమ్మ దేవాలయ అమ్మవారి ప్రతిష్టా మహోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరిగాయి. అమ్మవారి ప్రతిష్ట మహోత్సవ వేడుకలకు ముఖ్య అతిథులుగా కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ,స్థానిక కార్పొరేటర్ కొమరయ్య లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు నూతనంగా ప్రతిష్ఠించిన శ్రీ మైసమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా ప్రతిష్టా కార్యక్రమాలను కన్నుల పండుగగా చేపట్టారు. కాలనీ ప్రజలు అందరూ కలిసికట్టుగా పండుగ వాతావరణంలో అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేయడంతో దేవాలయ ప్రాంగణం అమ్మవారి నామస్మరణతో మార్మోగింది.ఈ సందర్భంగా మేయర్ కోలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ... దైవభక్తి, ఆధ్యాత్మిక చింతన మానసిక ప్రశాంతతను ఇస్తాయని తెలిపారు.స్థానిక కాలనీ వాసులందరూ ఐక్యతతో ముందుకు వచ్చి నూతన దేవాలయాన్ని నిర్మించుకోవడం అభినందనీయమన్నారు.అమ్మవారి ఆశీస్సులు కరీంనగర్ నగర ప్రజలందరిపై ఉండాలని, నగరం సుభిక్షంగా వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఆలయ అభివృద్ధికి, భక్తుల సౌకర్యాల కల్పనకు తన వంతు పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, స్థానిక కాలనీ పెద్దలు, యువకులు భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# జహీరాబాద్ మాస్టర్ ప్లాన్‌పై ఇంకా నిర్ణయం లేదు...సర్వే ప్రాథమిక దశలోనే

- **మున్సిపల్ కమిషనర్ జి. ప్రభాకర్...**

**జహీరాబాద్ వెలుతురు జూలై 30:**





సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో మాస్టర్ ప్లాన్ అమలుపై జరుగుతున్న ప్రచారాలకు మున్సిపల్ కమిషనర్ జి. ప్రభాకర్ తెరదించారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన సర్వే కేవలం ప్రాథమిక దర్యాప్తు మాత్రమేనని, మాస్టర్ ప్లాన్ అమలుపై ఇప్పటివరకు ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు.మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో నిర్వహించిన అత్యవసర సమావేశంలో 26వ వార్డు కౌన్సిలర్ నామ స్రవంతి కిరణ్ మాస్టర్ ప్లాన్ అమలుపై ప్రశ్నించగా కమిషనర్ స్పందించారు. ఈ అంశంపై త్వరలోనే ప్రత్యేక కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను తీసుకున్న అనంతరమే తదుపరి నిర్ణయం ఉంటుందని వెల్లడించారు.అంతకుముందు ప్రతిపాదిత 40 అడుగుల రహదారులపై ఉన్న ఆక్రమణలను గుర్తించేందుకు కమిషనర్ జి. ప్రభాకర్ టౌన్ ప్లానింగ్ అధికారులు, మున్సిపల్ సిబ్బందితో కలిసి భవాని మందిర్ రోడ్, హనుమాన్ మందిర్ రోడ్‌లలో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. రహదారి అలైన్‌మెంట్‌ను పరిశీలించిన అధికారులు ఆక్రమణలను గుర్తించి, మాస్టర్ ప్లాన్ నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ప్రజల్లో అనవసర ఆందోళనలు, అపోహలు సృష్టించే ప్రచారాలను నమ్మవద్దని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. మాస్టర్ ప్లాన్‌కు సంబంధించిన ప్రతి నిర్ణయం చట్టబద్ధమైన విధానంలో, ప్రజాప్రతినిధులతో సంప్రదింపులు జరిపిన అనంతరమే తీసుకుంటామని స్పష్టం చేశారు.

# దళిత సంక్షేమాన్ని విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- **ప్రభుత్వ సబ్ ప్లాన్ నిధులను పునరుద్ధరించి, ప్రతి దళిత కుటుంబానికి ఇల్లు నిర్మించి ఇవ్వాలి.**
- **ఆగస్టు 3న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద ధర్నాను జయప్రదం చేయండి.**
- **మారుపాక అనిల్ కుమార్**
- **డి హెచ్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.**

**హైదరాబాద్ వెలుతురు జూలై 30:**

తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం దళిత సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తోందని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) తెలంగాణ రాష్ట్ర ప్రధనకార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించింది. డి హెచ్ పి ఎస్ హైదరాబాద్ జిల్లా సమితి సమావేశం కె బాబు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రధాన



కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ మాట్లాడుతూ దళితుల అభివృద్ధికి ఉద్దేశించిన ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు ఇతర అవసరాలకు మళ్లించడం రాజ్యాంగ స్ఫూర్తికి, సామాజిక న్యాయానికి విరుద్ధమని పేర్కొంది. దళితుల విద్య, ఉపాధి, గృహనిర్మాణం, ఆరోగ్యం, మౌలిక వసతుల కోసం ఖర్చు చేయాల్సిన నిధులను పూర్తిగా అదే లక్ష్యాలకు వినియోగించాలని డిమాండ్ చేసింది. హైదరాబాద్ జిల్లాలో వేలాది దళిత కుటుంబాలు ఇప్పటికీ సొంత ఇల్లు లేక అద్దె ఇళ్లలో లేదా తాత్కాలిక నివాసాల్లో జీవిస్తున్నాయని, ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక కార్యాచరణ చేపట్టి ప్రతి దళిత కుటుంబానికి గౌరవప్రదమైన శాశ్వత ఇల్లు నిర్మించి ఇవ్వాలని అనిల్ కుమార్ డిమాండ్ చేస్తున్నారు. ఆగస్టు మూడున దళిత సమాజం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ల కార్యాలయం ముట్టడి నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను పూర్తిస్థాయిలో పునరుద్ధరించి దళిత సంక్షేమానికే ఖర్చు చేయాలి.ప్రతి దళిత కుటుంబానికి ఉచితంగా శాశ్వత గృహాన్ని నిర్మించి ఇవ్వాలి .

దళితులకు పెండింగ్‌లో ఉన్న సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలి.దళిత బస్తీలలో మౌలిక వసతులు, తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, విద్యుత్ వంటి సౌకర్యాలను మెరుగుపరచాలి.దళిత యువతకు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించి, ఆర్థిక సహాయాన్ని అందించాలి.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తే రాష్ట్రవ్యాప్తంగా దళిత ప్రజలను సమీకరించి ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని అనిల్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కాంపెల్లి శ్రీనివాస్, సిహెచ్ శ్రీనివాస్, మురళి, జి యాకయ్య, జీ రవి, హనుమంత్, ప్రభు తదితరులు హాజరైనారు.

# కుషాయిగూడ కూరగాయల మార్కెట్ అక్రమాలపై విజిలెన్స్ విచారణకు డిమాండ్

**ఉప్పల్, జూలై 30 (వెలుతురు):**



కాప్రా సర్కిల్ పరిధిలోని కుషాయిగూడ కూరగాయల మార్కెట్‌లో జరుగుతున్న అక్రమ బదిలీలు, నిబంధనల ఉల్లంఘనలపై సమగ్ర విజిలెన్స్ విచారణ జరిపించాలని కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ.. మార్కెట్‌లోని 219 షాపుల్లో కేవలం 30 మంది మాత్రమే అసలు కేటాయింపుదారులు కొనసాగుతున్నారని, మిగిలిన 119 షాపులను రూ.25 లక్షల నుండి రూ.30 లక్షల వరకు అక్రమంగా విక్రయించారని ఆరోపించారు. కొందరు వ్యక్తులు 3 నుండి 10 షాపులను గుత్తగా కొనుగోలు చేసి అద్దెకు తిప్పుతున్నారని, మరికొందరు కూరగాయలు అమ్మాల్సిన చోట రియల్ ఎస్టేట్, ఫైనాన్స్ వ్యాపారాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రతిరోజూ మార్కెట్‌కు వచ్చే రైతుల నుండి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని, కోట్ల రూపాయల అద్దెలు, విద్యుత్ బిల్లులు బకాయిపడి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారి కేటాయింపులను రద్దు చేసి, ఖాళీ షాపులను స్థానిక పేద నిరుద్యోగ యువతకు పారదర్శకంగా కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పనగట్ల చక్రపాణి గౌడ్, చల్లా ప్రభాకర్, కొడకండ్ల యాదయ్య, వెంకటేశ్వర్లు, పండాల గణేష్ గౌడ్, దయానంద్, పిట్టల రాజు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# అకారణంగా ఎలాంటి విచారణ లేకుండా మలక్‌పేట సీఐ కుంభం నరసింహ గౌడ్‌ను సస్పెండ్ చేయడం సరికాదు

- **50 కి పైగా వేధింపుల కేసులు పెట్టి ఎంతో మంది అమాయకులను ఇబ్బందులకు గురిచేసిన కిలాడి మహిళ అడ్వకేట్ ఆరోపించిందని బీసీ అధికారిని బలిపశువును చేస్తారా ???**
- **బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్**

**హైదరాబాద్ వెలుతురు జూలై 30:**

హైదరాబాద్ మలక్‌పేట సీఐ కుంభం నరసింహ గౌడ్‌ను ఎలాంటి సమగ్ర విచారణ నిర్వహించకుండా కేవలం ఒక నేర చరిత్ర కలిగిన మహిళ అడ్వకేట్ పైన ఇట్టి CI గారు గతంలో సుల్తాన్ బజార్ PS లో ఒక హోటల్ యజమాని ఫిర్యాదు మేరకు ఆమెపై కేసు నమోదు చేసినందున,అట్టి కక్ష్యతో ఆ కిలాడి లేడీ ఇచ్చిన ఆరోపణల ఆధారంగా సస్పెండ్ చేయడం సరికాదని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ మహిళా కానిస్టేబుల్ ను వేధించినట్లు తప్పుడు వార్త వివిధ మీడియాలో రావడం చాలా బాధాకరం. గతంలో ఇదే కిలాడి మహిళ అడ్వకేట్ యాభైకి పైగా ఇలాంటి ఆరోపణలతోనే వివిధ పోలీస్ స్టేషన్లలో వివిధ వ్యక్తులు మరియు అధికారులను ఇబ్బందులకు మరియు బ్లాక్ మెయిల్ కు గురిచేసిందనే ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ఒక కేసులో ఇదే కిలాడి మహిళ పై అబిడ్స్ పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్ కు పంపిస్తే 17 రోజులు జైలు జీవితం గడిపి బెయిలు పై వచ్చి, మళ్ళీ ఇదే దందా కొనసాగిస్తూ ఉందన్నారు. అలాంటి పరిస్థితుల్లో ఆరోపణలలోని నిజానిజాలను పూర్తిస్థాయిలో విచారించకుండా ఏకపక్షంగా చర్యలు తీసుకోవడం న్యాయసమ్మతం కాదన్నారు.హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు అందిన తర్వాత సంబంధిత అంశంపై సమగ్ర విచారణ జరిపి,వాస్తవాలను నిర్ధారించిన అనంతరమే నిర్ణయం తీసుకోవాల్సి ఉండేదని అన్నారు. విచారణకు ముందే సస్పెన్షన్ విధించడం బాధాకరమైన విషయమని పేర్కొన్నారు.నిజానిజాలను వెలికితీసేలా నిష్పాక్షిక విచారణ నిర్వహించి, న్యాయబద్ధమైన నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులను జాజుల లింగం గౌడ్ కోరారు ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు ఎర్రబెల్లి దుర్గయ్య జయమ్మ సత్యనారాయణ నక్క నాగరాజు గోనేటి శేఖర్ ఎస్పీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



# పవిత్రతకు ప్రాధాన్యం విగ్రహాల సేకరణ కు శ్రీకారం ముందుకొచ్చిన సనాతన ట్రస్ట్

**హైదరాబాద్ వెలుతురు జూలై 30:**



రాష్ట్రవ్యాప్తంగా పాత దేవతా విగ్రహాల పరిరక్షణకు ప్రత్యేక కార్యక్రమాలు ఊపందుకున్నాయి. ఇళ్లలో, దేవాలయాల్లో కాలక్రమేణా శిథిలావస్థకు చేరి పూజకు అనువుగా లేని దేవతా విగ్రహాలను చెత్తలో వేయకుండా గౌరవప్రదంగా సేకరించి శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీలు, ధార్మిక సంస్థలు ముందుకు వస్తున్నాయి.ఇందులో భాగంగా నాగోల్ ఆనంద్ నగర్ కేంద్రంగా ఉన్న సనాతన సేవా ట్రస్ట్ ఆగస్టు మొదటి వారంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.ఆనంద్ నగర్ ఇంద్రప్రస్థ కాలనీ లోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయం ఇందుకు వేదిక కానుంది. చెట్ల దగ్గర, చెరువులలో పాత దేవతా చిత్రాలను పడేయకుండా సనాతన ట్రస్ట్ కు అందించాలని ట్రస్ట్ చైర్మన్ సునీల్ శనగల ట్రస్టీలు నవీన్ శనగల, ఎల్లా పంతులు చంద్రశేఖర్, కలాం శెట్టి హరిబాబు, మానస శనగల లు కోరారు. అందించిన వారి గోత్ర నామాలతో పండితుల ఆధ్వర్యంలో ఉద్వాసన పూజ కార్యక్రమాలు శాస్రోక్తంగా నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఇందుకు 9014019752 నెంబర్ కు వాట్సప్ చేయాలనీ ఆయన సూచించారు పూర్తి వివరాలు హిందూ వాయిస్ ఇన్, యూ ట్యూబ్ ఛానల్ .లో చూడాలని వారు కోరారు తాము చేపట్టిన ఈ కార్యక్రమానికి భక్తుల నుంచి కూడా విశేష స్పందన లభిస్తోందని తెలిపారు.హిందూ సంప్రదాయాల ప్రకారం దేవతా విగ్రహాలకు ప్రత్యేక పవిత్రత ఉందని, అవి పాడైనప్పటికీ సాధారణ వస్తువుల మాదిరిగా పారవేయడం సరికాదని వారు పేర్కొంటున్నారు.ఈ నేపథ్యంలో పలు ప్రాంతాల్లో ప్రత్యేక సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి, భక్తులు తమ ఇళ్లలో ఉన్న పాత విగ్రహాలను స్వచ్ఛందంగా అప్పగించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.సేకరించిన విగ్రహాలను ఆగమశాస్త్ర నిబంధనల ప్రకారం నదులు, చెరువులు లేదా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పవిత్ర కుండాల్లో నిమజ్జనం చేయడం వంటి చర్యలు చేపడుతున్నారు. దాంతో ధార్మిక సంప్రదాయాలు పరిరక్షించబడటంతో పాటు పర్యావరణ పరిరక్షణకూ తోడ్పాటు అందుతుందని నిర్వాహకులు పేర్కొంటున్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీలు, ధార్మిక సంస్థలు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యమవుతున్నాయి. పాత విగ్రహాలను చెత్తకుప్పల్లో, రోడ్ల పక్కన లేదా నీటి వనరుల్లో నిర్లక్ష్యంగా పడేయకుండా సంబంధిత సేకరణ కేంద్రాలకు అప్పగించాలని భక్తులకు పిలుపునిస్తున్నారు.పవిత్రతను కాపాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. భక్తుల్లో అవగాహన పెరగడం వల్ల పాత దేవతా విగ్రహాల పరిరక్షణకు ఇది ఒక ప్రజా ఉద్యమంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి.పాత విగ్రహాలను చెత్తలో వేయొద్దని శాస్త్రోక్తంగా అప్పగించండని ఆలయ కమిటీలు, ధార్మిక సంస్థలు విజ్ఞప్తి.చేస్తున్నాయి.

# ఉప్పల్‌లో రూ. 76.46 కోట్లతో అభివృద్ధి పనులకు మంత్రి శ్రీధర్ బాబు శంకుస్థాపన

**ఉప్పల్, జూలై 30 (వెలుతురు):**

ఉప్పల్ నియోజకవర్గాన్ని మోడల్ క్లస్టర్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజా పాలనలో అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. గురువారం ఉప్పల్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో రూ.76.46 కోట్ల నిధులతో చేపట్టనున్న పలు మౌలిక వసతుల కల్పనా పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. రామంతాపూర్ (భజరంగ్ వ్యాయామశాల) రూ.90 లక్షల అంచనా వ్యయంతో భవన విస్తరణ, బోర్‌వెల్, ఆధునిక జిమ్ పరికరాల ఏర్పాటు. రామంతాపూర్ భాగాయత్– ఉప్పల్ రూ.56.35 కోట్లతో మూసీ కాలువల అనుసంధానం,



ప్రధాన వర్షపు నీటి నివారణ డ్రైన్లు (SWD), ఫుట్‌పాత్‌లు, మల్టీ స్పోర్ట్స్ అరేనా, వి.టి. కమాన్ బస్ స్టాప్ ఆధునీకరణ. బొడ్రాయి – చిలకనగర్ – బీరప్పగడ్డ రూ.3.23 కోట్లతో రిటైనింగ్ వాల్, స్టీల్ గిర్డర్ వంతెన, శ్మశానవాటికల ఆధునీకరణ, సీసీ రోడ్ల మరమ్మతులు. చర్లపల్లి, కాప్రా & వాంపుగూడ రూ.15.97 కోట్లతో కల్వర్టుల విస్తరణ, ఆర్‌సీసీ పైప్‌లైన్లు, తృతీయ వర్షపు నీటి కాలువల నిర్మాణం. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పనులన్నీ పారదర్శకంగా, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిగమిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి, జోనల్ కమిషనర్ రాధికా గుప్తా, ఉప్పల్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డా. పుట్ల శ్రీనివాస్

**హైదరాబాద్ వెలుతురు జూలై 30:**

జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డా. పుట్ల శ్రీనివాస్ గారు ఈ రోజు గాంధీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా DM&HO గారు హాజరు రిజిస్టర్, రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఔషధాల లభ్యత, ల్యాబొరేటరీ, ఫార్మసీ స్టోర్ ను, వివిధ రికార్డులు మరియు పరిశుభ్రతను పరిశీలించారు. అలాగే అర్హులైన ప్రతి గర్భిణీ, శిశువుకు టీకాలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.జూలై నెల డెంగ్యూ అవగాహన మాసం సందర్భంగా మలేరియా, డెంగ్యూ, చికున్‌గునియా నివారణకు ఇంటింటి ఆరోగ్య సర్వేలను సమర్థవంతంగా నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించాలని, NCD ప్రోగ్రామ్ ను 100% నిర్వహించాలని ఆదేశించారు.అలాగే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించి ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారి మరియు సిబ్బంది పాల్గొన్నారు.





# నిర్మాణ కార్మికుల సంక్షేమమే లక్ష్యం – సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్

- **సైబర్ నేరాలు, డ్రగ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి**

**సైబరాబాద్ వెలుతురు జూలై 30:**

సైబరాబాద్ పోలీస్, తెలంగాణ కార్మిక శాఖ సమన్వయంతో రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని నానక్‌రామ్‌గూడ శశి టవర్ వద్ద గురువారం "నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమం మరియు లేబర్ కార్డుల పంపిణీ" నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, నిర్మాణ కార్మికులు రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సంక్షేమం మరియు సామాజిక భద్రత కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి అర్హత కలిగిన కార్మికుడు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లేబర్ కార్డు ద్వారా ప్రమాద బీమా, ఆరోగ్య సేవలు, పిల్లల విద్యా సహాయం, ప్రసూతి ప్రయోజనాలు తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందవచ్చని తెలిపారు. కార్మికులు తమ హక్కులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ప్రభుత్వ శాఖలతో అనుసంధానమై సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని




కోరారు.అదేవిధంగా, పెరుగుతున్న సైబర్ నేరాల నేపథ్యంలో అపరిచితుల ఫోన్ కాల్స్, నకిలీ ఉద్యోగ ఆఫర్లు, బ్యాంక్ KYC పేరుతో వచ్చే సందేశాలు, అనుమానాస్పద లింకుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. OTPలు, బ్యాంక్ ఖాతా వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ వెల్లడించవద్దని హెచ్చరించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని, అత్యవసర పరిస్థితుల్లో డయల్–112కు సమాచారం అందించాలని సూచించారు.రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీట్‌బెల్ట్ వినియోగించాలని, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయరాదని



సూచించారు.యువతతో పాటు కార్మికులు కూడా "సే నో టు డ్రగ్స్" అనే సందేశాన్ని జీవితంలో ఆచరించాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని సీపీ కోరారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో సమాజం భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్, కూకట్‌పల్లి ఏడీసీపీ సుదర్శన్, శేర్లింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ అమిత్, కార్మిక శాఖ అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు, నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు. అనంతరం అర్హులైన నిర్మాణ కార్మికులకు సైబరాబాద్ సీపీ లేబర్ కార్డులను పంపిణీ చేశారు.

# పేదల గుడిసెల పరిశీలన ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులపై ఆరా

- పుల్లెంల గ్రామ పరిధిలో రోడ్డు వెడల్పు నిర్మాణం ప్రదేశం పరిశీలన
- నిర్మాణంలో ఉన్న అంగన్వాడి, ప్రాథమిక ఉప ఆరోగ్య కేంద్రం, కమ్యూనిటీ హాల్ ల పరిశీలన
- గ్రామాన్ని అనుసంధా నించే రహదారులు, అంతర్గత రోడ్లు డ్రైనేజీ అభివృద్ధి పై హామీ
- ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రజల సౌకర్యార్థం నిర్మించే భవనాలకు భూమిని కేటాయించాలని దేవదాయ కమిషనర్ కి ఫోను
- సమస్యలు తెలుసుకుంటూ పరిష్కారాల హామీలిస్తూ పల్లెల్లోని గల్లీల్లో మార్నింగ్ వాక్ లో కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

**చండూరు వెలుతురు జూలై 30:**







మునుగోడు నియోజకవర్గం చండూరు మండలం, పుల్లెంల గ్రామంలో మార్నింగ్ వాక్ చేస్తూ వీధులన్నీ తిరుగుతూ సమస్యలను పరిశీలించారు గౌరవ మునుగోడు శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి గారు...ఇడికుడ గ్రామం నుండి తెరటిపల్లి గ్రామం వరకు రోడ్డు వెడల్పు అభివృద్ధి పనులు జరుగుతున్న సందర్భంలో పుల్లెంల గ్రామం పరిధిలో జరగాల్సిన రోడ్డు వెడల్పు పనుల ప్రదేశాన్ని పరిశీలించారు.. రోడ్డు వెడల్పులో గ్రామ పరిధిలో ఎన్ని గృహాలు పాక్షికంగా పోతున్నాయి ఎన్ని గృహాలు పూర్తిగా పోతున్నాయి అనే విషయాలపై ఆరా తీశారు... అనంతరం నిర్మాణంలో ఉన్న అంగన్వాడి భవనాన్ని, ప్రాథమిక ఉప ఆరోగ్య కేంద్ర భవనాన్ని, గ్రామపంచాయతీ భవనాన్ని, కమ్యూనిటీ హాల్ను పరిశీలించారు... వాటి నిర్మాణం పూర్తి అవ్వడానికి కావలసిన అంచనాలు రూపొందించాలని వ్యక్తిగత సిబ్బందికి ఆదేశించారు... వివిధ గ్రామాలతో పుల్లెంల గ్రామాన్ని అనుసంధా నించే రహదారుల మంజూరు టెండర్ల విషయంపై చర్చించారు.

### నిరుపేదల గుడిసెల సందర్శన

గ్రామంలో గుడిసెలు ఉన్న నిరుపేదల ఇంటికి వెళ్లి వారి జీవనస్థితిని పరిశీలించి ఇందిరమ్మ గృహాల మంజూరు తదితర అంశాలపై స్థానిక నాయకులతో పాటు మండల అధికారులను అడిగి తెలుసుకున్నారు... aaనిజమైన నిరుపేదలై ఉండి కొన్ని సాంకేతిక సమస్యల వల్ల మంజూరు నిలిచిపోయిన వారిని గుర్తించి జాబితా రూపొందించాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు.. గ్రామంలో నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ గృహాన్ని ప్రారంభించారు...

ప్రజల సౌకర్యార్థం భూములు కేటాయించాలని దేవాదాయ కమిషనర్ కి ఫోన్

పుల్లెంల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను పరిశీలించిన గౌరవ ఎమ్మెల్యే ఇరుకుగా ఉన్న తరగతి గదులలో విద్యార్థుల బోధన కష్టంగా ఉంటుందని విశాలమైన ఆటస్థలం తో పాటు నూతన పాఠశాల భవన నిర్మాణానికి కావలసిన భూమిని చూడాలని స్థానిక నాయకులకు చెప్పడంతో గ్రామంలో 26 ఎకరాల దేవాదాయ శాఖ భూమి ఉందని స్థానికులు గౌరవ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు... వెంటనే దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు గారికి ఫోన్ చేసి మునుగోడు నియోజక వర్గంలో ప్రజలకు ఉపయోగపడే భవనాలు, పాఠశాలలు నిర్మించడానికి దేవాదాయ శాఖ భూమిని కేటాయించాలని కోరారు..

పుల్లెంల గ్రామంలో వీధులని తిరుగుతూ గ్రామానికి కావలసిన అభివృద్ధి పనులను తన దృష్టికి తీసుకురావాలని స్థానిక నాయకులను ఆదేశించారు...

ఈ మార్నింగ్ వాక్ కార్యక్రమంలో చండూరు మండల నాయకులతో పాటు వివిధ శాఖల మండలాధికారులు, గ్రామాధికారులు, స్థానిక నాయకులు ప్రజలు పాల్గొన్నారు....

# నేతన్నల సంక్షేమం, వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రాధాన్యం

- జిల్లా ఇంచార్జి మంత్రి, మార్కెటింగ్ వ్యవసాయ చేనేత జౌళి శాఖ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- రగుడు జంక్షన్ అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రులు
- ఐడీఓసీలో వస్త్ర పరిశ్రమ కార్మికులకు ఆర్డీ పాస్ బుక్ ల పంపిణీ

**రాజన్న సిరిసిల్ల, వెలుతురు జూలై 30:**





సిరిసిల్ల నేతన్నల సంక్షేమం, వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు వద్ద రూ.3 కోట్ల 22 లక్షలతో జంక్షన్ అభివృద్ధి సుందరీకరణ , మోడల్ బస్ షెల్టర్ల నిర్మాణ పనులను మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం ప్రారంభించారు. అనంతరం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రులు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యేలు త్రిఫ్ట్ ఫండ్ పథకానికి సంబంధించిన ఆర్డీ పాస్‌బుక్‌లు అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. జిల్లా ఇంచార్జి మంత్రి, మార్కెటింగ్, వ్యవసాయ, చేనేత జౌళి, సహకార శాఖ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ. సిరిసిల్ల అంటే చేనేతకు ప్రతీక అని, నేతన్నల కష్టానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. గత రెండేళ్లలోనే చేనేత రంగానికి రూ.1,360 కోట్లకు పైగా అందించామని తెలిపారు. నేతన్నలకు ఏడాది పొడవునా పని కల్పించడంతో పాటు భద్రత, భీమా, సంక్షేమ పథకాల అమలుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. చేనేత ఉత్పత్తులకు మార్కెట్ కల్పించేందుకు ప్రభుత్వం అధిక ధర చెల్లించాల్సి వచ్చినా నాణ్యమైన చీరలనే కొనుగోలు చేస్తోందని పేర్కొన్నారు. యార్న్ డిపో ఏర్పాటుతో చేనేత సహకార సంఘాలకు మరింత ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. నేతన్నల సమస్యలను ప్రజాప్రతినిధుల ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చుతోందన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు సిరిసిల్ల ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకారం అందిస్తుందని, నేతన్నల సంక్షేమం కోసం మరిన్ని చర్యలు చేపడతామని తెలిపారు.

### నాణ్యమైన చీరల ఉత్పత్తి..

సిరిసిల్లలో నాణ్యమైన ఇందిరా మహిళా శక్తి చీరలు తయారవుతున్నాయని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ప్రభాకర్ తెలిపారు. ప్రభుత్వం సిరిసిల్ల నేతన్నలకు పని కల్పిస్తూ నాణ్యమైన చీరలు మహిళలకు అందిస్తుందని తెలిపారు. సిరిసిల్ల నేతన్నలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నేతన్న.. గీతన్న వేరు కాదని, జిల్లా నేతగా నేతన్న ల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. సిరిసిల్ల మోడల్ చీర మహిళలకు అందుబాటు ధరలో ఒకటి తయారు చేసి.. జీ ఐ ట్యాగ్ వచ్చేలా కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వస్త్ర పరిశ్రమలో పేరుకుపోయిన బకాయిలను దశలవారీగా విడుదల చేసి నేతన్నల్లో విశ్వాసాన్ని పెంచిందన్నారు. 2024–25 సంవత్సరానికి 6.80 కోట్ల మీటర్ల చీరల ఉత్పత్తికి ఆర్డర్లు ఇవ్వడం ద్వారా వేలాది మంది నేతన్నలకు ఎనిమిది నెలలపాటు ఉపాధి కల్పించామని తెలిపారు.ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 3 కోట్ల మీటర్ల చీరల తయారీకి ఆర్డర్లు అందించామని, ఇప్పటికే దాదాపు కోటి మీటర్ల చీరల ఉత్పత్తి పూర్తైందని తెలిపారు. మరో మూడు కోట్లకు పైగా మీటర్ల చీరల ఉత్పత్తికి కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని, నేతన్నలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. 62 కోట్ల రూపాయల బిల్లులు చెల్లించామని వెల్లడించారు. నేతన్నల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక కీలక నిర్ణయాలు తీసుకుందని పేర్కొన్న ఆది శ్రీనివాస్, 25 హెచ్‌పీ పవర్‌లూమ్‌లకు రూ.2 విద్యుత్ సబ్సిడీ అమలులోకి తీసుకురావడం ద్వారా పరిశ్రమకు ఊతమిచ్చిందన్నారు. రూ.50 కోట్లతో వేములవాడ లో యార్న్ బ్యాంక్ ఏర్పాటు చేశామని తెలిపారు. కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు కోసం కూడా ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా నేతన్నల వృత్తి గౌరవాన్ని చాటిచెప్పేలా సిరిసిల్ల కలెక్టరేట్ సర్కిల్ వద్ద రూ.3 కోట్లతో వస్త్రం తయారీ దశల విధానాన్ని ప్రతిబింబించే ప్రత్యేక నిర్మాణాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. రగుడు బై పాస్ జంక్షన్ సుందరీకరణ పనులు నేతన్న వృత్తి గుర్తుకు వచ్చేలా తీర్చిదిద్దామని తెలిపారు. వారిపై గౌరవం, ప్రేమతో వీటిని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

### మహిళలు పండగలు, కార్యక్రమాలకు కట్టుకుంటున్నారు.. : జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. వేములవాడ కు వచ్చే భక్తులు, పర్యాటకులు సేదతీరేలా.. పట్టణ ప్రజలకు ఆహ్లాదం పంచేలా గుడి చెరువు బండ్ పార్క్ పనులను పూర్తి చేసి.. ప్రారంభించామని తెలిపారు. రగుడు బై పాస్ జంక్షన్ సుందరీకరణ పనులు, రోడ్డు విస్తరణ, రోడ్డు భద్రత చర్యలు తీసుకున్నామని, వస్త్రం తయారీలో వివిధ దశలను తెలుసుకునేలా విగ్రహాలను ఏర్పాటు అయ్యాయని తెలిపారు. గత ఏడాది జిల్లాలో ఇందిరా మహిళా శక్తి చీరలు చాలా నాణ్యతతో తయారు చేశారని గుర్తు చేశారు. వాటిని మహిళలు పండగలు, ఇతర కార్యక్రమాలకు కట్టుకుంటున్నారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మరో సారి కూడా ఆర్డర్ ఇచ్చిందని తెలిపారు<.కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ఎస్పీ మహేష్ బి గీతే, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మితో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- వేములవాడ బస్‌స్టేషన్ ఆధునీకరణ పనులకు మంత్రులు, ప్రభుత్వ విప్ శంకుస్థాపన
- కోరుట్ల మీదుగా బాసరకు ఎక్స్‌ప్రెస్ బస్సు ప్రారంభం

**వేములవాడ, వెలుతురు జూలై 30:**





మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పక్కాగా అమలు చేస్తున్నామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. వేములవాడ తిప్పాపూర్ బస్‌స్టేషన్ ఆధునీకరణ పనులకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం వేములవాడ–కోరుట్ల మీదుగా బాసరకు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సును ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేసి ఇచ్చిన హామీని నిలబెట్టుకుందన్నారు. మహిళల ఉచిత ప్రయాణంతో ఆర్టీసీలో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపారు. కొత్త బస్సులు కొనుగోలు చేయడంతో పాటు సిబ్బంది నియామకాలు కూడా చేపడుతున్నామని వెల్లడించారు. 1984లో నిర్మించిన వేములవాడ బస్‌స్టేషన్‌ను రూ.1.62 కోట్ల వ్యయంతో ఆధునీకరిస్తున్నామని చెప్పారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడకు రోజూ సుమారు 250 బస్సులు, 560 ట్రిప్పులు నడుస్తున్నాయని పేర్కొన్నారు. కోరుట్ల మీదుగా బాసరకు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సును ప్రారంభించామని, గతంలో ముంబైకి కూడా బస్సు సౌకర్యం కల్పించామని గుర్తు చేశారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల బాట పట్టించామని, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామని తెలిపారు.రోజుకు 50 వేల మంది వేములవాడ బస్ స్టేషన్ నుంచి ప్రయాణం చేస్తున్నారని వివరించారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఇప్పటివరకు 334.11 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేసి రూ. 11,668 కోట్లు ఆదా చేసుకున్నారని వెల్లడించారు. 2600 కొత్త బస్సులు కొనుగోలు చేశామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 100 కోట్లతో బస్ స్టేషన్లు అభివృద్ధి చేస్తున్నామని, ఆర్టీసీ ఉద్యోగుల దాదాపు రూ.1000 కోట్ల పీఎఫ్ బకాయిలు, 600 కోట్ల సీసీఎస్ బకాయిలు చెల్లించామని వెల్లడించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు బస్‌స్టేషన్లను ఆధునీకరిస్తున్నామని అన్నారు. దేశంలోనే అతిపెద్ద ప్రజారవాణా సంస్థగా తెలంగాణ ఆర్టీసీ మహిళలకు ఉచిత ప్రయాణాన్ని విజయవంతంగా అందిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరుతున్నాయని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా వరుణ పూజలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఇటీవల కురుస్తున్న వర్షాలను సద్వినియోగం చేసుకుని రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు.మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీ మేరకు వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అదే అభివృద్ధి దిశగా వేములవాడ తిప్పాపూర్ బస్‌స్టేషన్ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేయడం సంతోషకరమన్నారు.ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ... వేములవాడ తిప్పాపూర్ బస్‌స్టేషన్ ఆధునీకరణకు రూ.1.62 కోట్లు మంజూరు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. రాజరాజేశ్వర స్వామి ఆలయానికి వచ్చే లక్షలాది మంది భక్తులు, ప్రయాణికులకు ఈ ఆధునీకరించిన బస్‌స్టేషన్ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. గతంలో పలుమార్లు కూలిపోయిన బస్‌స్టేషన్ సమీప వంతెనను భూ నిర్వాసితులకు న్యాయం చేసి పూర్తి చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ.249.40 కోట్లతో పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, సంజయ్ కుమార్, ఎస్పీ మహేష్ బి గితే, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాబిన్ హుడ్, పోరాటయోధుడు పండుగ సాయన్న పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాలి – మంత్రి వాకిటి శ్రీహరి

**హైదరాబాద్, వెలుతురు జూలై 30:**



తెలంగాణ చరిత్రలో అణగారిన వర్గాల ఆత్మ గౌరవానికి ప్రతీకగా నిలిచిన తెలంగాణ రాబిన్ హుడ్, పోరాటయోధుడు పండుగ సాయన్న పోరాట స్ఫూర్తిని భావితరాలకు చేరవేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు & క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు.పండుగ సాయన్న జయంతి, వర్ధంతి తేదీల ఖరారుపై మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో సమాలోచనలు నిర్వహించారు.

ఈ సమావేశంలో పండుగ సాయన్నపై పుస్తకాలు రచించిన బెక్క జనార్దన్, ఇందిరా దేవి, పండుగ సాయన్న కుటుంబ సభ్యులు పండుగ నర్సిములు, చెన్నయ్య, రాష్ట్ర ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, పండుగ సాయన్న సేవా సమితి అధ్యక్షుడు కృష్ణ ముదిరాజ్, ముదిరాజ్ సంక్షేమ సంఘం నాయకులు ప్రభాకర్, బీసీ వెల్ఫేర్ రిటైర్డ్ ఉద్యోగి శ్రీనివాస్ తదితరులతో సుదీర్ఘంగా చర్చించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పండుగ సాయన్న పోరాటం, త్యాగం, సామాజిక న్యాయం కోసం చేసిన కృషి నేటి యువతకు తెలియాలంటే చారిత్రక ఆధారాలు, పురావస్తు శాఖ ధ్రువీకరణ వంటి ప్రామాణిక సాక్ష్యాలు అవసరమన్నారు. అందుకోసం పురావస్తు శాఖ వద్ద అందుబాటులో ఉన్న వివరాల ఆధారంగా పండుగ సాయన్న జయంతి, వర్ధంతి తేదీలను నిర్ధారించే ప్రక్రియ చేపట్టాలని అధికారులకు సూచించారు.రాష్ట్ర ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ నేతృత్వంలో సమగ్ర నివేదిక రూపొందించి ప్రభుత్వానికి సమర్పించాలని మంత్రి ఆదేశించారు. ఆ నివేదిక అందిన అనంతరం ప్రభుత్వం అధికారికంగా పరిశీలించి పండుగ సాయన్న జయంతి, వర్ధంతులపై అధికారిక ప్రకటన చేస్తుందని స్పష్టం చేశారు.

పండుగ సాయన్న సేవలను ప్రభుత్వ స్థాయిలో గుర్తించి, ఆయన జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించేలా ప్రభుత్వం తరఫున అన్ని విధాలా కృషి చేస్తామని మంత్రి వాకిటి శ్రీహరి ప్రకటించారు. పండుగ సాయన్న చరిత్ర, పోరాట వారసత్వాన్ని పరిరక్షించడం ద్వారా భావితరాలకు స్ఫూర్తినిచ్చే కార్యక్రమాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని మంత్రి తెలిపారు.

## వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి... ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలి

- **గుంతలు పూడ్చడం, ఫాగింగ్, వాటర్ లాగింగ్ నివారణపై అధికారులకు సూచనలు...**
- **స్ట్రీట్‌లైట్లపై ఫిర్యాదులు పట్టించుకోవడం లేదని అధికారుల తీరుపై అసంతృప్తి...**

**జహీరాబాద్ వెలుతురు, జూలై 30:**



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని 36వ వార్డు కౌన్సిలర్ అప్పం శ్రావణ్ కుమార్ కోరారు. గురువారం నిర్వహించిన అత్యవసర మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతూ ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.వర్షాల కారణంగా రోడ్లపై ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చి వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి వాటర్ లాగింగ్ నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు తగలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, వర్షాకాలంలో ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలపై విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు.అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు సంప్రదించేందుకు మున్సిపాలిటీ ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలని, హైదరాబాద్‌లోని డిజాస్టర్ రెస్పాన్స్ టీంల మాదిరిగా జహీరాబాద్‌లో కూడా ప్రత్యేక అత్యవసర స్పందన బృందాలను ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్‌ను కోరారు.ఈ సందర్భంగా స్ట్రీట్‌లైట్ల సమస్యపై కూడా అప్పం శ్రావణ్ కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలు చాలా కాలంగా ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ అధికారులు స్పందించడం లేదని, ప్రజాప్రతినిధుల ఫోన్ కాల్స్‌కు కూడా స్పందించడం లేదని ఆరోపించారు. అధికార పక్షం, ప్రతిపక్షం అనే తేడా లేకుండా అన్ని వార్డులకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని, స్ట్రీట్‌లైట్లతో పాటు ఇతర ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## నెల రోజుల నుండి నల్లానీరు రాక డాబాంగ్లా కాలనీ వాసుల ధర్నా

- **తక్షణమే స్పందించిన మిషన్ భగీరథ ఏ. ఇ మరియు మున్సిపల్ కమీషనర్, మంచి నీటి సరఫరా పునరుద్ధరణ.**

**మోత్కూరు, జూలై 30, వెలుతురు న్యూస్ :**



మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని డాబాంగ్లా కాలనీ వాసులు నెల రోజులుగా తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తూ గురువారం కాలి బిందెలతో ఎంపీడీవో కార్యాలయం ముందు రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి కాలనీలో సాధారణ నీటి సరఫరాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.కాలనీవాసుల కథనం ప్రకారం, చెరువుకట్ట మరమ్మతు పనుల కారణంగా నీటి సరఫరాను నిలిపివేశారని, అయితే ఆ పనులు పూర్తయి 15 రోజులు గడిచిన ఇప్పటికీ నీటిని అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. చెరువుకట్ట పనుల సమయంలో నీటి సరఫరా పైపులు దెబ్బతిన్నాయని, వాటి మరమ్మతుల విషయంలో మిషన్ భగీరథ, మున్సిపల్ శాఖ అధికారులు ఒకరిపై ఒకరు బాధ్యత నెట్టుకుంటూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. మున్సిపల్ అధికారులు రోజుకు రెండు నుంచి మూడు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ అది కాలనీవాసుల అవసరాలకు ఏమాత్రం సరిపోవడం లేదని తెలిపారు. నీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో నిరసనకు దిగాల్సి వచ్చిందని పేర్కొన్నారు.ప్రజల సమస్యను వెంటనే పరిష్కరించి, దెబ్బతిన్న పైపులను మరమ్మతు చేసి కాలనీలో సాధారణ నీటి సరఫరాను పునరుద్ధరించాలని కాలనీ ప్రజలు అధికారులను కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో తోట్ల రుక్కమ్మ, ఎండి కాజమ్మ, పురుగుల మల్లమ్మ,పురుగుల లింగమ్మ, జటంగి రేణుక, ఎండి సుభానా,పురుగుల పవిత్ర, లలిత,పురుగుల సారమ్మ తదితరులు పాల్గొన్నారు. వెంటనే నీటి సరఫరాను పునరుద్ధరించిన అధికారులు కాలనీ వాసుల ఆందోళన నేపథ్యంలో తక్షణమే స్పందించిన మిషన్ భగీరథ ఏ. ఇ మరియు మున్సిపల్ కమీషనర్ లు 100 మీటర్ ల పైప్ ను తెప్పించి ఇరువైపుల అతికించి మంచి నీటి సరఫరాను పునరుద్ధరించారు.

## ప్రభుత్వ సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలి

- **కౌన్సిలర్లు గనగాని శైలజ, పన్నాల శ్రీవిద్య**

**మోత్కూర్, జులై 30,వెలుతురు న్యూస్ :**

ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మోత్కూరు మున్సిపాలిటీ కౌన్సిలర్స్ గనగాని శైలజ,పన్నాల శ్రీవిద్య అన్నారు ఈరోజు మోత్కూరు పట్టణంలోని సుందరయ్య కాలనీలో గల ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహంలో వసతి గృహ సంక్షేమ అధికారిని శ్రీమతి వేముల స్వప్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థినీలకు బెడ్ షీట్స్ కార్పెట్లు, ప్లేట్లు, గ్లాసులు తదితర వస్తువుల పంపిణీ కార్యక్రమంలో అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆధ్వర్యంలో ఎన్నో విద్యాసంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తుందని ప్రభుత్వం వచ్చిన తర్వాత వెంటనే హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు భారీగా పెంచారని నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ విద్యా సంస్థను నెలకొల్పుతున్నారని వసతిగృహ విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని కష్టపడి చదివి తల్లిదండ్రులు ఉపాధ్యాయులు గర్వపడేలా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కామణి అరుణ, విద్యార్థినిలు చైత్ర, గుడిపాటి సిరి సంపద, కొనతం భవాని, సరబోజు రితిక, కమ్మగాని మధుప్రియ, కాటన్ మను దీక్షిత తదితరులు పాల్గొన్నారు.




## కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఖాళీ సీట్లు దరఖాస్తులకు ఆహ్వానం

**గుండాల జులై 30 (వెలుతురు):**



గుండాల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు జరుగుచున్నవని స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గుండాల కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో నాణ్యమైన విద్య బాలికలకు భరోసా విశాలమైన తరగతి గదులు ఆహ్లాదకరమైన వాతావరణం పరిశుభ్రమైన మరుగుదొడ్లు మెరుగైన డార్మిటరీ గదులు కంప్యూటర్ ల్యాబ్స్ అంకితభావం కలిగిన ఉపాధ్యాయుల బోధన విద్యార్థినీలకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం పరిశుభ్రమైన త్రాగునీరు శానిటరీ నాప్‌కిన్ వ్లాగింగ్ వెండింగ్ మెషిన్లు హెల్త్ కేర్ రికార్డ్స్ మెరుగైన మౌలిక వసతులు, 24 గంటల భద్రత సీసీ కెమెరాల ఏర్పాటు పేద విద్యార్థినులకు కార్పొరేట్ వసతులు అద్భుతమైన సేవలు అందుబాటులో ఉన్నాయని అన్నారు అనంతరం 6వ తరగతిలో ఆరు సీట్లు 7వ తరగతిలో 8 సీట్లు ఇంటర్ 1st ఇయర్ అగ్రికల్చర్ క్రాప్ ప్రొడక్షన్ విభాగం లో 18 సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆగస్టు 5వ తేదీ లోపు మండల పరిధిలోని అర్హత గల విద్యార్థినిలు సంబంధిత పాఠశాల ప్రత్యేక అధికారులను (ఎస్ఓ ను ) నేరుగా సంప్రదించి ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి

## రామన్నపేట మండల స్థాయి సమీక్ష సమావేశం

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూలై 30:**




మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించబడింది. సమావేశంలో ప్రస్తుత కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జలసిరి కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేయడం మరియు అరుతడి (ప్రత్యామ్నాయ) పంటల సాగును ప్రోత్సహించడంపై అధికారులు చర్చించి పలు సూచనలు చేశారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శోభారాణి (జడ్పి సీఈఓ) మాట్లాడుతూ, కరువు పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ప్రతి గ్రామంలో జలసిరి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి రైతు పొలంలో ఫామ్ పాండ్ (పత్తి కుంట), ప్రతి గ్రామానికి ఊట కుంట నిర్మాణం చేపట్టడంతో పాటు, రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా అవగాహన కల్పించాలని సర్పంచులు మరియు సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాఘవరెడ్డి , ఎంపీడీఓ రాములు , తహసీల్దార్ లాల్ బహదూర్ శాస్త్రి , ఎంపీఓ రఫీ , ఏపీఓ వెంకన్న , ఏఐఏ ఏజాజ్ అలీ ఖాన్ , ఏపీఎం జానీ , అలాగే మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సంఘం అధ్యక్షురాలు సి.సిలు,మరియు ఇతర సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## మండల పిఆర్టియు ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

- **అధ్యక్షుడిగా ఉప్పు నాగయ్య, ప్రధాన కార్యదర్శిగా సామ ఇంద్రారెడ్డి**


**నూతనకల్ జూలై30( వెలుతురు )**





పిఆర్ టియు ఉపాధ్యాయ సంఘం 2026 – 2028 గాను 2సంవత్సరాలు నూతనకల్ మండల కార్యవర్గాన్ని గురువారం నూతనకల్ మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. పిఆర్టియు ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడుగా ఉప్పు నాగయ్య,ప్రధాన కార్యదర్శిగా సామ ఇంద్రారెడ్డి ని మండలంలోని పిఆర్ టియు ఉపాధ్యాయ సంఘం సభ్యులు ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా పిఆర్టియు అధ్యక్షుడు తంగెళ్ల జితేందర్ రెడ్డి,తీగల నరేష్ హాజరై వారిని అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలు, ఉపాధ్యాయుల సమస్యలు విద్యార్థిని విద్యార్థుల సమస్యలు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పిల్లలకు ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని పిఆర్ టియు జిల్లా నాయకులు, సభ్యులు వారిని కోరారు వారు కూడా సంఘం బలోపేతం కోసం అహర్నిశలు కృషి చేస్తామని ఉప్పు నాగయ్య, సామ ఇంద్రారెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు వీరబోయిన వెంకటేశ్వర్లు ఉట్కూరి కల్పన రాపర్తి వీరేష్ కందుకూరి శివశంకర్ చింతరెడ్డి రామలింగారెడ్డి చెవుగాని వెంకటయ్య మహేశ్వరం వెంకటయ్య మేడిపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కంగనాతో విభేదాలు లేవు మాట్లాడుకుందాం: సౌరవ్ దాస్



- **తనపై కంగనా చేసిన వ్యాఖ్యలకు సీజేపీ అధికార ప్రతినిధి స్పందన**
- **"నిరుద్యోగి, పనికిరాని వాడు" అన్న వ్యాఖ్యలను తప్పుబట్టిన సౌరవ్**
- **హృతిక్ రోషన్ ప్రస్తావనతో వ్యంగ్య వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ, వెలుతురు, జూలై 30:**

భాజపా ఎంపీ, నటి కంగనా రనౌత్ తనపై చేసిన విమర్శలకు కాక్రోజ్ జనతా పార్టీ (సీజేపీ) అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ స్పందించారు. తనను "పనికిరాని వాడు", "నిరుద్యోగి" అంటూ కంగనా చేసిన వ్యాఖ్యలు సరైనవి కావని అన్నారు. గూగుల్‌లో సెర్చ్ చేస్తే తన గురించి తప్పుడు సమాచారం కనిపిస్తోందని, వాటిని ఆధారంగా చేసుకుని విమర్శలు చేయడం సరికాదని వ్యాఖ్యానించారు.

ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన సౌరవ్ దాస్.. కంగనా తన వ్యాఖ్యలపై ఎందుకు అంత తీవ్రంగా స్పందించారో తనకు అర్థం కావడం లేదన్నారు. ఇదే విషయంపై తన స్నేహితులు కూడా సరదాగా స్పందించారని చెప్పారు. "నా స్నేహితుల్లో ఒకరు 'నీకు చిన్నప్పటి హృతిక్ రోషన్‌లా కనిపిస్తున్నావేమో.. అందుకే కంగనా ఇలా స్పందించి ఉంటారు' అని మెసేజ్ చేశారు. అది చూసి నేను కూడా ఆశ్చర్యపోయాను" అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

అయితే, తనకు కంగనాపై ఎలాంటి వ్యక్తిగత ద్వేషం లేదని సౌరవ్ స్పష్టం చేశారు. "ఆమెతో నాకు వ్యక్తిగతంగా ఎలాంటి సమస్య లేదు. గొడవ పడాల్సిన అవసరం కూడా లేదు. ప్రజాస్వామ్యంలో అభిప్రాయ భేదాలు సహజం. అలాంటి విభేదాలు ఉంటే పరస్పరం మాట్లాడుకుని పరిష్కరించుకోవాలి" అని అన్నారు.

తాను తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో కూడా ఇదే విషయాన్ని ప్రస్తావించినట్లు తెలిపారు. "'కంగనా.. కాస్త ప్రశాంతంగా ఉండండి.. మాట్లాడుకుందాం' అని పోస్ట్ చేశాను. దేశంలో ప్రస్తుతం చర్చలు, సంభాషణలు తగ్గిపోతున్నాయి. ఒకరి అభిప్రాయాన్ని మరొకరు వినే సంస్కృతి బలహీనపడుతోంది. పరస్పర గౌరవంతో చర్చించుకునే వాతావరణం ఉండాలి" అని వ్యాఖ్యానించారు.

అలాగే, కంగనా తన వ్యాఖ్యలను మరోసారి పునఃసమీక్షించుకోవాలని సూచించారు. తనతో మాట్లాడాలనుకుంటే నేరుగా ఫోన్ చేయవచ్చని, ఆమెతో సంభాషించడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు.

ఈ వివాదానికి ముందు కంగనా రనౌత్.. "నా వయసులోనే నేను రెండు జాతీయ అవార్డులు సాధించాను. కానీ సౌరవ్ దాస్ ఇప్పటికీ పనికిరాని వ్యక్తిగా, నిరుద్యోగిగా ఉన్నారు" అంటూ విమర్శలు గుప్పించారు. ఈ వ్యాఖ్యలకే తాజాగా సౌరవ్ దాస్ తనదైన శైలిలో స్పందిస్తూ, వ్యక్తిగత దాడుల కంటే సంభాషణకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

## వేదాక్షి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న సురిగి నర్సింహా గౌడ్



**మునుగోడు వెలుతురు జూలై 30:**

కోతులారం గ్రామానికి చెందిన శ్రీ కందుల రవికుమార్ గౌడ్, శ్రీమతి తేజ దంపతుల ద్వితీయ కుమార్తె వేదాక్షి జన్మదిన వేడుకలు కోతులారం గ్రామంలో ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు మునుగోడు మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు సురిగి నరసింహా గౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి హాజరై చిన్నారి వేదాక్షికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, ఆశీర్వదించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు పాల్గొని చిన్నారికి శుభాకాంక్షలు తెలిపారు.

# అబ్బురపరిచేలా.. 'రామాయణ' ట్రైలర్




సినీ ప్రియులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తోన్న 'రామాయణ' ట్రైలర్ వచ్చేసింది. నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయిపల్లవి, రావణుడి పాత్రలో యశ్ నటించారు. మొదటి భాగం ఈ ఏడాది దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా విడుదల చేసిన ట్రైలర్‌లో విజువల్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. రూ.4000 కోట్ల బడ్జెట్‌తో ఈ చిత్రం రూపొందుతోంది.

ఇక ఈ సినిమాలో లక్ష్మణుడిగా రవి దూబే, భరతుడిగా ఆదినాథ్ కొఠారే, శతృఘ్నుడిగా నితీశ్ శర్మ నటిస్తున్నారు. రామానంద్ సాగర్ ఆవిష్కరించిన ధారావాహికలో రాముడిగా కనువిందు చేసిన అరుణ్ గోవిల్ ఇప్పుడు దశరథుడిగా నటిస్తున్నారు. ఇక కౌసల్యగా ఇందిరా కృష్ణన్, కైకేయిగా లారాదత్త, సుమిత్రగా సోనల్ ఝా కనిపించనున్నారు. సీబా చద్దా.. మంథర పాత్ర పోషిస్తుండగా, శిశిర్ శర్మ వశిష్ఠ మహర్షిగా, అజింక్య దేవ్ విశ్వామిత్ర మహర్షిగా చేస్తున్నారు.

## ప్యారడైజ్.. ప్రత్యేక పాట సన్నాహాలు

కథానాయకుడు నాని.. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కలయికలో రూపొందుతున్న చిత్రం 'ది ప్యారడైజ్'. 'దసరా' విజయం తర్వాత ఈ ఇద్దరి నుంచి వస్తున్న రెండో సినిమా ఇది. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ చిత్రం తాజాగా క్లైమాక్స్‌తో పాటు మొత్తం టాకీ పార్ట్‌ని పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు పాటల చిత్రీకరణకు సిద్ధమవుతున్నారు. దీనిలో భాగంగా ప్రత్యేక గీతం కోసం హైదరాబాద్‌లో ఓ భారీ సెట్‌ని సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ పాట కోసం కీర్తి సురేశ్ పేరు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఇక మరోవైపు ఆగస్టు తొలి వారంలో ఓ చిన్న టీజర్‌తో విడుదల తేదీపై స్పష్టత ఇచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఇది 1980ల నాటి సికింద్రాబాద్ నేపథ్యంలో సాగే పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతున్నట్లు తెలిసింది. నాని ఇందులో జడల్‌గా విభిన్నమైన పాత్రలో అలరించనున్నారు. మోహన్‌బాబు ప్రతినాయక పాత్ర పోషిస్తున్నారు. కయాదు లోహర్ కథానాయిక. ప్రస్తుతం తుది దశలో ఉన్న ఈ చిత్రాన్ని సెప్టెంబరు నెలాఖరున తెరపైకి తీసుకు రానున్నట్లు ప్రచారం వినిపిస్తోంది.



## ఓటీటీలో వరలక్ష్మి 'పోలీస్ కంప్లైంట్'..



వరలక్ష్మీ శరత్ కుమార్, నవీన్ చంద్ర, కృష్ణసాయి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'పోలీస్ కంప్లైంట్'. సంజీవ్ మేగోటి దర్శకుడు. జూన్ 12న విడుదలైన ఈ మూవీ ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా ఆగస్టు 31వ తేదీ నుంచి ఈ మూవీ స్ట్రీమింగ్ కానుంది. 'రియాక్షన్ ఆఫ్ కర్మ' అనే వైవిధ్యభరితమైన కాన్సెప్ట్‌తో ఈ చిత్రం రూపొందింది. తెలుగుతో పాటు, కన్నడ భాషలోనూ ఈ మూవీ అందుబాటులోకి రానుంది.

**ఇంతకీ కథేంటంటే..**

ఒక గర్భిణి మహిళ దారుణ హత్యకు గురవుతుంది. క్షుద్రపూజల కోణంలో జరిగినట్లు భావించే ఈ మర్డర్ మిస్టరీ కేసు, సరైన ఆధారాలు లేక మూలనపడిపోతుంది. సరిగ్గా అప్పుడే, అద్వైత అనే ఒక చిన్నారి ఎవరినైతే 'డాడీ' అని పిలుస్తుందో, వారంతా వరుసగా ప్రాణాలు కోల్పోతుంటారు. ఈ విచిత్రమైన కేసును ఛేదించడానికి రంగంలోకి దిగుతుంది పోలీస్ ఆఫీసర్ (వరలక్ష్మి శరత్‌కుమార్). దర్యాప్తు తీవ్రమయ్యే కొద్దీ ఆమె భర్త డాక్టర్ రామ్ (నవీన్ చంద్ర) అసలు స్వరూపం బయటపడుతుంది. అప్పుడు ఆ పోలీస్ ఆఫీసర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంది? ఈ వరుస మరణాల వెనుక ఉన్న అసలు రహస్యం ఏంటి? మూఢనమ్మకాలు, అవినీతి, కర్మ సిద్ధాంతం చుట్టూ తిరిగే ఈ కథ చివరకు ఎలాంటి ముగింపునకు చేరిందనేదే మిగతా సినిమా.

# హిందుత్వం మతం కాదు.. జీవన విధానం

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ప్రత్యేక కార్యక్రమం
- 'కర్మవీరులారా కదిలి రండి' గీతావిష్కరణ
- హిందుత్వంపై మాజీ ఉప రాష్ట్రపతి కీలక వ్యాఖ్యలు
- జీవన విధానమని, సాంస్కృతిక వారసత్వమని వెల్లడి
- ఐక్యత లోపిస్తే దేశ ప్రగతి వెనకబడుతుందని సూచన

**ఆత్కూరు (కృష్ణా జిల్లా), వెలుతురు, జూలై 30:**

హిందుత్వం అనేది కేవలం ఒక నిర్దిష్ట మతం కాదని, అదొక గొప్ప జీవన విధానమని భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు స్పష్టం చేశారు. కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరులోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో గురువారం నిర్వహించిన 'కర్మవీరులారా కదిలి రండి' అనే స్ఫూర్తిదాయక గీతావిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 'విద్యార్థులతో మాట-మంతి' కార్యక్రమంలో ఆయన పాల్గొని, నేటి యువత, సమాజ బాధ్యతలపై దిశానిర్దేశం చేస్తూ ప్రసంగించారు.దేశంలో ప్రతీ పౌరుడిలోనూ దేశభక్తి, సమాజ ఐక్యత భావనలు అత్యంత అవసరమని వెంకయ్యనాయుడు ఉద్ఘాటించారు. సమాజంలో ఐక్యత లోపించినప్పుడు దేశ ప్రగతి మందగిస్తుందని, భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. మన సాంస్కృతిక మూలాలను గుర్తుంచుకుంటూనే, సమాజ హితం కోసం ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మన మహోన్నతమైన జీవన విలువలను తర్వాతి తరాలకు అందించడమే హిందుత్వంలోని అసలైన సారాంశమని ఆయన అభిప్రాయపడ్డారు.యువత మంచి గీతాలను వినాలని, వాటిలోని భావాన్ని అర్థం చేసుకుని స్ఫూర్తి పొందాలని వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. జాతీయ గేయం 'వందేమాతరం' మన భారతదేశ మూలాలకు, ఐక్యతకు దివ్యమైన సమాధానమని తెలిపారు. దేశాభివృద్ధి కోసం ప్రతి పౌరుడూ కంకణం కట్టుకుని పని చేయాలని, మాతృభూమి రుణం తీర్చుకునేందుకు కృషి చేయాలని కోరారు.

ఒక శక్తివంతమైన, వికసిత భారత్ రూపకల్పనలో నేటి యువతీ యువకుల పాత్రే అత్యంత కీలకమైనదని ఆయన నొక్కి చెప్పారు.నేటి తరం యువత సమయాన్ని ఎక్కువగా మొబైల్ ఫోన్లు, యూట్యూబ్, సోషల్ మీడియా వేదికలపైనే గడుపుతుండటంపై ఆయన కాస్త ఆందోళన వ్యక్తం చేశారు. డిజిటల్ పరికరాలకు బానిసలు కాకుండా, విజ్ఞానాన్ని ప్రసాదించే పుస్తకాలను చదవ అలవాటు చేసుకోవాలని హితవు పలికారు. జీవితంలో సరైన దారిలో నడవడానికి ప్రతి ఒక్కరూ ఒక మంచి గురువును ఎంచుకోవాలని సూచించారు.

పుస్తకాలు, ఉత్తమ గురువులే మనిషిని జ్ఞానవంతుడిగా, సమాజానికి ఉపయోగపడే పౌరుడిగా తీర్చిదిద్దుతాయని వెంకయ్యనాయుడు వివరించారు.యువత ఇతరులపై ఆధారపడకుండా తమ భవిష్యత్తును తామే స్వయంగా నిర్దేశించుకునే స్థాయికి ఎదగాలని మాజీ ఉప రాష్ట్రపతి ఆకాంక్షించారు. స్వయంశక్తి, ఆత్మవిశ్వాసం, నిరంతర శ్రమ ద్వారా మాత్రమే జీవితంలో అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని చెప్పారు. సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా జ్ఞానాన్ని పెంపొందించుకుంటూ, నైతిక విలువలతో కూడిన ప్రగతి సాధించాలని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# రాజ్యసభ ముందుకు యాంటీ పేపర్ లీక్ బిల్లు

- ప్రశ్నపత్రాల లీకేజీకి కలిన అడ్డుకట్టే లక్ష్యమన్న కేంద్రం
- పబ్లిక్ పరీక్షల సవరణ బిల్లు-2026'ను ప్రవేశపెట్టిన జితేంద్ర సింగ్



**న్యూఢిల్లీ, వెలుతురు, జూలై 30:**

ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పబ్లిక్ పరీక్షల (అనుచిత పద్ధతుల నివారణ) సవరణ బిల్లు–2026' గురువారం రాజ్యసభలో ప్రవేశపెట్టబడింది. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ బిల్లును సభలో ప్రవేశపెట్టగా, దీనిపై ఏడు గంటలపాటు చర్చ నిర్వహించాలని సభ నిర్ణయించింది. పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడంతో పాటు ప్రశ్నపత్రాల లీకేజీలను కట్టడి చేయడమే బిల్లు ప్రధాన ఉద్దేశంగా కేంద్రం వెల్లడించింది.బిల్లును ప్రవేశపెట్టిన అనంతరం జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.. ప్రశ్నపత్రాల లీకేజీలను కేంద్ర ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణిస్తోందని, ఇటువంటి ఘటనలను ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. కొందరి అక్రమ చర్యల వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడకుండా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులు, యువత ప్రయోజనాల పరిరక్షణ పట్ల కేంద్ర ప్రభుత్వ నిబద్ధతకు ఈ బిల్లు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఈ అంశంలో ఎలాంటి ఆలస్యం చేయకుండా బిల్లును తీసుకొచ్చారని చెప్పారు.

అయితే, బిల్లుపై చర్చ సందర్భంగా ప్రతిపక్షం కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసింది. రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ.. నీట్ ప్రశ్నపత్రాల లీక్ కారణంగా పలువురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. పేపర్ లీకేజీలను ముందుగానే అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

2024లోనే ఈ బిల్లును ఎందుకు తీసుకురాలేదని ఖర్గే ప్రశ్నించారు. ఢిల్లీలో విద్యార్థుల నిరసనల సందర్భంగా పోలీసులు వ్యవహరించిన తీరుపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎందుకు స్పందించలేదని నిలదీశారు. ఆ ఘటనకు ఆయన బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. దీంతో బిల్లుపై రాజ్యసభలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాడివేడిగా చర్చ జరిగింది.

# నారాయణపేట చేనేత చీరల బ్రాండ్‌ను మరింత బలోపేతం చేయాలి: జిల్లా కలెక్టర్ ప్రియాంక

**నారాయణపేట, వెలుతురు, జూలై 30:**

ప్రసిద్ధి చెందిన నారాయణపేట కాటన్, పట్టు చీరలను స్థానిక, జాతీయ మరియు అంతర్జాతీయ మార్కెట్లలో విస్తృతంగా ప్రోత్సహించి విక్రయించేలా పక్కా కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా మహిళా సమాఖ్య ఇప్పటికే పెట్రోల్ ఫిల్లింగ్ స్టేషన్‌ను విజయవంతంగా నిర్వహిస్తున్న అనుభవాన్ని ఆదర్శంగా తీసుకుని, నారాయణపేట చేనేత చీరల బ్రాండింగ్, ప్రచారం మరియు మార్కెటింగ్ కార్యక్రమాలను ప్రారంభించాలని సూచించారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో డీఆర్డీఏ, చేనేత జౌళి శాఖ అధికారులు, జిల్లా మహిళా సమాఖ్య ప్రతినిధులతో ఆమె ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నారాయణపేట చీరల మార్కెటింగ్‌కు శ్రీకారం చుట్టడం ద్వారా ఒకవైపు నేత కార్మికులకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు, మరోవైపు స్వయం సహాయక సంఘాల మహిళలకు స్థిరమైన ఆదాయం చేకూరుతుందని తెలిపారు. నారాయణపేట చీరలకు దేశవ్యాప్తంగా గుర్తింపు ఉన్నప్పటికీ, కాలానుగుణంగా నూతన డిజైన్లు లేకపోవడం, సరైన బ్రాండింగ్, మార్కెటింగ్ వ్యవస్థలు కరువవ్వడం వల్ల విక్రయాలు తగ్గి నేత కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. ఈ పరిస్థితిని మార్చేందుకు మహిళా సమాఖ్య సభ్యులకు ఆధునిక డిజైన్లు, ప్రోడక్ట్ డెవలప్‌మెంట్, డిజిటల్ మార్కెటింగ్ వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు.చేనేత రంగానికి కొత్త ఊపునిచ్చేందుకు జిల్లా సమాఖ్యకు రూ. 5 లక్షల రుణం మంజూరు చేయాలని, ఆ నిధులతో ప్రాథమికంగా చీరలను కొనుగోలు చేసి ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ విక్రయాలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. వినియోగదారుల ఆదరణను బట్టి కొత్త మోడళ్లను తయారు చేయిస్తూ, పెట్రోల్ బంక్ తరహాలోనే ఈ కాటన్ చీరల వ్యాపారాన్ని కూడా దినదినాభివృద్ధి చేసి జిల్లా మహిళా సమాఖ్య మరో మైలురాయిని చేరుకోవాలని ఆకాంక్షించారు.

# అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదారి పట్టించడం బీజేపీ అనుబంధ సోషల్ మీడియా వర్గాల దివాలాకోరు రాజకీయాలకు నిదర్శనం

హైదరాబాద్ వెలుతురు జూలై 30:

భారతీయ జనతా పార్టీకి అనుబంధంగా ఉన్న కొన్ని సోషల్ మీడియా వేదికలు, వాట్సాప్ గ్రూపులు మరియు వారి మద్దతుదారులు, ఎటువంటి అధికారిక ఆధారాలు లేకుండా "అమెరికా, చైనా కలిసి భారత దేశంలో అస్థిరత్వం సృష్టించేందుకు కుట్ర చేస్తున్నాయి", "ట్రంప్, షీ జిన్‌పింగ్ భారత ప్రభుత్వాన్ని కూల్చేందుకు ప్రయత్నిస్తున్నారు" వంటి అసత్య కథనాలను ప్రచారం చేస్తూ ప్రజలను భయాందోళనలకు గురిచేయడం అత్యంత బాధ్యతారాహిత్యమైన చర్య.

ఇలాంటి సందేశాలను "వెయ్యి మందికి ఫార్వర్డ్ చేయండి" అంటూ విస్తృతంగా వ్యాప్తి చేయడం ద్వారా ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం జరుగుతోంది. ఇప్పటి వరకు భారత ప్రభుత్వం గానీ, కేంద్ర హోంమంత్రిత్వ శాఖ గానీ, దేశ భద్రతా సంస్థలు గానీ, ఏ అధికారిక సంస్థ కూడా ఇటువంటి ప్రచారాలను ధృవీకరించలేదు. అయినప్పటికీ, వాటిని నిజాలుగా ప్రచారం చేయడం దురదృష్టకరం.

ఒకవేళ నిజంగానే విదేశీ శక్తులు భారతదేశాన్ని అస్థిరపరిచే స్థాయిలో కుట్రలు చేస్తున్నట్లయితే, అది దేశ భద్రతకు సంబంధించిన అత్యంత తీవ్రమైన విషయం. అలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రజలకు అధికారికంగా వివరాలు వెల్లడించి, నిందితులపై చర్యలు తీసుకోవాలి. అలా కాకుండా సోషల్ మీడియా ఫార్వర్డ్‌ల ద్వారానే దేశ భద్రత గురించి ప్రచారం జరగడం, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాన్నే ప్రశ్నించే పరిస్థితిని తీసుకొస్తోంది.

ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా ప్రజలను కలవరపెడుతున్న అనేక అంశాలు చోటుచేసుకున్నాయి. అయోధ్యలోని రామాలయానికి సంబంధించిన దొంగతనం ఆరోపణలపై దేశవ్యాప్తంగా ప్రశ్నలు వ్యక్తమవుతున్నప్పటికీ, ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేసే విధంగా సమగ్ర వివరాలు వెల్లడించడంలో ప్రభుత్వం విఫలమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అలాగే, విద్యార్థుల ఆందోళనల సందర్భంగా జరిగిన పోలీసు చర్యలు, నియామక పరీక్షలకు సంబంధించిన వివాదాలు, యువత ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజలు సమాధానాలు కోరుతున్నారు."ఆపరేషన్–37", విదేశీ కుట్రలు, "డీప్ స్టేట్" వంటి పేర్లతో ప్రచారం చేస్తున్న సందేశాలకు ఇప్పటి వరకు భారత ప్రభుత్వం, కేంద్ర హోంమంత్రిత్వ శాఖ, దేశ భద్రతా సంస్థలు లేదా మరే అధికారిక సంస్థ కూడా ఎలాంటి నిర్ధారణ ఇవ్వలేదు. ఆధారాలు లేని సమాచారాన్ని నిజమని ప్రచారం చేయడం ప్రజల్లో అనవసరమైన గందరగోళాన్ని సృష్టించడమే.

దేశం ఎదుర్కొంటున్న నిరుద్యోగం, ధరల పెరుగుదల, విద్యార్థుల సమస్యలు, ప్రశ్నలు లేవనెత్తుతున్న ప్రజా అంశాలు, అలాగే వివిధ సంఘటనలపై ప్రజల దృష్టిని మరల్చేందుకు ఇలాంటి ప్రచారాలను కొందరు ఉద్దేశపూర్వకంగా ఉపయోగిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాస్వామ్యంలో వాస్తవ సమస్యలపై సమాధానాలు చెప్పాల్సిన వారు, ఆధారాలు లేని ప్రచారాలతో ప్రజల దృష్టిని మళ్లించడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనం

ఈ ప్రజా సమస్యలకు సమాధానాలు చెప్పాల్సిన బాధ్యతను విస్మరించి, విదేశీ కుట్రల పేరుతో అసత్య కథనాలను సృష్టించి ప్రజల దృష్టిని మరల్చే ప్రయత్నం చేయడం ప్రజాస్వామ్యానికి ఏమాత్రం మంచిది కాదు. భారతీయ జనతా పార్టీ మరియు దాని అనుబంధ సోషల్ మీడియా వర్గాలు బాధ్యతాయుతంగా వ్యవహరించి, ఎటువంటి ఆధారాలు లేని ప్రచారాలను వెంటనే నిలిపివేయాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ తరపున డిమాండ్ చేస్తున్నాను.

అలాగే, దేశ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాను. సోషల్ మీడియాలో వచ్చే ప్రతి సందేశాన్ని నిజమని నమ్మకుండా, అధికారిక సమాచారం, విశ్వసనీయ ఆధారాలను పరిశీలించిన తరువాత మాత్రమే విశ్వసించండి. అసత్య ప్రచారాలకు బలికాకండి. వాస్తవాల ఆధారంగా ఆలోచించి ప్రజాస్వామ్యాన్ని, దేశ ఐక్యతను పరిరక్షించండి.



పి. ప్రసన్న కుమార్ శర్మ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ)

# పశ్చిమాసియాలో మళ్లీ రగిలిన యుద్ధ జ్వాలలు

- ఇరాన్ క్షిపణి దాడిని తిప్పికొట్టిన అమెరికా
- జోర్డాన్‌లోని అమెరికా సైనిక స్థావరంపై ఇరాన్ దాడి

వాషింగ్టన్, వెలుతురు, జూలై 30:

పశ్చిమాసియా ప్రాంతంలో మరోసారి యుద్ధ మేఘాలు అలుముకున్నాయి. జోర్డాన్‌లోని అమెరికా కీలక సైనిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని ఇరాన్ దళాలు బాలిస్టిక్ క్షిపణులతో మెరుపు దాడికి యత్నించడంతో అక్కడ మళ్లీ యుద్ధ జ్వాలలు తీవ్రస్థాయిలో రగిలాయి. ఇరాన్ వైపు నుంచి దూసుకొచ్చిన ఈ క్షిపణి దాడులను అమెరికా సైన్యం సమర్థవంతంగా తిప్పికొట్టింది. ఈ పరిణామంతో అగ్రరాజ్యం అమెరికా మరియు ఇరాన్ మధ్య మునుపెన్నడూ లేని విధంగా ఉద్రిక్తతలు పెరిగాయి.ఇరాన్ నుంచి అనేక బాలిస్టిక్ క్షిపణులు జోర్డాన్ సరిహద్దులోని అమెరికా సైనిక కాంపౌండ్ వైపు వేగంగా దూసుకొచ్చాయని అమెరికా సెంట్రల్ కమాండ్ అధికారికంగా ధ్రువీకరించింది. దాడి ముప్పును ముందే పసిగట్టిన అమెరికా ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ తక్షణమే అప్రమత్తమయ్యాయి. అధునాతన రక్షణ వ్యవస్థల సాయంతో ఇరాన్ ప్రయోగించిన అన్ని క్షిపణులను గాల్లోనే విజయవంతంగా పేల్చివేసి ధ్వంసం చేశాయి. ఈ దాడి వల్ల ఎలాంటి ప్రాణ నష్టం గానీ, ఆస్తి నష్టం గానీ జరగలేదని జోర్డాన్ సైనిక వర్గాలు స్పష్టం చేశాయి.భద్రతా కారణాల దృష్ట్యా ఆ నిర్దిష్ట వైమానిక స్థావరం పేరును అధికారులు బయటకు వెల్లడించనప్పటికీ, ఇది సరిహద్దులోని అత్యంత కీలకమైన యూఎస్ మిలిటరీ కాంపౌండ్ అని సమాచారం.



గతంలో కుదిరిన శాంతి ఒప్పందం నేపథ్యంలో అమెరికా తన వైమానిక దాడులను నిలిపివేసిన తర్వాత, ఇరాన్ నేరుగా అమెరికా మిలిటరీ స్థావరంపై జరిపిన మొదటి బాలిస్టిక్ క్షిపణి దాడి ఇదే కావడంతో తీవ్ర ప్రాధాన్యత సంతరించుకుంది.ఈ హఠాత్ పరిణామంపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీవ్రంగా మండిపడ్డారు. ఒక ప్రముఖ వార్తా ఛానెల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు. అమెరికా సైనిక బలగాలు, ఆస్తులపై దాడులు చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. తమ రక్షణ వ్యవస్థ అత్యంత శక్తివంతమైనదని, గంటకు 8,000 మైళ్ల కంటే ఎక్కువ వేగంతో దూసుకొచ్చిన ఐదు ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులను పేట్రియాట్ వ్యవస్థ ద్వారా గాల్లోనే విజయవంతంగా కూల్చివేసామని ఆయన వివరించారు.అంతేకాకుండా, ఈజిప్టు పోర్టులో అమెరికాకు చెందిన సహజవాయువు ట్యాంకర్‌ను లక్ష్యంగా చేసుకుని జరిపిన దాడిపై కూడా ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్‌కు తగిన రీతిలో బుద్ధి చెబుతామని, రాబోయే రోజుల్లో వారిపై అత్యంత భీకర స్థాయిలో దాడులు నిర్వహిస్తామని హెచ్చరించారు. తాము జరిపే ప్రతిదాడి తట్టుకోవడం ఇరాన్‌కు సాధ్యం కాదని, అమెరికా రక్షణ వ్యవస్థల ముందు ప్రపంచంలో ఏ శక్తి నిలబడలేదని ట్రంప్ వ్యాఖ్యానించారు.ఇటు ఇరాన్ దాడులకు ప్రతిస్పందనగా అమెరికా మరియు సౌదీ అరేబియా దళాలు తక్షణమే రంగంలోకి దిగాయి. ఇరు దేశాల సైన్యాలు సంయుక్తంగా ఇరాక్ భూభాగంలో ఉన్న ఇరాన్ మద్దతుగల మిలీషియా గ్రూపులపై భారీ ఎత్తున వైమానిక దాడులను ప్రారంభించాయి. ముఖ్యంగా ఇరాక్‌లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న 'పాపులర్ మొబిలైజేషన్ ఫోర్సెస్' కు చెందిన కీలక ఆయుధ డిపోలు, లాజిస్టిక్స్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని మంగళవారం అర్ధరాత్రి బాంబుల వర్షం కురిపించాయి.ఈ విరుచుకుపడిన సంయుక్త వైమానిక దాడుల్లో కనీసం 20 మంది మిలీషియా సభ్యులు అక్కడికక్కడే మరణించినట్లు సమాచారం అందుతోంది. అనేక ఆయుధ స్థావరాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. గత 72 గంటల వ్యవధిలో అమెరికా స్థావరాలు మరియు సౌదీ అరేబియాలోని చమురు సంస్థలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ ఇస్లామిక్ విప్లవాత్మక గార్డ్ కార్ప్స్ 30కి పైగా డ్రోన్ దాడులకు తెగబడిందని సెంట్రల్ కమాండ్ తెలిపింది.సౌదీ చమురు సంపద, అమెరికా ఆస్తుల భద్రతను కాపాడేందుకే ఈ సంయుక్త ప్రతిదాడి చేపట్టినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ స్పష్టం చేసింది. ఇరు పక్షాల మధ్య దాడులు, ప్రతిదాడులు తీవ్రతరం కావడంతో పశ్చిమాసియాలో మునుపెన్నడూ లేని రీతిలో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. రాబోయే రోజుల్లో ఈ పోరు ఎటు దారితీస్తుందోనని ప్రపంచ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# మళ్లీ భగ్గుమన్న అమెరికా–ఇరాన్ యుద్ధం

- ఇరాన్‌పై అమెరికా భారీ దాడులు..
- ఈజిప్ట్‌కు విస్తరించిన ఘర్షణలు
- జోర్డాన్ దాడులకు ప్రతిగా అమెరికా ప్రతీకార చర్యలు
- బుషెహర్, ఖేష్మ్ ద్వీపాలపై క్షిపణి దాడుల ఆరోపణలు
- బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకున్నామని యూఎస్ ప్రకటన
- ఈజిప్ట్‌లో అమెరికా గ్యాస్ ట్యాంకర్‌పై డ్రోన్ దాడి
- పశ్చిమాసియాలో యుద్ధం మరింత విస్తరించే సంకేతాలు

వాషింగ్టన్/టెహ్రాన్, వెలుతురు, జూలై 30:

అమెరికా–ఇరాన్ మధ్య ఘర్షణలు మరోసారి తీవ్రరూపం దాల్చాయి. జోర్డాన్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులకు ప్రతిగా దక్షిణ ఇరాన్‌లోని పలు లక్ష్యాలపై అమెరికా సైన్యం భారీ దాడులు చేపట్టినట్లు ప్రకటించింది. ఈ పరిణామాలతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మళ్లీ పతాకస్థాయికి చేరగా, యుద్ధం మరిన్ని దేశాలకు విస్తరించే ప్రమాదం నెలకొంది.

జోర్డాన్‌లోని తమ ఎయిర్‌బేస్‌లు, సైనిక స్థావరాలపై జరిగిన దాడులను అమెరికా తీవ్రంగా పరిగణించింది. ఈ నేపథ్యంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ, దాడులకు పాల్పడిన వారిని "గట్టిగా దెబ్బకొడతాం" అని హెచ్చరించారు. అనంతరం అమెరికా బలగాలు దక్షిణ ఇరాన్‌లోని ఖేష్మ్ ద్వీపం, అణు విద్యుత్ కేంద్రం ఉన్న బుషెహర్ తీర ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకుని దాడులు నిర్వహించినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఖేష్మ్ ద్వీపంలోని నివాస ప్రాంతాలపై కూడా క్షిపణులు పడినట్లు ఇరాన్ స్థానిక మీడియా పేర్కొంది.

మరోవైపు, జోర్డాన్‌లోని అమెరికా ఎయిర్‌బేస్, కమాండ్ సెంటర్‌ను తామే లక్ష్యంగా చేసుకున్నామని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ప్రకటించింది. అమెరికా బెదిరింపులు కొనసాగినంతకాలం తమ ప్రతిఘటన కూడా కొనసాగుతుందని హెచ్చరించింది. అయితే ఇరాన్ ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణులను విజయవంతంగా అడ్డుకున్నామని అమెరికా సెంట్రల్ కమాండ్ తెలిపింది. అదే సమయంలో ఇరాన్‌కు చెందిన డజన్ల కొద్దీ సైనిక లక్ష్యాలపై దాడులు చేసినట్లు వెల్లడించింది.

ఇదిలా ఉండగా, ఘర్షణలు ఈజిప్ట్‌కూ విస్తరించడం ఆందోళన కలిగిస్తోంది. ఈజిప్ట్‌లోని డమియెట్టా పోర్టులో అమెరికాకు చెందిన ఎల్ఎన్‌జీ గ్యాస్ ట్యాంకర్‌పై డ్రోన్ దాడి



జరిగినట్లు సమాచారం. లోడింగ్ పనులు జరుగుతున్న సమయంలో జరిగిన ఈ దాడితో భారీ అగ్నిప్రమాదం సంభవించగా, మంటలు సమీపంలోని మరో ట్యాంకర్‌కు కూడా వ్యాపించాయి. అత్యవసర బృందాలు వెంటనే స్పందించి నౌకల్లో ఉన్న సిబ్బందిని సురక్షిత ప్రాంతాలకు తరలించాయి.

ఫిబ్రవరి 28 నుంచి కొనసాగుతున్న అమెరికా–ఇరాన్ ఘర్షణలు ఇప్పటికే ప్రపంచ ఇంధన మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. మధ్య మధ్యలో దౌత్య చర్చలతో కాల్పుల విరమణ జరిగినప్పటికీ, మళ్లీ దాడులు ప్రారంభం కావడంతో శాంతి ప్రయత్నాలకు ఎదురుదెబ్బ తగిలినట్లయింది. ఘర్షణలు మరిన్ని దేశాలకు విస్తరించే అవకాశం ఉందన్న ఆందోళన అంతర్జాతీయ సమాజంలో వ్యక్తమవుతోంది.

# రికార్డులు భద్రపరచండి

- నీట్ నిరసనలపై దాడుల కేసులో కీలక పరిణామం
- పెల్లెట్ గన్స్ వినియోగంపై సుప్రీం సంచలన వ్యాఖ్యలు
- కేంద్రానికి రికార్డులు భద్రపరచాలని ఆదేశం
- యశోవర్ధన్ ఆజాద్ నేతృత్వంలో పిల్ దాఖలు
- రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పిటిషనర్ల వాదన**
- ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ వాడిన ఆయుధాలపై నివేదిక
- పూర్తి వివరాలు కోరిన అత్యున్నత న్యాయస్థానం

న్యూఢిల్లీ, వెలుతురు, జూలై 30:

దేశ రాజధాని ఢిల్లీలో నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ఆరోపణలకు వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్‌ఏఎఫ్) బలగాలు పెల్లెట్ గన్స్ ఉపయోగించడంపై అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు గురువారం రోజున అత్యంత కీలకమైన ఆదేశాలు జారీ చేసింది. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన ఆందోళనల సందర్భంగా విధుల్లో ఉన్న పోలీసులు మరియు ఆర్‌ఏఎఫ్ బలగాలు వాడిన మందుగుండు సామగ్రికి సంబంధించిన అన్ని రికార్డులను భద్రపరచాలని కేంద్ర ప్రభుత్వాన్ని ధర్మాసనం ఆదేశించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ ప్రజాహిత వ్యాజ్యంపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి ఈ వ్యాఖ్యలు చేసింది.

కేంద్ర సమాచార కమిషన్ మాజీ కమిషనర్, విశ్రాంత ఐపీఎస్ అధికారి యశోవర్ధన్ ఆజాద్‌తో పాటు పెల్లెట్ గాయాల బారిన పడిన ఇద్దరు బాధితులు సంయుక్తంగా సుప్రీంకోర్టులో ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. శాంతియుత రీతిలో తమ నిరసనలు తెలుపుతున్న పౌరులు, విద్యార్థులపై లోహంతో తయారైన పెల్లెట్లను ప్రయోగించడం పౌర హక్కులను కాలరాయడమేనని, ఇది రాజ్యాంగ స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధమని పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది వృందా గ్రోవర్ కోర్టులో గట్టిగా వాదించారు. దేశవ్యాప్తంగా ఎలాంటి ఆందోళనల్లోనైనా పెల్లెట్ గన్స్ వాడకాన్ని శాశ్వతంగా నిషేధించాలని, ఈ దాడుల్లో గాయపడిన వారికి ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం, ఉచిత వైద్యం మరియు పునరావాసం కల్పించాలని వారు కోర్టును అభ్యర్థించారు.

ఈ వాదనలు విన్న ధర్మాసనం, కేంద్ర ప్రభుత్వం తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న సొలిసిటర్ జనరల్



తుషార్ మెహతాను ఉద్దేశించి కీలక ఆదేశాలిచ్చింది. జులై 20న జంతర్‌మంతర్ వద్ద విధుల్లో ఉన్న భద్రతా సిబ్బంది వాడిన ఆయుధాలు, మందుగుండు వివరాల రికార్డులను భద్రపరచాలని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (బీపీఆర్‌డీ) జారీ చేసిన నిర్దేశిత మార్గదర్శకాలను ధర్మాసనం ప్రస్తావించింది. అసాధారణ పరిస్థితులు ఎదురైనప్పుడు మాత్రమే పెల్లెట్ గన్స్ ఉపయోగించే అధికారం పోలీసులకు ఉంటుందని అంగీకరిస్తూనే, ప్రస్తుత నీట్ నిరసనల కేసులో వాటిని ఏ పరిస్థితుల్లో, ఎలా వాడారనే విషయాన్ని సమగ్రంగా పరిశీలించడానికి తాము సిద్ధంగా ఉన్నామని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది.

మరోవైపు, నిరసనల సమయంలో పెల్లెట్ గాయాల బారిన పడిన బాధితులకు తక్షణమే అత్యుత్తమ స్థాయి వైద్య సదుపాయాలు కల్పించాలని ఢిల్లీ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. బాధితుల ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని చికిత్సలను ఉచితంగా అందించాలని సూచించింది. సీజేపీ ఆధ్వర్యంలో జులై 20న చేపట్టిన "సంసద్ చలో" కార్యక్రమం సందర్భంగా పోలీసులు అనుసరించిన తీరుపై, ప్రయోగించిన బలాప్రయోగంపై ప్రత్యేకంగా విచారణ జరుపుతామని ధర్మాసనం సంకేతాలు ఇచ్చింది. ఈ వ్యవహారంలో చట్ట అమలు సంస్థలు ప్రొటోకాల్ పాటించాయా లేదా అనే అంశంపై కేంద్ర, ఢిల్లీ ప్రభుత్వాలు సమర్పించే నివేదికలు ఎంతో కీలకం కానున్నాయి.కాగా, గత మంగళవారం కూడా ఈ అంశంపై స్పందించిన సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పోలీసుల అత్యుత్సాహం మరియు అదనపు బలప్రయోగంపై నిష్పాక్షిక విచారణ జరిపేందుకు ప్రత్యేక విచారణ బృందాన్ని (సిట్) ఎందుకు ఏర్పాటు చేయకూడదని ప్రభుత్వాన్ని నిలదీసింది. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే అధికారం ఎవరికీ లేదని, నిర్దేశిత ప్రొటోకాల్స్ ఉల్లంఘించిన అధికారులు ఎవరైనా సరే చట్టప్రకారం చర్యలు తప్పవని తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది.అదేవిధంగా, నిరసనల సమయంలో అదుపులోకి తీసుకున్న లేదా అరెస్టు చేసిన 18 ఏళ్లలోపు విద్యార్థుల విషయంలో ధర్మాసనం మానవతా దృక్పథంతో స్పందించింది. ఎలాంటి నేరచరిత్ర లేని మైనర్ విద్యార్థులను తక్షణమే విడుదల చేయాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. అయితే కేసుల దర్యాప్తును మాత్రం చట్ట పరిధిలో కొనసాగించవచ్చని స్పష్టం చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమర్పించే పూర్తి వివరాల ఆధారంగా తదుపరి విచారణలో సుప్రీంకోర్టు మరిన్ని కీలక ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంది.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com